





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



జపాన్ ప్రధానమంత్రి ఇషిబా 'రాజీ'నామా
జెరూసలెంలో 15వేల మంది నిరసన ర్యాలీ
థాయ్‌లాండ్ ప్రధానిగా అనులెన్ ప్రమాణస్వీకారం
02



సంపుటి 08, సంచిక: 278 | సోమవారం | 8-09-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## ప్రశాంతంగా నిమజ్జనోత్సవం
# సిఎం అభినందనలు

ప్రజాపక్షం/హైదరాబాద్



హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగియడం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తొమ్మిది రోజుల పాటు భక్తులు గణ నాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, ఘనంగా వీడ్కోలు పలికారన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది విగ్రహాలు క్రమపద్ధతిలో నిర్దేశిత సమయానికి ట్యాంక్‌బండ్‌తో సహా మిగతా అన్ని ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగించేందుకు సహకరించిన ప్రజలందరికీ సిఎం అభినందనలు తెలిపారు. తొమ్మిది తరువాయి 2లో

## ఆర్చరీ చరిత్రలో
# భారత్ సంచలనం!

**ఒక స్వర్ణం, ఒక రజతం సాధించిన ఆర్చర్లు**

**గ్వాంగ్‌జూ :** ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించింది. ఒక స్వర్ణ పతకం, ఒక రజత పతకం సాధించి భారత్ ఆర్చరీకి కొత్త ఊపునిచ్చింది. ఈ విజయం భారత క్రీడల చరిత్రలో ఓ సువర్ణాధ్యాయంగా నిలిచిపోయింది. భారత పురుషుల కాంపౌండ్ ఆర్చరీ జట్టు ఆదివారం జరిగిన ఫైనల్లో బలమైన ఫ్రాన్స్ జట్టును ఓడించి ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో తమ మొదటి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఈ జట్టులో ప్రథమేశ్ ఫుగే, అమన్ సైనీ, రిషబ్ యాదవ్ ఉన్నారు. ఫైనల్లో భారత జట్టు ఫ్రాన్స్‌ను 235–233 పాయింట్ల తేడాతో తరువాయి 12లో




# ఓటమి భయంతోనే...

**తొమ్మిదేళ్ల తర్వాత జిఎస్‌టి స్లాబ్‌ల తగ్గింపు : సిపిఐ విమర్శ**

- జిఎస్‌టి కౌన్సిల్‌ను సంస్కరించాలి
- ట్రంప్ ప్రలోభాలకు లొంగిన మోదీ
- వివిధ రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలకు బిజెపి భస్మాసుర హస్తంగా మారింది
- బిఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతిపై కవిత చేసిన వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి దర్యాప్తు చేయాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపికి వ్యతిరేక పవనాలు వీస్తుండడంతో పాటు బిహార్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే తొమ్మిదేళ్ల తర్వాత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జిఎస్‌టి స్లాబులను తగ్గించిందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు.జిఎస్‌టి కౌన్సిల్‌ను సంస్కరించాలని డిమాండ్ చేశారు. అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేకమైన అన్ని దేశాలనూ కలుపుకున్నప్పుడే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిగొస్తారని ప్రధాని మోదీకి సూచించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయకపోతే బిజెపి, బిఆర్‌ఎస్‌ల మధ్య అవగాహన ఉందని అనుకునే పరిస్థితి వస్తుందని నారాయణ అన్నారు. హైదరాబాద్‌లని మఖ్దూం భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు,సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహతో కలిసి నారాయణ మాట్లాడుతూ తాము మొదటి నుంచి కూడా జిఎస్‌టి వల్ల ప్రజలకు భారమని చెబుతున్నప్పటికీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పట్టించుకోలేదని, తొమ్మిదేళ్ల పాటు ప్రజలను దోచుకున్నారని దుయ్యబట్టారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రస్తుతం ప్రధాని మోదీ లొంగిపోయారని, బానిమనస్తత్వంతో ఉన్నారని మండిపడ్డారు. వివిధ రాష్ట్రాలలోని రాజకీయ పార్టీలకు బిజెపి ఒక భస్మాసూర హస్తంగా మారుతోందని ఎద్దేవా చేశారు. వివిధ రాష్ట్రాలలోని ప్రాంతీయ తరువాయి 2లో

## 'ప్రాణహిత-చేవెళ్ల'ను తిరిగి చేపట్టండి

**జస్టిస్ సుదర్శన్ రెడ్డికి బిఆర్‌ఎస్ ఓటు వేస్తుందో లేదో స్పష్టంచేయాలి**

**యూరియా సరఫరాపై సిఎం కేంద్రానికి లేఖ రాయాలి : కూనంనేని**

గత ఉప రాష్ట్రపతి ఎన్నికలో తెలుగు వ్యక్తి అని వెంకయ్యనాయుడుకు మద్దతు ఇచ్చిన బిఆర్‌ఎస్, ప్రస్తుత ఎన్నికల్లో కూడా తెలుగువ్యక్తి, తెలంగాణ బిడ్డ, జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేస్తుందా?, లేదా? స్పష్టత ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు వివిధ సందర్భాల్లో కేంద్రంలోని బిజెపికి మద్దతుగా బిఆర్‌ఎస్ ఎప్పుడూ ఓటు వేయకుండా లేదని గుర్తు చేశారు. బిఆర్‌ఎస్ విలీనం అవుతందా? ఉంటుందా? కబళించ బడుతుందా? అనే రకరకాల ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత కీలక సమయంలో ఇప్పటికైనా బిఆర్‌ఎస్ స్పష్టత ఇవ్వాలన్నారు. ఉప రాష్ట్రపతి తరువాయి 2లో

## ఉపరాష్ట్రపతిని దేశంపై ప్రేమతో
# ఎన్నుకోండి

- రాజ్యసభను ప్రజాస్వామ్యదేవాలయంగా మారుస్తా
- ఎంపీలకు 'ఇండియా' అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** తమ తమ రాజకీయపార్టీల పట్ల విధేయతతో కాకుండా దేశంమీద ప్రేమతో ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవాలని ప్రతిపక్ష 'ఇండియా కూటమి' అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. పార్టీకి విధేయత ప్రకటించి అందుకు అనుగుణంగా ఆ మార్గదర్శకత్వంలో ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిని ఎన్నుకోవద్దని, ఈ పదవీ బాధ్యత తనకు అప్పగిస్తే రాజ్యసభను ఒక నిజమైన ప్రజాస్వామ్య దేవాలయంగా తీర్చిదిద్ది అందరికీ పూర్తి భరోసా ఇస్తానని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆదివారం విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. తనకోసం ఎంపీల మద్దతు కోరడంలేదని, దేశ సార్వభౌమాధికార



ప్రజాస్వామ్య గణతంత్ర వ్యవస్థ నిర్వచించిన విలువలకు మద్దతు ఇచ్చేందుకు తనకు ఓటు వేయాలని ఎంపీలను తరువాయి 2లో

## జస్టిస్ సుదర్శన్ రెడ్డికి
# మద్దతు ఇవ్వండి

- మేధావులు, సీనియర్ సంపాదకులు విజ్ఞప్తి
- టిడిపి, జనసేన, వైసిపి కూడా పునరాలోచన చేయాలని వినతి

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి తీర్పులు మైలురాయిగా నిలిచాయని ప్రశంస

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపరాష్ట్రపతి అభ్యర్థి, తెలంగాణ రాష్ట్రానికి చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి బిఆర్‌ఎస్ మద్దతు తెలపాలని మేధావులు, సీనియర్ సంపాదకులు కోరారు. టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాన్, వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పునరాలోచన చేసి తెలుగువారైన జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి సంఘీభావంగా పౌర సమాజం తరపున హైదరాబాద్, బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల తరువాయి 2లో




పక్కా ప్లాన్‌తో కార్మికుడిగా చేరి
డ్రగ్స్ తయారీ సంస్థపై ముంబయి పోలీసుల దాడి
స్వాధీనం చేసుకొన్న ముడి సరుకు ముంబయికి తరలిస్తున్న పోలీసులు
03




## క్షిపణి దాడుల్లో ఉక్రేన్
# మంత్రివర్గ భవనం ధ్వంసం

**805 డ్రోన్లు, 13 క్షిపణులతో రష్యా భీకరదాడి**

**చంటిబిడ్డ సహా నలుగురు మృతి**

**రష్యా ఆయిల్ పైపులైనుపై ఉక్రేన్ దాడి**

కీవ్: ఉక్రేన్‌కు సెక్యూరిటీ గ్యారంటీల వివాదం ముదిరిపాకాన పడుతున్న తరుణంలో రష్యా మరోసారి కీవ్ నగరంపై భారీ దాడులు చేసింది. మొట్టమొదటిసారి ఉక్రేన్ ప్రధాన ప్రభుత్వ కార్యాలయ భవంతులు క్షిపణి దాడుల్లో ధ్వంసమయ్యాయి. ఈ దాడుల్లో ఉక్రేన్ మంత్రివర్గ భవంతి మంటల్లో చిక్కి పొగలుకక్కింది. నివాసిత ప్రాంత భవంతులపై జరిగిన దాడుల్లో ఏడాది వయసుగల చంటి బిడ్డ సహా నలుగురు మరణించగా, మరో 44 మంది గాయపడినట్లు దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. 56 డ్రోన్లు, తొమ్మిది క్షిపణులు 37 ప్రాంతాల్లో దాడులు చేశాయి. ఉక్రేన్ కూడా రష్యా ఆయిల్ పైపు లైన్లపై దాడులు చేసింది. 69 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా సైనికవర్గాలు ప్రకటించాయి. ఆదివారం తెల్లవారకముందే 805 డ్రోన్లు, క్షిపణులు, డెకోయ్‌లు, జెట్‌లతో రష్యా దాడులు తరువాయి 12లో

## ట్రంప్ సుంకాలతో
# మోదీ దేశానికి శత్రువయ్యారు!

- వారిద్దరూ స్నేహితులు కావచ్చు కానీ...

ముందు దేశమే, ఆ తరువాతే స్నేహం : ఖర్గే

**కలబురగ్గి :** అమెరికా భారత్‌పై విధించిన సుంకాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్నేహితులు కావచ్చు, కానీ మోదీ దేశానికి శత్రువు అయ్యారన్నారు. ఆదివారం ఖర్గే కలబురగిలో విలేకరులతో మాట్లాడారు. మోదీ, ట్రంప్ ఒకరికొకరికి ఓట్లు కావాలి అందువల్ల వారు మారు మంచిగా ఉండవచ్చని అన్నారు. మోదీ–డోనాల్డ్ ట్రంప్ పొత్తు భారత్‌కు ఖర్చుతో కూడుకున్నదని ఖర్గే పేర్కొన్నారు. ట్రంప్, మోదీ స్నేహితులు కావచ్చు, కానీ మోదీ దేశానికి శత్రువుగా మారారని, అతను వాతావరణాన్ని పాడుచేశారని ఆరోపించారు. అమెరికా సుంకాలు భారతదేశంపై చూపిన ప్రభావంపై ఖర్గే వ్యాఖ్యానిస్తూ ట్రంప్ భారీ సుంకాన్ని తరువాయి 12లో



## బిసిలకు 42 శాతం కోటాను
# బిజెపి అడ్డుకుంటోంది

**మతం, దేవుడి పేరు చెప్పి రాజకీయం చేస్తోంది**


**టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ**

మంత్రులతో కలిసి 15న కామారెడ్డిలో జరిగే బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాపక్షం/నిజామాబాద్/ కామారెడ్డి



బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకాకుండా బిజెపి అడ్డుకుంటోందని, ఆ పార్టీ ఎప్పుడూ మతం, దేవుడి పేరు చెప్పి రాజకీయం చేస్తోందని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. కేంద్రమంత్రి బండిసంజయ్, ధర్మపురి అర్వింద్ బిసిల గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. అవినీతి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## వచ్చేనెల ఎపెక్ సదస్సులో ట్రంప్–జిన్‌పింగ్ భేటీ!

**న్యూయార్క్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్ వచ్చేనెల దక్షిణకొరియాలో సమావేశమయ్యే అవకాశాలున్నాయి. ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార సదస్సు (ఎపెక్) అక్టోబరునెలలో దక్షిణ కొరియాలో జరుగుతుంది. ఈ సదస్సుకు ట్రంప్, జిన్‌పింగ్ ఇద్దరూ హాజర వుతున్నారు. ఈ సందర్భంగానే వారిద్దరూ విడిగా ముఖాముఖి సమావేశం జరిపే అవకాశాలు ఉన్నాయని అమెరికా మీడియా ఆదివారం ప్రకటించింది. ఐతే దీనికి సంబంధించి అధికారిక ఒప్పందం ఏదీ ఇంతవరకూ జర గలేదు. ఎపెక్ సదస్సుకు ట్రంప్ హాజరవుతున్నారని వైట్‌హౌస్ వర్గాలు ధృవీ కరించాయి. ఈ సదస్సులో ఆర్థిక,వాణిజ్య, ఇంధన,రక్షణ,పౌర సంబంధ సహకార ఒప్పందాలపై ట్రంప్ చర్చల్లో పాల్గొంటారు. అక్టోబరు 31, నవం బరు 1వ తేదీలలో గ్యోంగ్జులో ఈ సదస్సు జరుగుతుంది. ఈ సమావేశం తర్వాత ట్రంప్ ఉత్తర కొరియాలో కిమ్ జోంగ్ ఉన్‌ను కూడా కలుసుకునే అవకాశాలున్నాయని కూడా మీడియా తెలియజేసింది.



## జెరూసలెంలో 15వేలమంది నిరసన ర్యాలీ

నెతన్యాహూపై ఇజ్రాయెల్ ప్రజల ఒత్తిడి

**జెరూసలెం :** హమాస్‌వద్ద ఉన్న బందీలను విడిపించేందుకు ఒక ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ జెరూసలెంలో ఆదివారం సాయంత్రం వేలాది మంది ఇజ్రాయెలీ ప్రజలు భారీ ప్రదర్శన చేశారు. అదే సమయంలో రాజ ధాని టెల్‌అవీవ్‌లో కూడా భారీ ప్రదర్శన జరిగింది. ఇటీవలికాలంలో ఇంత భారీ ప్రదర్శన వేలాదిమందితో జరగలేదు. గాజాలో హమాస్ సంస్థ వద్ద ఉన్న ఇజ్రాయెల్ బందీలను విడుదల చేసేందుకు ప్రధానమంత్రి నెతన్యాహూ ఒప్పందం చేసుకోవాలి, గాజాలో యుద్ధం విరమించాలి, మా ఆత్మీయులను మాకు అప్పగించాలి" అని డిమాండ్ చేస్తూ బందీల బంధువులు,ఆత్మీ యులు,మిత్రులు,గల్లంతైనవారి కుటుంబాలు వేదిక ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. హమాస్‌వద్ద ఇంకా 40 మంది ఇజ్రాయెలీ పౌరులు బందీలుగా ఉన్నారని, వీరిలో 20 మందిపైగా సజీవులుగా ఉన్నారని బందీల బంధువులు అనుమానిస్తున్నారు. వారిని ఒకేసారి విడిపించాలని కోరుతూ గడచిన రెండేళ్లలుగా ఇజ్రాయెల్‌లో దాదాపు ప్రతిరోజూ నిరసన ప్రదర్శనలు జరుగుతు న్నాయి. హమాస్‌తో ఒక ఒప్పందానికి చేరువైనట్లు ట్రంప్ ప్రకటించిన తర్వాత ఈ నిరసన ప్రదర్శనలు మరింత ఉధృతరూపం దాల్చాయి.

## చైనాలో అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన

**బీజింగ్ :** చైనా ఫుజియన్ రాష్ట్రం జియామెన్‌లో సోమవారం నుండి గురు వారం వరకూ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన జరుగుతుంది. ఈ ప్రదర్శ నలో 120 దేశాలు పాల్గొంటున్నాయి. 1.2 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. 100 మంది పెట్టుబడిదారులు పాల్గొంటారు. దాదాపు 500 కంపెనీలు, బహుళజాతి సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొం టాయి. అనేక సెమినార్లు, పరిశ్రమల అభివృద్ధి,ప్రోత్సాహానికి సంబంధించిన సదుపాయాల వివరణలు ఇక్కడ తెలియజేస్తారు.

# జపాన్ ప్రధానమంత్రి ఇషిబా 'రాజీ'నామా



**టోక్యో :** జపాన్ ప్రధానమంత్రి షిగెరు ఇషిబా (78)పై అధికార లిబరల్ డెమొక్రటిక్‌పార్టీ (ఎల్ డిపి)లో తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత పెరుగు తున్న తరుణంలో ఆయన రాజీనామా ప్రకటన చేశారు. ప్రస్తుతం ఆయనే పార్టీ అధ్యక్షుడు కూడా. సెప్టెంబరులో పార్టీ అధ్యక్ష పదవి ఎన్ని కల్లో పోటీ చేయదలచుకోలేదని ఇంతకుముందే ఆయన ప్రకటించారు. అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించాలా? వద్దా? అని పార్టీ నిర్ణయించ డానికి ఒకరోజు ముందుగానే రాజీనామా ప్రక టన చేశారు. పట్టుమని ఆయన ఏడాది కూడా పదవిలో కొనసాగలేదు. తదుపరి ప్రధానమంత్రి పదవి చేపట్టేందుకు కొయిజుమి తోపాటు మాజీ మంత్రి సనాయే తకైచి, ప్రధాన మంత్రివర్గ కార్యదర్శి యషిమాసా హయషి, మాజీ ప్రధాన మంత్రి ఫుమియో కిషిదాలకు అవకాశాలు ఉన్నాయి. జులైలో జరిగిన పార్లమెంటరీ (హౌస్ ఆఫ్ కౌన్సిలర్స్) ఎన్నికల్లో లిబరల్ డెమొక్రటిక్ పార్టీ చారిత్రక అపజయాన్ని మూటగట్టుకుంది. వరుసగా రెండు ఎన్నికల్లో ఆయన హయాంలో పార్టీ ఓటమి ఎదుర్కొంది. దీనికి బాధ్యత వ హిస్తూ ఆదివారం పదవి నుండి వైదొలగాలన్న ఉద్దేశాన్ని ప్రకటించారు. 248 మంది సభ్యు లున్న ఎగువసభకు గడచిన జులై 20న జరిగిన ఎన్నికల్లో పార్టీ పేలవమైన ఫలితాలు సాధిం చింది. గడచిన సెప్టెంబరులో ఎల్‌డిపి అధ్యక్ష పదవి చేపట్టి అక్టోబరు న 25న ఎల్‌డిపి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టి 9న దిగువసభను రద్దు చేశారు. తర్వాత ఎన్నికల్లో స్వల్పమెజారి టీతో గెలిచి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి పదవిలో కొనసాగారు. ఉభయసభల్లోనూ ఎల్‌డిపి పికి తగిన మెజార్టీ లేకపోవడంతో తదుపరి ప్రధానమంత్రి బిల్లులను ఆమోదించడానికి పార్లమెంటులో ప్రతిపక్షాలతో సమన్వయంతో అణగిమణగి వ్యవహరించాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. గతంలో ఆయన పదవిలో కొన సాగాలని బలంగా ఆశించినప్పటికీ, ఐతేవల ప్రజల్లో ఆయనపట్ల తీవ్ర వ్యతిరేకత పెరిగింది. దేశంలో పెరుగుతున్న ధరలు, సమస్యల పరిష్క రించడంలో వైఫల్యం కారణంగా ఇషిబా ప్రజల మద్దతు కోల్పోయారు. దీంతో అధికారపార్టీలో కూడా తీవ్ర అసంతృప్తి పెరిగింది. దీంతో షిగెరు ఇషిబా ఆదివారం రాజీనామా ప్రకటన చేసినట్లు జపనీస్ దినపత్రిక ప్రకటించింది. గత ఏడాది అక్టోబరు ఒకటో తేదీన నేషనల్ డైట్ ఆమో దంతో ఇషిబా ప్రధానమంత్రి బాధ్యతలు చేప ట్టారు. ఈ ఏడాది సెప్టెంబరు ఏడో తేదీన రాజీ నామా ప్రకటన చేశారు. 1986 నుండీ ఆయన జపాన్ పార్లమెంటు ప్రతినిధులసభలో సభ్యు డుగా కొనసాగుతున్నారు.రక్షణమంత్రిగా, హోంశాఖామంత్రిగా, వ్యవసాయశాఖామం త్రిగా, అటవీ,మత్స్యశాఖామంత్రిగా, పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. గత ఏడాది ఆయన పార్టీ అధ్యక్ష బాధ్యతలు కూడా చేప ట్టారు. ఇషిబా రాజకీయ కుటుంబంలో జన్మిం చారు. ఆయన తండ్రి జిరో ఇషిబా తొట్టోరి ప్రిఫె క్చర్ గవర్నర్‌గా పనిచేశారు.

# థాయ్‌లాండ్ ప్రధానిగా అనుటెన్ ప్రమాణస్వీకారం

మళ్ళీ త్వరలో ఎన్నికలకు వాగ్దానం



**బ్యాంకాక్ :** థాయ్‌లాండ్ ప్రధానమంత్రిగా అనుటిన్ చార్న్ విరాకుల్ (58) ఆదివారం పద వీబాధ్యతలు తీసుకున్నారు. త్వరలో దేశంలో ఎన్నికలు నిర్వహిస్తానని, ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతానని వాగ్దానం చేశారు. అనుటిన్ దేశంలో సీనియర్ రాజకీయవేత్త, వ్యాపారవేత్త. గడచిన జూన్ నెలలో కాంబోడియా మాజీ నేతతో టెలిఫోన్ వివాదంలో చిక్కుకున్న ప్రధాన మంత్రి పేటోంగ్‌టార్న్ షినవత్ర గతవారంలో న్యాయస్థానం ద్వారా పదవీచ్యుతురాలయ్యారు. అనుటిన్ చార్న్ విరాకుల్ ఇంతకుముందు అధి కార ఫూథాయ్‌పార్టీ కూటమి ప్రభుత్వంలోనే ఉండేవారు. పేటోంగ్‌టార్న్ షినవత్రతో విభే దించి పార్టీ నుండి బయటకువెళ్ళి భూంజై థాయ్ పార్టీ నాయకుడుగా కూటమిలో ఉంటూ సమయంకోసం వేచి ఉన్న తర్వాత ఇప్పుడు ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు.

పేటోంగ్‌టార్న్ షినవత్ర తండ్రి తక్షిన్ షినవత్ర స్థాపించిన థాయ్ రాక్ థాయ్ పార్టీలో చేరి రాజ కీయ జీవితాన్ని ప్రారంభించిన అనుటిన్ క్రమంగా ఎదుగుతూ వచ్చారు. 2019 2023లలో జరిగిన ఎన్నికల్లో కూడా రాజకీయ పండితులు ప్రధానమంత్రి పదవికి అనుటిన్ పేరును ముందుకు తీసుకువచ్చారు. కోవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో ఆరో గ్యశాఖామంత్రిగా అనుటిన్ చక్కటి నిర్వహణతో తన ప్రతిభ నిరూపించుకున్నారు. 2022లో గంజాయిపై నిషేధం తొలగించేసే చట్టం తీసు కురావడంలో ప్రధానపాత్ర పోషించారు. థాయ్ లాండ్ రాజకీయ వ్యవస్థ ఆధిపత్యాన్ని నియంత్రిం చడంలో కూడా ఆయన పాత్రపోషించారు. రాజ కీయ,వ్యాపార కుటుంబంలో జన్మించిన అను టిన్ అమెరికాలో చదువుకున్నారు. 1990లో తండ్రి స్థాపించిన సినో– థాయ్ ఇన్‌స్ట్రక్షన్ కంపెనీలో చేరారు. 2004లో ఆరోగ్యశాఖ సహాయమం త్రిగా పనిచేశారు. 2007లో థాయ్ రాక్ పార్టీ కోర్టు ఉత్తర్వుతో రద్దు కావడం, అనుటిన్‌పై ఐదేళ్ళు రాజకీయ నిషేధం పూర్తయిన తర్వాత 2012లో తిరిగి ఆయన క్రియాశీల రాజకీయా ల్లోకి వచ్చారు. 2023 నుండి ఇప్పటివరకూ ఫూథాయ్ అధికార కూటమిపార్టీలో రెండుసార్లు హోంమంత్రిగా పనిచేశారు.





## నేషనల్ గార్డ్స్‌కు వ్యతిరేకంగా వాషింగ్టన్ డిసిలో వేలాదిమంది భారీ ప్రదర్శన

**వాషింగ్టన్ :** నేషనల్ గార్డ్ ట్రూప్స్ గస్తీ, భద్రతల నుండి దేశ రాజధాని వాషిం గ్టన్ డి సిని విముక్తి చెయ్యాలని, ఎన్‌జిటి మోహరింపు చర్యలు తీసుకోవద్దని ట్రంప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వేలాదిమంది ప్రదర్శన చేశారు. దేశరా జధానిలో నేషనల్ గార్డ్స్‌ను మోహరించేందుకు ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వు ప్రకారం వేలాదిమంది గార్డ్స్ వాషింగ్టన్ వీధుల్లో నిరం తరం గస్తీ నిర్వహిస్తూ ఉంటారు. ఈ గస్తీ దళాలనుండి రాజధాని నగరాన్ని విముక్తి చేయాలని కోరుతూ వేలాదిమంది ప్రజలు ఈ ఏడాదిలో ఎన్నడూలే నంత భారీస్థాయిలో ప్రదర్శన జరిపారని రాయిటర్స్ వార్తాసంస్థ ప్రకటిం చింది. ఈప్రదర్శనలో వలస వ్యతిరేక నినాదాలతోపాటు ఇజ్రాయెల్ వ్యతిరేక నినాదాలు కూడా హోరెత్తాయి. అధికారిక డాక్యుమెంటు లేవనే సాకుతో లక్ష లమంది ప్రజలను దేశం నుండి బయటకు తరలించడాన్ని కూడా ప్రదర్శ కులు తీవ్రంగా వ్యతిరేకించారు. నినాదాలు చేశారు. గాజాలో యుద్ధం విర మించాలని కూడా వారు డిమాండ్ చేశారు. రాజధానిలో ఫెడరల్ ప్రభుత్వ పెత్తనం ఉండకూడదని, వాషింగ్టన్ డిసి హోమ్‌రూల్ అమలు చేయాలని, ఈ రూల్స్‌కు పూర్తి రక్షణ కల్పించాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. దేశరాజ ధానిలో నేరాలు పెరిగిపోయాయంటూ గతనెలలో నేషనల్ గార్డ్స్‌ను ట్రంప్ మోహరించారు. ఈ నగరాన్ని నేరుగా ఫెడరల్ ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకున్నారు. దీనిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.





## మద్దతు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో సీనియర్ సంపాదకులుకె.రామచం ద్రమూర్తి, సీనియర్ సంపాదకులు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీని యర్ సంపాదకులు కె.శ్రీనివాస్, ప్రొఫెసర్ హర గోపాల్, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదం డరామ్, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర రావు మాట్లాడారు. హైకోర్టు, సుప్రీం కోర్టులో న్యాయ మూర్తిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇచ్చిన తీర్పులు మైలురాయిగా నిలిచిపోయాయని ప్రొఫెసర్ హర గోపాల్ గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన నిర్వహించిన పాత్ర స్ఫూర్తిదాయకమ న్నారు. చరిత్రలో రాజ్యాంగం కాలక్రమేణ ఎలా పరిణామం చెందింది, రాజ్యాంగ చరిత్ర,న్యాయ శాస్త్రం,విశాల సమాజం,భవిష్య సమాజంపైన సుదర్శన్ రెడ్డికి సమగ్రమైన అవగాహన ఉన్నద న్నారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, విశ్వ విద్యాలయాల్లో ఎందుకు తీవ్రమైన సంక్షోభంలో పడ్డాయని, వాటి భవిష్యత్ ఎమిటనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. రాజ్యాంగ సంస్థలు నిర్వీర్యం అవుతున్న తరుణంలో, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు పార్లమెంట్ సభ్యులు జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటు వేయాలని కోరారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన సుద ర్శన్ రెడ్డిని తాము మద్దతు ఇవ్వబోమని బిఆర్‌ఎస్ చెప్పిందని, కానీ తెలంగాణ అస్తిత్వం కోసం పని చేసిన వ్యక్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి అని హరగోపాల్ గుర్తు చేశారు. రామచంద్ర మూర్తి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నీరు గారిపోయిందని, రాజ్యాం గ విలువలు రోజు రోజుకూ దిగజారిపోతున్నా యని, ఇలాంటి పరిస్థితుల్లో సుదర్శన్ రెడ్డిని గెలి పించాల్సిన బాద్యత తెలుగు రాష్ట్రాల్లోని పార్ల మెంట్ సభ్యులపై ఉందన్నారు. తెలుగు రాష్ట్రా ల్లోని ఐదు రాజకీయ పార్టీలకు చెందిన ఎంపిల ఓట్లు పడితే సుదర్శన్ రెడ్డి గెలుస్తారన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలిస్తే రాజ్యాంగం నిలబడుతుంద న్నారు.డాక్టర్ వనమాల మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ జస్టిస్ సుదర్శన్ రెడ్డితోనే సాధ్యమవు తుందన్నారు. ఆయన గెలుపు తెలుగు రాష్ట్రాల ప్రజలకు గౌరవం పెరుగుతుందన్నారు. ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర రావు మాట్లాడుతూ జస్టిస్ సుద ర్శన్ రెడ్డి సల్వాజుడుం ప్రైవేట్ సైన్యానికి సంబం ధించి తీర్పునిస్తే, ఆయన నక్సలైట్లకు అనుకూల మని ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపునకు అందరూ కృషిచేయాలని కోరారు.రాజ్యాంగ విలువలకు కట్టుబడి, రాజ్యాం గ పునాదులపైన భారత నిర్మాణానికి నిబద్దతో పని చేస్తున్న వ్యక్తి గెలవడం వల్ల భారతదేశానికి ఉపయోగమని అన్నారు. ఇండియా కూటమిలో లేని రాజకీయ పార్టీలు కూడా ఆయనను బలపరు స్తున్నాయని, ఆప్ కూడా మద్దతు ఇస్తుందన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన బిల్లు రూపకల్పనలో జస్టిస్ సుద ర్శన్‌రెడ్డి కీలక బాధ్యత వహించారని, అలాంటి వ్యక్తిని గెలిపించుకునే నైతిక బాధ్యత బిఆర్‌ఎస్ పైన ఉందని అన్నారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆత్మప్రబోధం సాక్షిగా ఉప రాష్ట్రపతిని ఎన్నుకో వాలని కోరారు. టిడిపి, వైఎస్‌ఆర్ పార్టీలు పునరా లోచన చేసి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఉప రాష్ట్రపతి పదవి రాజ్యాంగాన్ని రక్షించే హోదా అని అన్నారు. కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి నక్సలైట్ అనుకూల వ్యక్తి అని బిజెపి ప్రచారం చేసిందని, అలాంటి వ్యక్తిని పదవీ విరమణ చేసిన తర్వాత గోవాలో లోకాయు క్తకు ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. సోషల్ సెక్యూలిరిజం, సెక్యూలరిజం లాంటి పదాలను తొలగించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. సామాజిక న్యాయం అమలుకావడం లేదని, పబ్లిక్ సెక్టార్‌లో రిజర్వేషన్‌లు లేవని అన్నారు. సామాజిక న్యాయాన్ని కాపడటం, రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదించిన వ్యక్తికి ఓటు వేయబోమని చెప్పిన బిఆర్‌ఎస్, ఈ విషయంలో మరోసారి పునరాలోచనచేయాలని సూచించారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా వెంకయ్య నాయుడుకు బిఆర్‌ఎస్ ఓటు వేసిన విషయాన్ని శ్రీనివాస రెడ్డి గుర్తు చేశారు. ఇది రాజ్యాంగాన్ని కాపాడేందుకు జరుగుతున్నఎన్నిక అని అన్నారు. దేశంలో ఇతర రాజకీయ పార్టీలు కూడా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతునిస్తున్నాయని,కెసిఆర్ పునరాలోచన చే యాలని,లౌకికవాది,సెక్యూలరిజంకాపాడే వ్యక్తి గా చంద్రబాబు,అలాగే జగన్‌మోహన్ రెడ్డి, పవన్ కళ్యాన్ కూడా ఆలోచన చేసి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటు వేయాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు.

## 'ప్రాణహిత–చేవేళ్ల'ను తిరిగి చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో బిఆర్‌ఎస్ తనకంటూ ఒక విధానాన్ని స్పష్టం చేయాలన్నారు. కమ్యూనిస్టులుగా తాము అధికారంలో లేకపోయినా నిత్యం ప్రజల పక్షాన నిలబడుతామని,బిఆర్‌ఎస్ కూడా ఉండాలని తాము ఆకాంక్షిస్తున్నామన్నారు.బిజెపి నర మాంస భక్షకులని, అలాంటి బిజెపిని నమ్ము కుంటే దెబ్బతింటారని ఆయన బిఆర్‌ఎస్‌కు సూచించారు.

ప్రాణహితచేవేళ్ల ప్రాజెక్ట్‌ను తిరిగి చేపట్టాలని, 5వ ప్యాకేజీ వద్ద చిన్న ఎత్తిపోతలను నిర్మించాలని సూచించారు. సుందిళ్ల, మేడిగడ్డ, అన్నారం బ్యారే జీలను ఉపయోగిస్తారా? లేదా? ప్రభుత్వం సమా ధానం చెప్పాలని, ఈ బ్యారేజీలను ఉపయోగిస్తే రూ.14వేల కోట్ల విద్యుత్ బిల్లుల ఖర్చు అవుతుం దని వివరించారు. రూ. 36 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్ట్‌ను జస్టిస్ పి.సి ఘోష్ నివేదిక ప్రకారం రూ.1,46,000 కోట్ల అంచనాలు పెరిగాయన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో ఏదో పద్ధతిలో ఆర్థిక లాబాలు, దుర్వినియోగం జరిగిం దని, కేవలం ఇద్దరు, ముగ్గురు అధికారుల వద్దనే వెయ్యి కోట్ల రూపాయలు దొరికాయని కూనం నేని తెలిపారు.


రాష్ట్రంలో ఎంత మేరకు యూరియా డిమాండ్ ఉన్నది..?,సరఫరా ఎంత చేయాలనే విషయమై ముఖ్యమంత్రి వెంటనే కేంద్రానికి లేఖ రాయాలని సూచించారు. రాష్ట్రంలో యూరియా ఎంత అవసరం?, ఇందులో కేంద్రం ఎంత వరకు సరఫరా చేసిందనే విషయమై కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూరియా సరఫరాలోని లోపాలను గుర్తించి, ఒక వేళ బ్లాక్‌మార్కెటింగ్ ఉంటే బయటికి తీయా లని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రైతాంగ అసంతృప్తికి తగ్గించి, వారి సమస్యలను పరిష్కరిం చాలన్నారు.

**రాష్ట్రాలను ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్రంలోని బిజెపికి వ్యతిరేక పోరాటానికి సిఎం పిలుపునివ్వాలి : కూనంనేని**

ప్రతి పక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేపట్టేం దుకు ముఖ్యమంత్రి పిలుపునివ్వాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. జిఎస్‌టి పేరుతో కేంద్రం దోపిడీకి పాల్పడిందన్నారు. ప్రధాని మోదీ పెద్దన్న పాత్రను పోషించడంలేదని, రాష్ట్రంపై పెత్తనం చెలాయిస్తున్నారని దుయ్యబ ట్టారు. బిసిలకు నష్టం జరిగితే ఊరుకోబమని సిఎంను హెచ్చరిస్తున్న బిజెపి, తెలంగాణ రాష్ట్రం ఆమోదించిన బిల్లులను ఆపుతున్నారని, దొంగ నాటకాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. బిసి బిల్లులను ఆమోదించి తమ చిత్తశుద్ధిని నిరూపిం చుకోవాలని ఆయన బిజెపికి సూచించారు.సిబిఐ తన స్వతంత్రతను కోల్పోయిందని, కేంద్ర ప్రభుత్వ ప్రలోభాలకు లొంగుతుందని విమర్శిం చారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సిబిఐ పార దర్శక విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కేసు విషయంలో సిబిఐ న్యాయబద్ధంగా ఉంటుందా?, రాజకీయ ప్రయోజనాలకు సిబిఐని వాడుకుంటారా? లేదా బిఆర్‌ఎస్ మెడపైన కత్తి పెట్టి లొంగతీసుకునేందుకు ప్రయత్నిస్తారా? అనేది చూడాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. సిబిఐ స్వతంత్రంగా వ్యవహరిస్తే వాస్త వాలు బయటికి వస్తాయన్నారు.రాష్ట్రాల హక్కు లను కేంద్రం హరిస్తోందని, రాష్ట్రాలకు ఇవ్వా ల్సిన నిధులు విడదల చేస్తే తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఎందుకొస్తుందని ప్రశ్నించారు. కొన్ని వస్తువులకు జిఎస్‌టి తగ్గించి, మరి కొన్ని వస్తువులకు అదనంగా పెంచారని, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన జిఎస్‌టి నిధులు ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం బకాయిల చెల్లిం పులు, అప్పులలో ఉన్నదని, విభజన హక్కుల చట్టం నుంచి మొదలు అనేక రూపాల్లో కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు, నిధులతో పాటు అదనంగా నిధులను ఇవ్వాలని కేంద్ర ప్రభు త్వాన్ని కోరారు.పోలవరం తరహా తెలంగాణలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వాలని, వివిధ రంగాలకు కేంద్రం సహాయం చేస్తే తెలంగాణ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల నుంచి కొద్దిగా బయట పడుతుందని తెలిపారు.

# డిజిటలైజేషన్ దిశగా టిటిఇ విధులు

రైల్వే సిపిఆర్‌ఒ ఎ.శ్రీధర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వేలో విధులు నిర్వహిస్తున్న ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ (టి టిఇ) విధులు ఇకపై డిజిటలైజేషన్ చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలా చేయడం ద్వారా టిటిఇ విధులు పారదర్శ కంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే టికెట్ తనిఖీ సిబ్బంది కోసం బయో మెట్రిక్ సైన్‌ఆన్‌ను ప్రవేశపెట్టడం ద్వారా మరో అడుగు ముందుకు వేసిందని శ్రీధర్ తెలిపారు. వీరి విధులు పారద ర్శకంగా చేయడానికి ప్రస్తుతం , జోన్ వ్యాప్తంగా ఆరు ట్రావె లింగ్ టికెట్ ఎగ్జామినర్ (టిటిఇ)లాబీలను సికింద్రాబాద్, కాచిగూడ, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్‌లో ప్రయోగాత్మకంగా 'బయో మెట్రిక్ సైన్‌ఆన్/సైన్‌ఆఫ్' ప్రవేశ పెట్టినట్లు ఆయన తెలిపారు. ఆ తరువాత ఈ వ్యవస్థను జోన్ వ్యాప్తంగా ఉన్న అన్ని 73 టిటిఇ లాబీలలో అమలుచేయను న్నట్లు తెలిపారు. గతంలో టికెట్ తనిఖీ సిబ్బంది యొక్క సైన్ ఆన్/సైన్‌ఆఫ్ కార్యాచరణ వినియోగదారు పేరు, పాస్‌వర్డ్ ఉపయోగించి జరిగేది ..ప్రస్తుతం టికెట్ తనిఖీ సిబ్బంది లాగిన్ విధానాన్ని క్రమబద్ధీక రించడానికి, టీ.టి.ఈ లాబీ లలో ఆధార్ ఆధారిత బయో మెట్రిక్ సైన్‌ఆన్,సైన్‌ఆఫ్ కార్యాచరణను ప్రవేశపె ట్టారు. టిటిఇ లాబీ అప్లికేష న్‌లో ఫింగర్ ప్రింట్ పరిక రాన్ని సి డి.ఏ.సి పోర్టల్‌తో సరిగ్గా అనుసంధానించడం ప్రారంభించబడింది. దీని ద్వారా వారి సోర్స్ స్టేషన్, గమ్య స్థాన స్టేషన్‌లో టికెట్ తనిఖీ సిబ్బంది భౌతికంగా ఉండడాన్ని తెలియజేస్తుంది. టికెట్ తనిఖీ సిబ్బంది లాగిన్,లాగౌట్ సమ యాలను వాస్తవ సమయ ప్రాతిపదికన రికార్డ్ చేయబడు తుంది . జోన్‌లో ఈ సాంకేతిక పురోగతిని అమలు చేసినం దుకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సిబ్బందిని అభినందించారని ఆయన తెలిపారు. డిజిటల్ టెక్నాలజీలను అమలు చేయడంలో దక్షిణ మధ్య రైల్వే ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని, ఇందులో భాగంగా ఈ బయో మెట్రిక్ సైన్‌ఆన్ , సైన్‌ఆఫ్ వ్యవస్థ అటు వంటి మరొక డిజిటల్ చొరవ అని, వ్యవస్థలో పారదర్శకతను పెంచుతుందని తెలిపారు.

## సిఎం అభినందనలు

(మొదటి పేజీ తరువాయి)

రోజులపాటు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, అత్యంత భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర ప్రశాం తంగా సాగడంలో అహర్నిశలు పని చేసిన పోలీసు, రెవెన్యూ, విద్యుత్, రవాణా, మున్సిపల్, పంచాయతీ రాజ్ పారిశుధ్య, ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి, ఉత్సవ కమిటీల సభ్యులు, మండపాల నిర్వాహకులు, క్రేన్ ఆపరే టర్లు, భక్తులందరిని సిఎం అభినంధించారు.

## ఓటమి భయంతోనే

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలతో జతకట్టడం లేదా స్నేహంగా ఉంటూ ఆయా పార్టీల నెత్తిపైన భస్మాసూర హస్తంగా మారుతోంద న్నారు. జమ్ముకశ్మీర్‌లోని పిడిపి, మహారాష్ట్రంలో శివ సేన, ఎన్‌సిపిని చీల్చిందని, ఆ పార్టీలను ధ్వంసం చేసిం దని, కుటుంబాల్లో చిచ్చుపెట్టిందని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో కేజ్రీవాల్‌ను జైలుకు పంపించా రని, ఇక తెలంగాణ వంతు అయిందని, కవిత కూడా జైలుకు పోయిందన్నారు. బిఆర్‌ఎస్ ఎప్పుడైతే బిజెపి పంచన చేరిందో ఆ పార్టీ కొంప కొల్లేరయిందని, చివరకు కవిత బయటికి వచ్చి రాజకీయ పార్టీ పెట్టుకునే పరిస్థితికి వచ్చిందన్నారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు పంజాబ్‌లో సిపిఐ జాతీయ మహాసభలు జరగనున్నా యని, ఈ సభలో జాతీయ రాజకీయ, ఇతర పలు అంశా లపై చర్చించనున్నట్టు వివరించారు. కవిత వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి విచారించాలి: బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అంశంలో కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను దర్యాప్తు సంస్థలు సుమోటోగా స్వీకరించి,విచారణ చేపట్టాలని నారాయణ డిమాండ్ చేశారు. కవిత చేసిన వ్యాఖ్యలతో సంబంధం లేదని హరీశ్‌రావు తప్పుకున్నప్పటికీ, కెసిఆర్ మాత్రం బాధ్యతగా సమాధానం చెప్పాలని, లేదంటే కవిత ఆరోపణలు వాస్తవంగా భావించాల్సి వస్తుందన్నారు. బిఆర్‌ఎస్‌లోని అంతర్గత వ్యవహారాలు తమకు సంబంధంల లేదని, కానీ టిఆర్‌ఎస్‌లో మొదటి నుంచి ఆ పార్టీలో క్రీయశీలకంగా ఉన్న కవిత స్వయంగా నిర్దిష్టమైన అవినీతి ఆరోపణలు చేశారని, ఇది ప్రజా సొమ్మికు సంబంధించిన అంశమని నారాయణ అన్నారు.

## దేశంపై ప్రేమతో ఎన్నుకోండి

(మొదటి పేజీ తరువాయి)

కోరుతున్నానని ఆ సందేశంలో తెలియజే శారు. "ఇక్కడేమీ పార్టీ విప్ లేదు, ఓటింగ్ ప్రక్రియలో రహస్య బ్యాలెట్ విధానం అమలులో ఉంది, ఈ ఎన్నిక ఏ రాజకీయపార్టీపట్ల విధేయత చూపించ డానికి కాదు, దేశంమీద ప్రేమను చూపించడానికి అనివార్యంగా ఎంపీలు అభ్యర్థిని ఎంపిక చేసుకోవాలి, మన ప్రియమైన భారతజాతి మూలధ ర్మాన్ని,అంతఃకరణశుద్ధిని కాపాడుకునేం దుకు మీలో ప్రతిఒక్కరూ తమ తమ నైతిక బాధ్యతను ముందుకు తీసుకువె ళ్ళాలి" అని పార్లమెంటు సభ్యులకోసం రూపొందించిన 12 నిమిషాలకుపైగా నిడివిగల ఆ వీడియో సందేశంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పిలుపు ఇచ్చారు.

"ఉపరాష్ట్రపతి పదవీ బాధ్యతలు నాకు అప్పగించడంద్వారా మీరు పార్లమెంటరీ సంప్రదాయాలను మీరు రక్షించినట్లవు తుంది, చర్చల సందర్భంగా సభలో సభ్యులపట్ల ఉండే గౌరవ మర్యాదలను పునరుద్ధరించినట్లవుతుంది, రాజ్యసభను నిజమైన ప్రజాస్వామ్యదేవాలయంగా తీర్చిదిద్దడానికి పూర్తి భరోసా కల్పించిన ట్లవుతుంది" అని తెలియజేశారు. ఇది కేవలం మీరు ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవ డానికి వేసే ఓటు మాత్రమే కాదనీ, భార తదేశ స్ఫూర్తికి వేసే ఓటు అనీ ఉద్ఘాటిం చారు. "మనందరం కలిసి భారతదేశ గణతంత్రాన్ని పటిష్టపరుద్దాం, భవిష్యత్ తరాలు తమ వారసత్వ సందపను చూసి గర్వపడేవిధంగా ఈ ఎన్నిక ద్వారా దేశ స్వాభావిక విలువలను సృష్టిద్దాం" అని కోరారు. మహోన్నతమైన భారత గణతం త్రవ్యవస్థకు ఉపరాష్ట్రపతి పదవికోసం పోటీపడే అభ్యర్థిగా, బాధ్యతగల లోతైన ఆలోచనాదృక్పథంతో, ఎంతో వినయవి ధేయతలతో మీ ముందు తాను నిలబడ్డా నని ఎంపీలను ఆ వీడియో సందేశంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కోరారు.

"మన స్వాతంత్ర్యపోరాట యోధుల మహోన్నతమైన త్యాగాల పునాదుల పైన,అనేక దశాబ్దాలుగా వారు పెంచిపో షించిన దార్శనిక దృక్పథంపైన భారత ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మితమైంది, కానీ అలాంటి విభిన్న ప్రజాస్వామ్య అల్లిక వ్యవస్థను సంరక్షించుకుని,పటిష్ట పరచుకోవాలంటే సమష్టి కృషి ఎంతో అవసరం" అని ఎంపీలకు మరోసారి గుర్తుచేశారు.

ఈనెల తొమ్మిదో తేదీన ఉపరాష్ట్రపతి పద వికి ఎన్నిక జరుగుతుంది. అధికార ఎన్ డిఎ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్, ప్రతిప క్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మధ్య ఈ ప్రత్యక్షపోటీ జరుగుతోంది. ఈసారి ఉపరాష్ట్ర పదవికి పోటీపడే అభ్య ర్థులు ఇద్దరూ దక్షిణాది రాష్ట్రాలకు చెందినవారే. వీరిలో ఎన్‌డిఎ అభ్యర్థి తమిళనాడకు చెందినవారు కాగా, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి చెంది నవారు. ఉపరాష్ట్రపదవికి జరిగే పోటీని ప్రతిపక్షాలు సైద్ధాంతిక యుద్ధంగా పేర్కొ న్నాయి. ఐతే సంఖ్యారీత్యా అధికారపా ర్టీకే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. సుందర్శన్‌రెడ్డి (79) సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా పనిచేసి 2011 జులైలో పదవీ విరమణ చేశారు. నాటి కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ అనేక ప్రముఖ తీర్పులు ఆయన వెలువ రించారు. నల్లధనానికి సంబంధించి కేంద్రం బనాయించిన అనేక బలహీన మైన కేసుల విషయంలో ఆయన కేంద్రాన్ని దునుమాడారు. నక్సలైట్లతో పోరాటం చేసేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సల్వాజు డుంను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ఆయన ప్రకటించారు. దేశంలో లెక్కలు చూపించకుండా విదేశాలకు తరలించి అక్కడి బ్యాంకులలో దాచిపెట్టిన భారీ నగదు మొత్తాన్ని తిరిగి స్వదేశం తరలిం చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అందుకు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని జస్టిస్ రెడ్డి తన తీర్పు ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. గువహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. సుప్రీంకో ర్టులో న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వ హించారు. తెలంగాణలో కులగణనకు నిర్దేశించిన ఒక కమిటీకి ఆయన నాయ కత్వం వహించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిఎంఆర్ అప్పగించని మిల్లర్లపై కఠిన చర్యలు : మంత్రి జూపల్లి

ప్రజాపక్షం/హైదరాబాద్ : మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) పాత బకాయిలను చెల్లించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అవసరమనుకుంటే రెవెన్యూ రికవరీ యాక్టు కింద ఆయా మిల్లుల యజమానుల నుంచి రికవరీ చేయాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఆదివారం సిఎంఆర్ బకాయిలపై వనపర్తి జిల్లా అధికారులతో మంత్రి జూపల్లి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంత వరి ధాన్యం సేకరించారు? జిల్లాల వారీగా మిల్లర్ల నుంచి రావాల్సిన పాత బకాయిలు ?, ధాన్యం సేకరణ? తిరిగి సిఎంఆర్ డెలివరీ ఎంత చేశారు? ఇంకా ఎన్ని బకాయిలు ఉన్నాయి?, బకాయిదారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? స్టాక్ నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు అని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.కీమ్యా నాయక్, డిఎస్‌పి వెంకటేశ్వర్లు, డిఎస్ఒ కాశీ విశ్వనాథం, జిల్లా మేనేజర్ జగన్మోహన్, అసిస్టెంట్ మేనేజర్ బాలు నాయక్, సిఐ కృష్ణయ్య పాల్గొన్నారు



## సత్ఫలితాలిస్తున్న 'మహిళా సమాఖ్య నారాయణపేట పెట్రోల్ బంక్'

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'మహిళా సమాఖ్య నారాయణపేట పెట్రోల్ బంక్' సత్ఫలితాలనిస్తోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఆరు నెలల కాలంలో ఆ 'మహిళా సమాఖ్య' రూ.15.50 లక్షల ఆదాయాన్ని ఆర్జించింది. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి ' పాలసీని పటిష్టంగా అమలు చేస్తోంది. ఒకప్పుడు ఇంట్లో కూర్చుని కుట్లు, అల్లికలు, చిన్న వ్యాపారాలు చేసి కుటుంబానికి చేదోడు,వాదోడుగా నిలిచే మహిళలు ప్రస్తుతం వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నారు. దేశ అభ్యున్నతికి చోదక శక్తిగా ఎదుగుతున్నారు. నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్యలో ఉన్న 8196 మహిళా సంఘాలలో మొత్తం 91,369 మంది సభ్యులుగా ఉన్నారు. ఇందిరా మహిళాశక్తి పాలసీలో భాగంగ నారాయణపేట జిల్లా సింగారం క్రాస్ రోడ్డులో రూ.1.30 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన జిల్లా 'మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్'ను ఈ ఏడాది ఫిబ్రవరి 21న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ప్రతి నెలా రూ.10వేల అద్దె చొప్పున 20ఏళ్ల వరకు పెట్రోల్ బంక్ నిర్వహణ నిమ్మితం బిపిసిఎల్‌తో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఒప్పందం చేసుకున్నది. దీనికి అనుగుణంగా పెట్రోల్ బంక్ నిర్వహణకు సంబంధించిన 11 మంది మహిళలకు ముందస్తుగా జడ్చర్ల, షాద్ నగర్‌లలోని పెట్రోల్ బంక్‌లలో మేనేజర్,సేల్స్ ఉమెన్‌లుగా ప్రభుత్వం తగిన శిక్షణను ఇప్పించింది. మొత్తం వ్యయంలో మౌలిక వసతుల కల్పనకు రూ.15లక్షలు ఖర్చు చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి పెట్రోల్ బంక్ నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తున్నారు. మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌లో రోజుకు 4 వేల లీటర్ల పెట్రోల్, 6 వేల లీటర్ల డీజిల్‌ను విక్రయిస్తున్నారు. అందులో విధులు నిర్వర్తించే 10 మంది సేల్స్ ఉమెన్‌లకు ఒక్కొక్కరికి నెలకు రూ.13,200 చొప్పున,మహిళా మేనేజర్‌కు నెలకు రూ.18,000లను వేతనంగా జిల్లా సమాఖ్య నుండి తీసుకుంటున్నారు. రాష్ట్ర మహిళా పెట్రోల్ బంక్ ద్వారా వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు పోను 6 నెలలలో రూ.15.50లక్షల ఆదాయాన్ని ఆర్జించినట్లు జిల్లా సమాఖ్య నుండి పెట్రోల్ బంక్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రకళ తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇదొక ముందడుగుగా ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. దీనికి తెలంగాణ రాష్ట్రంలోనే కాదని, దేశం మొత్తంలో జిల్లా మహిళా సమాఖ్యతో నడిచే మొదటి పెట్రోల్ బంక్ గా గుర్తింపు పొందిందని ప్రభుత్వం తెలిపింది.



## పక్కా ప్లాన్‌తోనే ..

### డ్రగ్స్ తయారీ సంస్థపై ముంబయి పోలీసుల దాడి
### స్వాధీనం చేసుకొన్న ముడి సరుకు
### ముంబయికి తరలిస్తున్న పోలీసులు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : తమకు చిక్కిన బంగ్లాదేశ్ మహిళా నిందితురాలిచ్చిన సమాచారాన్ని ఖచ్చితంగా నిర్ధారించుకొనేందుకు ముంబయి పోలీసుల్లో ఒకరు చర్లపల్లి ఫాక్టరీలో కార్మికుడిగా చేరి డ్రగ్స్ తయారీ అవటాన్ని ధృవీకరించుకోవటం ద్వారా పక్కా ప్లాన్‌తో దాడులు నిర్వహించారు. ఫలితంగా ఇక్కడి నిందితులను అరెస్టు చేయటంతోపాటు డ్రగ్స్, ముడి సరుకును పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకొన్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు గాను అరెస్టయిన నిందితులతో పాటు స్వాధీనం చేసుకొన్న డ్రగ్స్, ముడి సరుకును ముంబయికి వాహనాల్లో తరలించారు. ముంబయి మీరా రోడ్ ఈస్ట్ ప్రాంతంలో నివసించే బంగ్లాదేశ్ దేశస్తురాలైన ఫాతిమా మురాద్ అలియాస్(23)ను మహారాష్ట్ర క్రైం బ్రాంచ్ పోలీసులు గత ఆగస్టు 8న కాశ్మీరా బస్‌స్టాప్ ఎటిఎం సమీపంలో అనుమానాస్పదస్థితిలో సంచరిస్తుండగా అదుపులో తీసుకొని 105 గ్రాముల మెఫోడ్రోన్ అనే డ్రగ్స్ స్వాధీనం చేసుకొన్నారు. ఆమెను విచారించిన పోలీసులు అనంతరం మరో 10 మందిని అరెస్టు చేసి 178 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేశారు. మరింత లోతుగా కొనసాగించిన దర్యాప్తులో తెలంగాణా రాష్ట్ర రాజధాని సమీపంలోని మేడ్చల్ జిల్లా చర్లపల్లి పారిశ్రామిక వాడలోని వాగ్దేవి కెమికల్స్ పేరిట ఉన్న పరిశ్రమలో పెద్ద ఎత్తున డ్రగ్స్ సరఫరా చేస్తున్న విషయాన్ని తెలుసుకొన్నారు. దీన్ని పూర్తిగా నిర్ధారించుకొనేందుకు ముంబయి పోలీసులు పథకంలో భాగంగా ముందుగా ఓ పోలీసు సిబ్బంది నెల రోజుల క్రితం చర్లపల్లి చేరుకొని ఆ ఫాక్టరీకి సాధారణ వ్యక్తిగా వెళ్లి పని కావాలంటూ కార్మికుడిగా చేరాడు. అప్పటి నుండి ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా కార్మికుడిగా పని చేస్తూ అక్కడ ఏం జరుగుతోంది, నిజంగా డ్రగ్స్ తయారీ అవుతున్నాయా లేదా, ఎక్కడెక్కడికి సరఫరా అవుతున్నాయి, ఎవరెవరు వస్తున్నారన్న విషయాలన్నిటినీ ఆధారాలతో సహా సేకరించి తన ఉన్నతాధికారులకు సమాచారాన్ని చేరవేశాడు. అప్పటికే తమకు చిక్కిన నిందితుల సమాచారాన్ని క్రోడీకరించుకొని పూర్తిగా నిర్ధారించుకొన్న మీదట ముంబయి పోలీసుల బృందం శుక్రవారం చర్లపల్లి పారిశ్రామిక వాడ ఫేజ్ 5, నవోదయ కాలనీలోని వాగ్దేవి లాబొరేటరీస్ కర్మాగారంపై దాడులు నిర్వహించి శ్రీనివాస్ విజయ్ వోలేటి, తానాజి పండరీనాథ్ పట్వారిలను అదుపులోకి తీసుకొని 5 కిలోల 790 గ్రాముల మెఫోడ్రోన్ అనే డ్రగ్స్, డ్రగ్స్ తయారు చేసేందుకు వినియోగిస్తున్న 35500 లీటర్ల కెమికల్స్, 950 కిలోల పౌడర్ స్వాధీనం చేసుకొన్నారు. పెద్ద పెద్ద డ్రమ్స్‌లో ఉన్న ఈ ముడిసరుకునంతా శనివారం ముంబికి తరలించి మరింత లోతుగా దర్యాప్తు చేయనున్నారు.

## మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ వెన్నులో వణుకు పుట్టించిన
# పోరాట యోధుల్లో రావి నారాయణరెడ్డి ధీరుడు



### సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ వర్గాల నుంచి ప్రజలను రక్షించడంతో పాటు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తే లక్ష్యంగా సాగిన మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ వెన్నులో వణుకు పుట్టించిన పోరాట యోధుల్లో రావి నారాయణరెడ్డి ధీరుడని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. హైదరాబాద్, బంజారాహిల్స్, రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం ''పద్మవిభూషణ్' రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి సభ జరిగింది. ముందుగా రావి నారాయణరెడ్డి విగ్రహానికి నారాయణ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, రాజిరెడ్డి, స్మారక ట్రస్ట్ సభ్యులు ఉజ్జిని రత్నాకర్ రావు, రావి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ 1925లో భారత కమ్యూనిస్టు పార్టీ దున్నేవాడిదే భూమి అనే నినాదం స్ఫూర్తితోనే రావినారాయణరెడ్డి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాటాలు ప్రారంభించారన్నారు. నిజాం వ్యతిరేక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డిలతో కలిసి రావి నారాయణ రెడ్డి కీలక భూమిక పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భాగంగా తన కున్న 700ఎకరాల్లో 500ఎకరాలను పేదలకు పంచారని, ఈ స్ఫూర్తితోనే ఆచార్య వినోబాభావే భూదాన ఉద్యమం ప్రారంభించారని వివరించారు. 1951–52లో స్వాతంత్ర్యానంతరం దేశంలో జరిగిన తొలి లోక్ సభ ఎన్నికల్లో నల్లగొండ నియోజకవర్గం నుంచి పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) పార్టీ అభ్యర్థిగా పోటీచేసి దేశంలోనే అత్యధిక మెజారిటీ సాధించిన పార్లమెంటు సభ్యుడినిగా రికార్డు సృష్టించారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా నిజాం నిరంకుశ పాలనను పెకిలించేందుకు పిడికిలి బిగించిన ధీశాలి అని, నమ్మిన సిద్ధాంతాన్ని తుదిశ్వాస వరకూ ఆచరించిన మహనీయుడు రావి నారాయణరెడ్డి అని, అయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై పోరాటాలు నిర్మించాలని కె. నారాయణ కోరారు.

**రావినారాయణ రెడ్డి సేవలు భావితరాలకు ఆదర్శనీయం: కూనంనేని**

కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో రావి నారాయణ రెడ్డి వంటి కమ్యూనిస్టుల త్యాగాలతోనే హైదరాబాద్ స్టేట్ భారత యూనియన్ లో విలీనమైందన్నారు. ఆనాడు హిందువులు, ముస్లింలు అంత ఏకమై నియంతృత్వ నిజాం కు వ్యతరేకంగా పోరాడి నిజాం సంస్థానాన్ని కూల్చివేశారని, నేడు కొందరు దీనిని మతం రంగు పులిమి తమ రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్రలు చేస్తున్నారని, దీనిని సహించబోమని హెచ్చరించారు. రావి నారాయణరెడ్డి సేవలు ఈ నేలపై అజరామరం. భావితరాలకు ఆదర్శనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి.ప్రేమ్ పావని, విజయలక్ష్మి పండిట్, రామస్వామి, ప్రభులింగం, కె.నరసింహరెడ్డి, ఆరుట్ల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలు గర్వించదగిన నాయకుడు రావి నారాయణ రెడ్డి

### సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజలు గర్వించదగిన నాయకుడు రావి నారాయణ రెడ్డి అన్ని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట సేనాని రావినారాయణరెడ్డి 34 వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, నాయకులు కొండలరావు, రవి, సైదులు విజయ్ అడివయ్య, ఎఐఎస్ఎఫ్ నాయకులు అనిల్ , అరుణ్ సుశాంత్, కె.అరుణ్, మౌలాలి, కార్యాలయ సిబ్బంది శ్రీరాములు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కె.రామకృష్ణ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో గాంధీ చేస్తున్న ఉద్యమానికి ప్రభావితుడైన రావి నారాయణరెడ్డి కాకినాడలో జరిగిన సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారని, నిజం రాచరికానికి వ్యతిరేకంగా భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా రావి నారాయణ రెడ్డి ఆంధ్రమహాసభలో చేరారని వివరించారు. రావి నారాయణ రెడ్డి సేవలను గుర్తించి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని, కేంద్ర ప్రభుత్వం రావి నారాయణరెడ్డికి 'పద్మ విభూషణ్' అవార్డు ఇచ్చి గౌరవించిందని తెలిపారు. యువతరాన్ని ప్రోత్సహించిన ఆదర్శ నాయకులు రావి నారాయణరెడ్డి అని రామకృష్ణ అన్నారు.

ఈటి నరసింహ మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి పార్టీ, ప్రజాప్రతినిధిగా అనేక అవకాశాలు ఉన్నప్పటికీని వాటన్నింటిని త్యజించి యువతరానికి అవకాశాలు కల్పించాలని క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ స్టేట్‌లో సంవత్సరాల తరబడి వివక్ష అనుభవిస్తూ విద్యకు దూరంగా ఉన్న దళితుల కోసం అనేక పాఠశాలలను ఏర్పాటు చేసి, వారికి ఉన్నత విద్యావంతులుగా, ఉద్యోగులుగా తీర్చిదిద్దడంలో రావి నారాయణరెడ్డి పాత్ర చిరస్మరణీయమని గుర్తు చేశారు. భవిష్యత్తులో రావి నారాయణ రెడ్డి స్ఫూర్తితో మరిన్ని ప్రజా పోరాటాలను నిర్వహించి, ఆయనకు ఘనమైన నివాళులు అర్పిస్తామన్నారు.



## పామాయిల్ ఫ్యాక్టరీని మంత్రి తుమ్మల తనిఖీ

ప్రజాపక్షం/అశ్వారావుపేట : అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరచూ ఫ్యాక్టరీ బ్రేక్ డౌన్‌పై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా పదిలక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు అవుతుందని, 31జిల్లాల్లో 20లక్షల ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూల వాతావరణం ఉన్నట్లు తెలిపారు. ఒక్కో ఉమ్మడి జిల్లాకు లక్ష ఎకరాలు చొప్పున పది లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలిపారు. సిద్దిపేట పామాయిల్ ఫ్యాక్టరీని త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. పామాయిల్ గెలలు టన్ను రూ.25వేలు ఉండేలా ప్రోత్సహించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి స్వయంగా కలిసి వివరించినట్లు తెలిపారు. ఆత్మగౌరవంతో ఆరోగ్యంగా ఉండేది ఒక్క వ్యవసాయ రంగమేనని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రైతులకు మంచి భవిష్యత్ ఉంటుందని, ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ దేశానికే హబ్ మారనుందని అన్నారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలు సాగు రైతులకు అదనపు ఆదాయం వస్తుందని, రైతులు ఆదిశగా అంతర పంటలను వేయాలని సూచించారు. ఆయిల్ ఫెడ్‌తో పాటు ప్రైవేట్ రంగంలో పామాయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీలు ఏర్పాటుతో ఆయిల్‌పామ్ రైతులకు దీర్ఘకాలిక మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా, మండల అధికారులు, ఇతర శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి మనుషులు చేసిన పోరాటమే సాయుధ పోరాటం

### ఈనెల 11నుండి 17వరకు జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు
### నల్లగొండలో 10న సురవరం సంస్మరణ సభ
### సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




ప్రజాపక్షం/నల్లగొండ : భూమికోసం, భుక్తి కోసం దొరలు, భూసాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మట్టి మనుషులు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా బిజెపి చరిత్రను వక్రీకరించే ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో మాగ్దుమ్ భవనంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో నైజాంకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం తెలంగాణ అగ్నికణంగా మారిందని అన్నారు. ఈ పోరాటంలో నాలుగువేల అమరవీరుల రక్త తర్పణంతో చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా దొరలు, భూస్వాముల లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంపిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకే దక్కిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మట్టి మనుషులు చేసిన మహోత్తరమైన పోరాటాన్ని అవమానపరిచి సాయుధ పోరాట యోధులకు రావలసిన పింఛన్లను ఎత్తివేసిన హీనమైన చరిత్ర ఉందని విమర్శించారు. సెప్టెంబర్ 17 పేరుతో బిజెపి అమరవీరులను స్మరించుకోవడం సిగ్గుచేటని, దీనిని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుంచి 17 వరకు సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా సాయుధ పోరాట చరిత్ర గలిగిన చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో 11వ తేదిన అమరవీరుల స్థూపం వద్ద సాయుధ పోరాటం వారోత్సవాలు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

రాష్ట్రంలో యూరియా కొరత అత్యధికంగా ఉన్నదని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై కక్షగట్టి రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటాను ఇవ్వకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. దీని మూలాన వ్యాపారస్తులు కూడా యూరియాను కృత్రిమ కొత్తగా సృష్టించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల వ్యవసాయానికి సరిపడా యూరియాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడింగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం,బంటు వెంకటేశ్వర్లు బోల్లగిరనరసింహ,తిర్పారి వెంకటేశ్వర్లు, ఆర్ అంజ చారి, తూము బుచ్చి రెడ్డిలు పాల్గొన్నారు.

**10న సురవరం సంస్మరణ సభ**

సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర రెడ్డి సంస్మరణ సభ ఈనెల 10న నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్ లోగల జివిఎల్ గార్డెన్ లోనిర్వహించడం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం తెలిపారు. ఈ సంస్మరణ సభకు ముఖ్య అతిథులు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట రెడి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీరా రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్ఏ పల్లా వెంకట రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు. కావున సంస్మరణ సభలో అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించడంలో..
# గజ్వేల్ జర్నలిస్టుల పాత్ర గొప్పది

### గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల కోసం రూ.వంద కోట్లతో ప్రత్యేక నిధి
### రిటైర్డ్ జర్నలిస్టులకు ఇహెచ్ఎస్ పెన్షన్ కల్పించేందుకు కృషి
### గ్రూప్ తగాదాలు లేని సంఘంగా గజ్వేల్ ప్రెస్ క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు
### మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/గజ్వేల్ : తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరినీ ఏకతాటిపైకి తెచ్చి ఉద్యమంలో కీలకపాత్ర పోషించడంలో గజ్వేల్ జర్నలిస్టుల పాత్ర గొప్పదని మాజీమంత్రి హరీశ్ రావు కొనియాడారు. అలాగే మెతుకు సీమలో రైతులు ఆత్మహత్యల నివారణపై కార్యాచరణ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారని తెలిపారు. మనం చేసిన మంచి పనులే జీవితంలో శాశ్వతంగా నిలుస్తాయని చెప్పారు. ఆదివారం గజ్వేల్ మున్సిపల్, ప్రజ్ఞాపూర్‌లోని ఎస్ఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో గజ్వేల్ ప్రెస్ క్లబ్ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇండ్లతో పాటు గ్రామీణ విలేకరులకు బస్సు పాసులు అందించారని, జర్నలిస్టుల కోసం వంద కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ఇహెచ్ఎస్ ఏర్పాటుకు అసెంబ్లీలో చర్చిస్తామని చెప్పారు.

**ప్రజల భావాలను తెలిపేది విలేకరులే : మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**

ప్రజల భావాలను తెలిపేదే విలేకరులని, చట్టాన్ని, రాజ్యాంగాన్ని అమలుపరిచేది న్యాయవ్యవస్థ, పత్రికా వ్యవస్థ అని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ ప్రెస్ క్లబ్ రజతోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాజీ మంత్రి హరీష్‌రావుతో కలిసి మాట్లాడారు. తెలంగాణలో గజ్వేల్ ప్రెస్ క్లబ్‌కు ప్రత్యేక పేరు ప్రతిష్ఠలు ఉన్నాయని, గజ్వేల్ జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలికి తీసి చైతన్యానికి మేలితం చేశారని, ఎన్నో సామాజిక కార్యక్రమాలకు పురుడుపోశారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి సెంట్రల్ జైలుకు పంపితే ఆ సమయంలో జర్నలిస్టుల పక్షాన బషీర్‌బాగ్‌లో విధులను బహిష్కరించినట్లు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు దిగివచ్చి సెంట్రల్ జైలు నుండి జర్నలిస్టులను విడుదల చేశారని గుర్తుచేశారు. అలాగే మెదక్‌లో జర్నలిస్టు యాదగిరిని హత్య చేయగా ఆ కుటుంబానికి న్యాయం చేసేవరకు పోరాటం చేసి అప్పటి సిఎం చంద్రబాబు బాధిత కుటుంబానికి రూ.10లక్షల పరిహారం అందించడం వెనుక ఉమ్మడి మెదక్ జిల్లా జర్నలిస్టుల ఐక్యత ఘనత అన్నారు. జర్నలిస్టులు పావురాల్లాంటి వారని శాంతి, అభివృద్ధి కోరుకుంటారని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో గతంలో పనిచేసిన మాజీ సిఎంలు జర్నలిస్టులకు 150 ఎకరాలకు పైగా ఇంటి స్థలాల కోసం భూములు ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ఈ అంశం ప్రస్తుతం సమస్యగా మారిందని, సుప్రీం కోర్టుకు వెళ్లారని చెప్పారు. వ్యవస్థలన్నీ సవరించినప్పుడే న్యాయం జరుగుతుందని అన్నారు. మరో వారంలో రోజుల్లో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకోసం సిఎం రేవంత్‌తో చర్చించినట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, సమాజానికి ఎంతో కొంత మంచి చేయాలని తపన ఉన్నవారు మాత్రమే జర్నలిజం వృత్తిలోకి రావాలని సూచించారు. మీడియా అకాడమీ ద్వారా విలువల్లేని జర్నలిస్టులను పక్కన పెట్టేందుకు వెనుకాడవద్దని కోరారు. టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో ప్రెస్‌క్లబ్‌లు ఉన్నప్పటికీ గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని స్పష్టం చేశారు. ప్రత్యక్షంగా ప్రజల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిన ఏకైక ప్రెస్‌క్లబ్ గజ్వేల్ ప్రెస్ క్లబ్ అని అన్నారు. గజ్వేల్ ప్రెస్ క్లబ్‌పై బురద జల్లడం, ఐక్యతలో విచ్ఛినం చేసేందుకు కొన్ని శక్తులు కుట్రపన్నగా, ఆ శక్తులకు మేము తెచ్చిన సావనీర్ సమాధానమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కార్పొరేషన్ చైర్మన్లు ఎలక్షన్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, దేవి ప్రసాద్, ఎఎంసి చైర్మన్లు వంటేరు నరేందర్ రెడ్డి, మోహన్, టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు, డియూడబ్ల్యూజె జిల్లా అధ్యక్షుడు రంగాచారి, టియుడబ్ల్యూజె జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ లోకసత్తా ఉమ్మడి రాష్ట్రాల సమన్వయ కర్త బండారు రామ్మోహన్ రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బట్టు దయానందరెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సంధ బోయిన ఎల్లయ్య, సీనియర్ విలేకరులు సత్యనారాయణ, ఎల్లారెడ్డి, విజయానందరెడ్డి, సురేందర్, మధు సూదన్, యాదగిరి, కిరణ్, కృపాకర్, నర్సింలు, మునీర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు : ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్ర, నిమజ్జనం కార్యక్రమాలు అత్యంత ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి జిల్లా ఎస్‌పి కె నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఉత్సవం ఎలాంటిదైన అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో జరుపుకున్నారని, గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకున్న స్ఫూర్తి భవిష్యత్తులో కూడా చూపాలని ఎస్‌పి కోరారు. ప్రజలంతా సంతోషంగా నిర్వహించుకోవాలని జిల్లా పోలీసు శాఖ తరపున పూర్తి భద్రత రక్షణ ఎల్లప్పుడు కల్పించడం జరుగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసిన అన్ని శాఖల అధికారులకు, బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు.



## ఉచిత కంటి పరీక్ష శిబిరం

ప్రజాపక్షం/మానవపాడు: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌విఎస్ ఆసుపత్రి మేనేజర్ కందూరు రామిరెడ్డి ఈ శిబిరంలో కంటి చూపు బాధితులు చూపు మందగించడం దగ్గర చూపు దూరపు చూపు కంటి పోరలుతో కంటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న 50 సంవత్సరాల పై బడ్డ వారికి ఈ గ్రామంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించడం జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌విఎస్ హస్పిటల్ మేనేజర్ కందూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రి కంటి నిపుణులచే పరీక్షలు నిర్వహించుకుని వారి సలహా సూచనలతో కంటిపొరలు ఉన్నవారికి కందూరు రామిరెడ్డి కంటి ఆసుపత్రి మహబూబ్‌నగర్ తీసుకువెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. వారిని సొంత వాహనంలో తీసుకెళ్లి భోజన వసతులు కల్పించి ఆపరేషన్ ఈ శిబిరము జల్లాపురం గ్రామపంచాయితీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరిగింది.కావున ఈ గ్రామంలో ఉన్న కంటిచూపు బాధితులు అధికంగా పాల్గొని కంటి పరీక్షలు చేసుకోవడం జరిగింది.



## ప్రతి రైతుకూ యూరియా అందిస్తాం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: నియోజకవర్గంలోని ప్రతి రైతుకు సరిపడా యూరియా అందిస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయా మండలాలకు చెందిన ఏవోలు, ఏఈవోలు, సీఈవోలతో, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి రైతుకు, ప్రతి ఎకరాకు యూరియా అందేవిధంగా వ్యవసాయాధికారులు కృషి చేయాలన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌లకు తరలకుండా చర్యలు తీసుకోవాలని, యూరియా పక్కదారి పట్టకుంటా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టే విధంగా కేంద్రం ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, ఆ కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి రైతులందరికి యూరియా అందించడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ ధీరావత్ సైదానాయక్, ఏవోలు సరిత, రుషేంద్రమణి, కిశోర్‌కుమార్, శివరాంకుమార్, ఏఈవోలు షఫి, గోపి, లావణ్య, ప్రియాంక, నరేష్, రమేష్, నితిన్‌నాయక్, వేణుగోపాల్, పీఏసీఎస్ వెంకట్‌రెడ్డి, రవీందర్, మల్లయ్య, అంజయ్య, సతీష్, సైదులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రజాపక్షం/మునగాల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం ముకుందాపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నడిగూడెం మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట తండాకు చెందిన బాణోతు సేవ్య(60) కూరగాయల వ్యాపారం చేస్తుంటడాన్ని, రోజు మాదిరిగానే తన ఎలక్ట్రికల్ బైకుపై కూరగాయలను ముకుందాపురం గ్రామంలో అమ్ముకుని తిరిగి ఇంటింకి వెళ్లేందుకు ఎన్‌హెచ్65 జాతీయ రహదారి రోడ్డు దాటుతుండగా హైద్రాబాద్ నుండి విజయవాడ వెళ్తున్న ఇన్నోవ క్రిష్ట కారు డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా కారు నడిపి సేవ్య నడుపుతున్న ఎలక్ట్రికల్ బైకుకు టక్కర్ ఇవ్వగా సేవ్య తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని మనువడు బాణోతు సాయిభరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## ప్రోటోకాల్ పాటించని విద్యాశాఖ అధికారులను, డిఈ, ఎస్‌ఓలను సస్పెండ్ చేయాలి



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మునుగోడు నియోజకవర్గంలోని సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కెవిజీవీబి పాఠశాలలో నూతన అదనపు తరగతి గదుల నిర్మాణం శంకుస్థాపనకు కార్యక్రమానికి శాసనమండలి సభ్యుడు సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ను ఆహ్వానించకుండా ప్రోటోకాల్ పాటించకుండా అవమానపరిచిన విద్యా శాఖ, డిఈ, కస్తూరిబా పాఠశాల ఎస్‌ఓలను సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చన గోని గాలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శిలాఫలకం వద్ద నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులకు ప్రజలకు గౌరవం ఇవ్వడం ప్రతి అధికారి విధి అని ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సభ్యుడు చిలువేరు అంజయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి పల్లె మల్లారెడ్డి, యాదగిరి, యాది పాల్గొన్నారు.

## 'రావి' జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలి





ప్రజాపక్షం/దేవరకొండ : పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్, సిపిఐ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపి అమరజీవి కామ్రేడ్ రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని, నేటి యువత రావి నారాయణరెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, వెంకట్రాములు, మైనోద్దీన్, పట్టణ శాఖ కార్యదర్శులు వెంకటయ్య, శ్రీను, జ్యోతిబస్, నాయకులు పర్వతాలు, రాజమల్లయ్య, ఆనందచారి, జాకీర్, శ్రీను, పాండు, పర్వతాలు, బక్కయ్య, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/వలిగొండ : తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా ఆదివారం భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వారి స్తూపం వద్ద సిపిఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల సిపిఐ పార్టీ సమితి సభ్యులు మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, మండల సహాయ కార్యదర్శి వెల్లంకి మహేష్, పోలేపాక యాదయ్య, సల్వాద్రి రవీందర్, బొడిగే సుదర్శన్, సుద్దాల సాయికుమార్, పులిపలుపుల మల్లేష్, కొయ్యగూర రాములు, పాల్గొన్నారు.



# సాగర్ 14గేట్లు ఓపెన్





ప్రాజెక్టుకు పెరిగిన వరద... 14 గేట్ల ద్వారా నీటి విడుదల...

ప్రజాపక్షం/నందికొండ: ఐదు రోజుల విరామం తర్వాత నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు ముచ్చటగా మూడోసారి తెరుచుకున్నాయి.గత బుధవారం నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం 585.20 అడుగులుగా ఉండి 50 వే ల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వద్ద ప్రాజెక్టు అధికారులు గేట్లను మూసివేశారు అయితే అప్పటి నుండి శనివారం రాత్రి వరకు వేలల్లో కొనసాగిన ఇన్ ఫ్లో ఒకేసారి లక్ష కు పైన క్యూసెక్కులకు పెరగడం అదే సమయంలో ప్రాజెక్టు నీటిమట్టం కూడా గరిష్ట సాయికి చేరుకోవటంతో వెంటనే మొదట 2గేట్లను తరువా త 8 గేట్లను ఆ తరువాత 10 గేట్లను,సాయంత్రం 14 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 112966 క్యూసెక్కుల నీటిని క్రస్ట్ గేట్ల ద్వారా అవుట్ ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే ఈ సీజన్ స్వల్ప వ్యవధిలోనే ప్రాజెక్టు గేట్లు తెరుచుకోవడం ఇది మూడవసారి కావటం గమనార్హం.

**రిజర్వాయర్ సమాచారం** : నాగార్జునసాగర్ పూర్తిస్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు గాను ఆదివారం సాయంత్రానికి589.70 అడుగులుగా ఉంది. నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలకు311.1486 టిఎంసిలుగా ఉన్నది. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుండి 33820 క్యూసెక్కులు కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు ఎస్ఎల్‌బిసి ఎఎంఆర్‌పి ద్వారా 2400 క్యూసెక్కులు లోలెవెల్ కెనాల్ వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో గా వస్తున్న 167440 క్యూసెక్కుల నీటిని అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదల చేస్తున్నారు.

**సాగర్ లో పర్యాటకుల సందడే..సందడి**

ఐదు రోజుల విరామం తర్వాత ప్రాజెక్టు గేట్లు మళ్లీ తెరుచుకోవడంతో ఆదివారం సాగర్ లో పర్యాటకుల సందడి నెలకొంది వరసగా సెలవులు రావడంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరేందుకు ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ లో ఆదివారం పర్యాటకులు బారులు తీరారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్ అందాలను తిలకించడానికి వచ్చారు సాగర్ ప్రాజెక్టు గేట్లు తెరవడంతో విద్యార్థులు పర్యాటకులు తరలి వచ్చారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడి మ్యూజియంలోని విశేషాలు, బుద్ధుని అవశేషాలు, మాన్యుమెంట్స్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడి నుంచి సాయంత్రం వేళలో ఎత్తిపోతల జలపాతం, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు.

## ప్రభుత్వ హాస్టల్లో మౌలిక సదుపాయాలలో రాజీ ప్రసక్తే లేదు

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

### కెవిజివిబిలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : ప్రభుత్వ హాస్టల్లో మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఉన్న కస్తూరిబా బాలికల పాఠశాలలో రూ.62 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఎమ్మెల్యే పాఠశాల మొత్తం పరిశీలించారు. అంతకుముందు మండల కేంద్రంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కస్తూర్బా పాఠశాలను కలియతిరిగి విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు, డార్మెటరీ హాల్, బాత్రూం, టాయిలెట్స్, ప్లే గ్రౌండ్స్, లాంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయా అని పాఠశాలలో ఎటువంటి సమస్యలు ఉన్నాయని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. డార్మెటరీ హాల్‌లను పరిశీలించి విద్యార్థినుల సంఖ్యకు సరిపడా అదనపు గదుల నిర్మాణం, 12 మంది విద్యార్థులకు ఒక టాయిలెట్స్, బాత్రూం సరిపడేలా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ మోడల్ స్కూల్ లో మౌలిక వసతులపై తన వ్యక్తిగత ఇంజనీర్ల తో మాట్లాడి అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించాలని తెలిపారు. ఆయన వెంట మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**రైతులకు అన్యాయం జరిగితే పోరాటం**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం త్రిబుల్ ఆర్ భూముల నిర్వాసిత రైతులతో సమావేశమైన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రజలకు మరోసారి రైతులకు అన్యాయం విషయంలో తన ఎప్పటికీ రాజీపడనని స్పష్టం చేశారు. మునుగోడునియోజకవర్గ రైతులకు ప్రజలకు అన్యాయం జరిగితే ఎంతటి త్యాగానికైనా సిద్ధమేనని అవసరమైతే ప్రభుత్వంపై ఏ స్థాయిలోనైనా పోరాటానికి సిద్ధంగా ఉంటానని మీరు కూడా సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. గతంలో తన రాజీనామా వల్ల చౌటుప్పల్ నారాయణపురం రోడ్డు నిర్మాణం వంద పడకల ఆసుపత్రి ఘట్టుప్పల్ మండల ఏర్పాటు, చండూరు రెవిన్యూ డివిజన్, శివన్నగూడెం రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం లభించాయని గుర్తు చేశారు. రైతుల సమస్యలపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రభుత్వాన్ని ఒప్పించే దిశగా తాను కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థాన్ నారాయణపురం, ఘట్టుప్పల్ మండలాల రైతులు పాల్గొన్నారు.

## నేటి తరానికి సాయుధ పోరాట అమరుల జీవిత చరిత్ర

### సాయుధపోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి : సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఈనెల 11 నుండి 17వ తేదీ వరకు జరగనున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు సిపిఐ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయం బొమ్మగాని ధర్మభిక్షం భవన్‌లో జరిగిన ఆ పార్టీ విస్తృత కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఎలాంటి స్వార్థానికి తావివ్వకుండా, ప్రజా సంక్షేమ కోసమే తమ జీవితాలను అంకితం చేసిన నాటి తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల జీవిత చరిత్రను నేటి తరానికి అందించాలని అందుకు అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో జీఎస్‌టి తగ్గించామని గప్పాలు కొడుతున్న కేంద్ర ప్రభుత్వ నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూల్స్‌లో పనిచేసే సిబ్బందికి జీతాలు రాక ఆరు నెలలు అయిందని తక్షణమే వారి జీతాలను విడుదల చేయాలని ఒక్కనెల జీతం రాకపోతేనే ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుందని అలాంటిది ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వారి జీతాలను ఏజెన్సీ ద్వారా ఇచ్చే విధానాన్ని మార్చి కార్పోరేషన్ ఏర్పాటు చేసి నెలనెలా జీతాలు ఇవ్వాలని వారికి జీతాలు చాలా తక్కువ మొత్తంలో ఇస్తారని అలాంటిది ఆ ఇచ్చే వాటిని కూడా సక్రమంగా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. వారికి సిపిఐ అండగా ఉంటుందని అవసరమైతే ఉద్యమిస్తానికి కూడా వెనుకాడబోమని హెచ్చ రించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, యల్లంల యాదగిరి, బద్దం కృష్ణారెడ్డి, బూర వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, మండవ వెంకటేశ్వర్లు, ఎస్‌కె లతీఫ్, దేవరం మల్లీశ్వరి, ఎస్‌కె సాయిబల్లి, రెమిడాల రాజు, పిల్లుట్ల కనకయ్య, ఉప్పతల కోటమ్మ, జడ శ్రీనివాస్, చేపూరి కొండలు, యల్లావుల రమేష్, అనంతుల మల్లీశ్వరి, కాంపల్లి వెంకటయ్య, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, కడియాల అప్పయ్య, కందుల వెంకటేశ్వర్లు, యల్లబోయిన సింహాద్రి, ఏ లక్ష్మి , భరత్, జానయ్య, భద్రారెడ్డి పాల్గొన్నారు.

## చివ్వెంల పోలీసు స్టేషన్ ఎదుట 'హై'డ్రామా!

### మాజీ కౌన్సిలర్ భాషామియా అరెస్టుపై బిఆర్ఎస్ నేతల ఆందోళన..




ప్రజాపక్షం/సూర్యాపేట : చివ్వెంల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం హైడ్రామా కొనసాగింది. సూర్యాపేట మున్సిపాలిటిలోని 5వ వార్డు మాజీ కౌన్సిలర్ భాషామియాను తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దీనికి ప్రధాన కారణం తన శిష్యుడిగా కొనసాగుతున్న మున్నీర్‌పై హత్యాయత్నం చేశాడనే ఫిర్యాదు మేరకు పోలీసులకు అతనిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో వార్డు ప్రజలు దాదాపు 5 వందల మంది ప్రజలు స్టేషన్ వద్దకు తరలివచ్చి ఒక్కసారిగా స్టేషన్‌ను చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. ఇద్దరు వ్యక్తుల మధ్యన జరిగిన చిన్న పంచాయితీని పోలీసులు పెద్దదిగా చూపి అర్థరాత్రి అరెస్టు చేయడమేమిటని తప్పుపడుతూ వారిని నిలదీశారు. మాజీ రాజ్యసభ సభ్యులు, జిల్లా పార్టీ అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, ఎమ్మెల్యే వ్యక్తిగత పిఏ ప్రభాకర్ రెడ్డి తోపాటు నియోజక వర్గంలోని బిఆర్ఎస్ ముఖ్య నాయకులందరూ భాషామియాకు మద్దతుగా స్టేషన్ వద్దకు వెళ్ళి దురాజ్‌పల్లి వార్డు ప్రజలు చేస్తున్న ఆందోళనకు మద్దతు పలికారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్‌ను రంగంలోకి దింపారు. అక్కడకు చేరుకున్న ఆయన పరిస్థితిని చేదాటకుండా తగు జాగ్రత్తలు తీసుకొని ఆందోళనకారులతో మాట్లాడి భాషామియాపై చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి ఆయనను విడుదల చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో ధర్యాప్తు కొనసాగుతుందని మీడియాకు చెప్పారు. భాషామియా విడుదల కావడంతో బిఆర్ఎస్ శ్రేణులు ఆందోళన విరమించారు.

**కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేసిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి..**

భాషామియా అరెస్టుపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి స్పందిస్తూ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పినట్లుగా పోలీసులు నడుచుకుంటూ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారని తీవ్రమైన విమర్శలు చేశారు. తెలంగాణలో పోలీసు రాజ్యం నడుస్తుందని ప్రజలనుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక బిఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులను బనాయిస్తున్నారని అన్నారు. అర్థం లేని కేసుల్లో అర్థరాత్రి అరెస్టులు చేయడం అక్రమమన్నారు. ఓ తాగుబోతు ఇచ్చిన ఫిర్యాదుతో తమ పార్టీ సీనియర్ నాయకుడు భాషామియాను అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. ప్రజల ఒత్తిడితోనే అరెస్టు చేసిన భాషామియాను పోలీసులు విడుదల చేశారన్నారన్నారు. దీని వెనుక కాంగ్రెస్ నాయకుల హస్తముందంటూ ఆరోపించారు.

**చిల్లర పంచాయితీకి మాకు సంబంధం లేదంటూ కాంగ్రెస్ నేతల ఖండన..**

చిల్లర పంచాయితీకి మాకు సంబంధం లేదంటూ కాంగ్రెస్ నేతలు సోషల్‌మీడియా వేదికగా భాషామియా అరెస్టుపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. భాషామియా గురించి ఆ వార్డు ప్రజలకు ఆయన ఏంటో తెలుసని దీనిలో మమ్ములను ఎందుకు లాగుతున్నారంటూ ప్రశ్నించారు. భాషామియాపై ఫిర్యాదు చేసిన మున్నీర్ బిఆర్ఎస్ నాయకుడేనని తమకు అతనికి ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొచ్చారు.



## యూరియా కొరత నివారించాలి

### తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం మండల కేంద్రంలో సల్వాద్రి రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ కేంద్ర ప్రభుత్వం యూరియాను కృత్రిమ కొరతను కొనసాగిస్తుందని కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం యూరియాను రాష్ట్రానికి సరఫరా చేయాలని రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమయానికి ఏరువులు అందకపోవడం వలన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఇదే అదునుగా కొంతమంది ఫెర్టిలైజర్ యజమానులు బ్లాక్లో యూరియాను అమ్ముకుంటూ లాభాలు ఆర్జిస్తున్నారని వారి పైన వ్యవసాయ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు. తక్షణమే యూరియాను సొసైటీల ద్వారా వేగవంతంగా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలోగోని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్,ఎలగందుల అంజయ్య, పోలేపాక యాదయ్య, బొడిగె సుదర్శన్, బాలగోని సత్యనారాయణ, కట్ల యాదగిరి పాల్గొన్నారు.

## మహ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో యువత పయనించాలి: డిఎస్‌పి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : యువత మహమ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో పయనించి సమాజానికి సేవ చేయాలని నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి సూచించారు.ఆదివారం మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదినం సందర్భంగా పట్టణంలోని గడియారం సెంటర్‌లో మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని డిఎస్‌పి ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రవక్త కరుణ, మానవత్వం, సత్యనిష్ఠలను స్మరించారని తెలిపారు.మిలాద్ కమిటీ ప్రతి ఏడాది దాదాపు 15 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలు నిర్వహించి ఎన్నో ప్రమాదాల బారిన పడ్డ రోగులకు రక్తాన్ని అందించి రక్తదాతలుగా నిలుస్తున్నారని మిలాద్ కమిటీని అభినందించారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ ఎమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మిలాత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పోలీసు రాజ్యం

### అర్థం లేని కేసులో అర్ధరాత్రి అరెస్టులు అక్రమం..

### చట్టవిరుద్ధంగా పోలీసులు నడుచుకోవద్దు..

ప్రజాపక్షం/సూర్యాపేట : తెలంగాణలో పోలీసుల రాజ్యం నడుస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. అర్థం లేని కేసుల్లో పోలీసులు అర్థరాత్రి అరెస్టులు చేయడం అక్రమమన్నారు. చట్టవిరుద్ధంగా పోలీసులు నడుచుకోవద్దని హితవు పలికారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సూర్యాపేట 5వ వార్డు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ భాషామియాను పోలీసులు అర్థరాత్రి అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్‌మీడియా పైన ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. యూరియా కోసం రైతులు లైన్‌లో నిలబడితే వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు పెడితే కూడా కేసులు పెట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. ఓ తాగుబోతు ఇచ్చిన ఫిర్యాదుకు మా పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ భాషామియాపై పోలీసులు కేసులు పెట్టడం చట్టవిరుద్ధమన్నారు. అక్రమ అరెస్టుపై ప్రజలు తిరగబడి ఒత్తిడి చేయడంతో భాషామియాను వదిలిపెట్టడం జరిగిందన్నారు. కేసులకు ఏ మాత్రం భయపడమని, తాము తెలంగాణ ఉద్యమ కాలంలో ఇలాంటివి ఎన్నో చూశామని చెప్పారు. చిల్లర కేసులకు బిఆర్ఎస్ భయపడదని గంజాయి మూకలతో సమాజం ఆగం అవుతుందని వాటిపై దృష్టి పెట్టాలన్నారు. సూర్యాపేట, నల్లగొండ ఎస్‌పిలకు తాను మరొక సారి చెబుతున్నానని లా అండ్ ఆర్డర్ అదుపు తప్పుతుందని వాటిపై దృష్టి సారించాలన్నారు. పార్టీ నాయకులను కాపాడుకునేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలను ఆయన అభినందించారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ప్రజ్వల్ రేవణ్ణకు జైలులో లైబ్రరీ క్లర్క్‌గా పని..

**బెంగళూరు:** అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న కర్ణాటకలోని హసన్ మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు పరప్పన అగ్రహార జైలులో లైబ్రరీ క్లర్క్‌గా పని కేటాయించారు. తోటి ఖైదీలకు పుస్తకాలు జారీ చేయడం, వాటి రికార్డులను నిర్వహించడం వంటి బాధ్యతలు ఆయన నిర్వహించాలి. ఈ పని చేసినందుకు రోజుకు రూ.522 చెల్లిస్తారు. కాగా, మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ మనవడు, జెడి(ఎస్) సీనియర్ నేత, హోలెనరసిపుర ఎమ్మెల్యే హెచ్‌డి రేవణ్ణ కుమారుడైన ప్రజ్వల్ రేవణ్ణపై నమోదైన అత్యాచారం కేసులో ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించింది. జైలు నిబంధనల ప్రకారం జీవిత ఖైదు శిక్ష పడిన వారు జైలులో ఏదో ఒక పని చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పరిపాలనా పరమైన పనులు చేయడానికి రేవణ్ణ ఆసక్తి చూపినట్లు జైలు అధికారులు తెలిపారు. అయితే ఆయనకు లైబ్రరీ క్లర్క్ పని అప్పగించినట్లు చెప్పారు. మరోవైపు ఖైదీలు సాధారణంగా వారానికి మూడు రోజులు, నెలలో కనీసం12రోజులు జైలులో పనిచేయాల్సి ఉంటుంది. ఆయనకు కేటాయించిన లైబ్రరీ క్లర్క్ పని షెడ్యూల్ పరిమితంగా ఉన్నదని వెల్లడించారు.

### మణిపూర్‌లో ప్రధాని హడావిడి పర్యటన
## రాష్ట్ర ప్రజలను అవమానించడమే

29 నెలలుగా మోదీ రాకకోసం
ఎదురుచూస్తున్న వారికి తీవ్ర నిరాశే : కాంగ్రెస్ విమర్శ

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 13వ తేదీన కల్లోలిత మణిపూర్‌లో పర్యటించనున్నారు. అయితే ఆయవ కేవలం మూడు గంటల పాటు మాత్రమే రాష్ట్రంలో తన పర్యటనను కొనసాగించనున్నారు. దీంతో ప్రధాని తమ రాష్ట్రానికి ఎప్పుడు వస్తారా? తమ సమస్యను ఎలా పరిష్కరిస్తారా? అని గత 29 నెలలుగా కళ్లల్లో ఒత్తులు వేసుకుని చూస్తున్న రాష్ట్ర ప్రజలు ప్రధాన పర్యటన తీవ్ర నిరాశను కలిగించనుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ స్పందించింది. ప్రధాని హడావిడి పర్యటన ఆ రాష్ట్ర ప్రజలను అవమానపర్చమేనని మండిపడింది. 13న మణిపూర్‌లో ప్రధానమంత్రి ప్రతిపాదించిన పర్యటనను ఆయన చీర్‌లీడర్లు ప్రశంసిస్తునానని, కానీ ఆయన రాష్ట్రంలో కేవలం 3 గంటలు హడావిడి పర్యటనతో ఆయన ఏమి సాధించాలని ఆశిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌లో ప్రశ్నించారు. ఈ చర్య సుదీర్ఘకాలంగా ప్రధాని రాకకోసం ఎదురు చూస్తున్న రాష్ట్ర ప్రజలకు తీవ్ర అవమానకరమన్నారు. ప్రధాని మరో సారి మణిపూర్ ప్రజల పట్ల తన నిర్లక్ష్యా న్ని సున్నితత్వాన్ని బయటపెట్టారన్నారు. ప్రధాని మణిపూర్‌లో దాదాపు మూ డుగంటల పాటు ఉంటారని ఎక్స్‌లో పేర్కొన్న మీడియా కూడా ఆయన పంచుకున్నారు. కాగా, సెప్టెంబర్ 13న ప్రధాని మణిపూర్‌ను సందర్శిం చే అవకాశం ఉంది. మే 2023లో మెయితీస్, కుకిస్ మధ్య జాతి హింస చెలరేగిన తర్వాత ప్రధాని రాష్ట్రంలో అడుగిడనున్నారు. ఈశాన్య రాష్ట్రాన్ని క్లుప్తంగా సందర్శించడానికి ప్రధాని మోదీ చివరకు ధైర్యం, సానుభూతిని కూడగట్టుకుని ఉండవచ్చు, కానీ అది 'చాలాఆలస్యం' కావచ్చు అని కాంగ్రెస్ గతవారం పేర్కొంది. మే 2023 నుండి మెయితీస్, కుకి జో గ్రూపుల మధ్య జరిగిన జాతిహింసలో 260 మందికి పైగా మరణించారు, వేలాదిమంది నిరాశ్రయులయ్యారు.ముఖ్యమంత్రి ఎన్ బిరెన్ సింగ్ రాజీనామా చేసిన తర్వాత కేంద్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించింది. 2027వరకు పదవీకాలం ఉన్న రాష్ట్ర అసెంబ్లీని సస్పెండ్ చేశారు.

### మహారాష్ట్ర,మధ్యప్రదేశ్ రాష్ట్రాల
## గణేశ్ నిమజ్జనోత్సవాల్లో విషాదం

వేరువేరు ఘటనల్లో ఏడుగురు మృతి

**ముంబయి/భోపాల్ :** మహారాష్ట్ర,మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన గణేశ్ నిమజ్జనోత్సవాలలో విషాదం చోటుచేసుకుంది. వేరు వేరుచోట్ల జరిగిన ఘటనల్లో ఏడుగురు మరణించారు. వీరిలో కొందరు నీట మునిగి మరణించారు. పదిరోజులపాటు జరిగిన గణపతి ఉత్సవాలు,నిమజ్జనోత్సవాలలో లక్షలాది మంది ప్రజలు పాల్గొన్నారు. మహారాష్ట్రలోపి థానే,పుణె,నాందేడ్,నాసిక్, జల్‌గావ్,అమరావతి జిల్లాలలోని వివిధ చెరువులు, కాలువల వంటి ప్రదేశాలలో గణేశ్ నిమజ్జనాల సందర్భంగా నీట మునిగి నలుగురు మరణించారు. మరో 13 మంది జాడతెలియలేదని అధికారులు ఆదివారం ప్రకటించారు. ముంబయి నగరంలో గణపతి మహారాజ్‌కు ఈ ఏడాదికి తుది వీడ్కోలు పలికేందుకు లక్షలాదిమంది ప్రజలు అనేకచోట్ల ప్రదర్శనల్లో పాల్గొన్నారు. విద్యుదాఘాతం కారణంగా ఒక వ్యక్తి మరణించగా, మరో ఐదుగురికి గాయాలు తగిలాయి. సకినాక ప్రాంతంలోని ఖైరాని రోడ్డులో గణేశుడి విగ్రహం రోడ్డుమీద వేలాడుతున్న ఒక విద్యుత్ వైరును తాకడంతో ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్ రైసన్‌జిల్లా ఘట్కేడా గ్రామంలో గణేశ నిమజ్జనం సందర్భంగా శనివారం రాత్రి ఇద్దరు టీనేజీ విద్యార్థులు నదిలో మునిగిపోవడంతో మరణించారు. అదేవిధంగా ఆదివారం ఉదయం ముంబయిలోని గిరిగావ్ చౌపట్టివద్ద జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ వేలాదిమంది భక్తులు లాల్‌బౌగ్చా, ఇతర గణపతుల నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. ముంబయి పొరుగున పాల్ఘర్‌జిల్లా విరార్‌లోని నారంగ్‌జెట్టీలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా శనివారం సాయంత్రం నదిలో ముగ్గురు కొట్టుకుపోయారు. ఐతే తర్వాత వారిని రో–రో బోటు సహాయంతో నీటి ప్రవాహం నుండి కాపాడారు.



### లాల్‌బాగ్చారాజా తరలింపులో
### సాంకేతిక సవాళ్ళు, జాప్యం

ముంబయిలోని లాల్‌బౌగ్చా రాజా విగ్రహ నిమజ్జనోత్సవం అనేకగంటల పాటు జాప్యం జరిగింది. ఎంతో బరువైన విగ్రహాన్ని తరలించేందుకు సాంకేతికంగా పెద్ద సవాళ్ళు ఎదురయ్యాయి. ఎట్టకేలకు విగ్రహాన్ని ఊరేగింపు గద్దెమీదకు ఎక్కించి తరలించారు. ఈ విగ్రహాన్ని సాధారణంగా అరేబియా సముద్రంలో రాత్రి తొమ్మిది గంటలలోపే నిమజ్జనం చేస్తారు. కానీ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ప్రదేశం నుండి తరలించడానికి అనేక సవాళ్ళు ఎదురు కావడంతో ఎనిమిది గంటలపాటు ఆలస్యం జరిగింది. లాల్‌బాగ్ నుండి ఈ విగ్రహ ఊరేగింపు శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన 28 గంటల తర్వాత గిర్‌గావ్ చౌపట్టికి వద్దకు చేరింది. ఎట్టకేలకు వందలమంది వాలంటీర్లు విగ్రహాన్ని మోసి కొత్తగా నిర్మించిన ఫ్లాట్‌ఫాం మీదకు తరలించి ఎట్టకేలకు సముద్రంలో నిమజ్జన కార్యక్రమం పూర్తిచేశారు.

## పంజాబ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో 9న మోదీ పర్యటన



**చండీగఢ్ :** హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్‌లోని వాటి పరీవాహక ప్రాంతాలలో భారీ వర్షం కారణంగా ఉప్పొంగిన సట్లెజ్, బియాస్, రావి నదులు, వాగులు పంజాబ్‌లోని అనేక ప్రాంతాలను ముంచెత్తాయి. అంతేకాకుండా, గత కొన్ని రోజులుగా పంజాబ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు వల్ల వరదలు మరింత తీవ్రతరం చేశాయి. పంజాబ్ ప్రస్తుతం దశాబ్దాలలో అత్యంత దారుణమైన వరద విపత్తును ఎదుర్కొంటోంది. వరదల కారణంగా ఇప్పటివరకు 46 మంది మరణించగా, 1.75 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. వరద పరిస్థితిని సమీక్షించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 9న రాష్ట్రంలో పర్యటిస్తారని బిజెపి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సునీల్ జాఖర్ ఆదివారం తెలిపారు. పంజాబ్‌లో వరద పరిస్థితిపై మోదీ తీవ్ర ఆందోళన చెందుతున్నారని, దానిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారన్నారు. పంజాబ్ ప్రజలకు గరిష్ట సహాయం అందించడానికి స్థానిక పరిస్థితులను వ్యక్తిగతంగా అంచనా వేయడానికి, వాస్తవాలను అర్థం చేసుకోవడానికి మోదీ మంగళవారం పంజాబ్‌లో పర్యటించనున్నట్లు జాఖర్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో తెలిపారు. ఇప్పటికే కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్రంలో పరిస్థితిని అంచనా వేయడానికి పంజాబ్‌ను సందర్శించారు. వరదల వల్ల సంభవించిన నష్టాన్ని అంచనా వేయడానికి సందర్శించిన రెండు కేంద్ర ప్రభుత్వ బృందాలు తమ పర్యటన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి తమ నివేదికలను సమర్పించనున్నాయి. భారత ప్రభుత్వం పంజాబ్ ప్రజలకు అండగా నిలుస్తుంది అని జఖర్ పేర్కొన్నారు. పంజాబ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాలను చౌహాన్ ఈనెల 4న సందర్శించి పంట నష్టం ఎంతవరకు ఉందో పరిశీలించి, దానిని 'జల్ ప్రలై (వరద)' పరిస్థితిగా అభివర్ణించారు. ఈ సంక్షోభం నుండి రైతులకు ఉపశమనం కలిగించడానికి కేంద్రం అన్ని ప్రయత్నాలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అమృత్‌సర్, గురుదాస్‌పూర్, కపుర్తల జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలను మంత్రి సందర్శించారు.

### దేశ రాజకీయాలలో పరివర్తన కలిగించిన
## 'భారత్ జోడో యాత్ర'



3వ వార్షికోత్సవం సందర్భంగా
స్పందించిన కాంగ్రెస్
ప్రజాసమస్యలు ఎలుగెత్తడమే
యాత్ర ఉద్దేశం : జైరామ్‌రమేష్

**న్యూఢిల్లీ :** భారత్ జోడో యాత్ర 3 వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ దీనిపై స్పందించింది. భారత్ జోడో యాత్ర దేశ రాజకీయాలలో ఒక పరివర్తన కలిగించే మైలు రాయి అని అభివర్ణించింది. ఈ యాత్ర నిరవధికంగా ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది అని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేష్ మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర 3ఏళ్ల క్రితం ఇదే రోజున కన్యాకుమారి వద్ద ప్రారంభమైందన్నారు. స్వామి వివేకానంద శిలా స్మారక చిహ్నాలు, ఇతర ప్రసిద్ధ ప్రదేశాల సందర్శించి చివరిగా ఒక బహిరంగ సభలో పాల్గొననున్నారని తెలిపారు. పెరుగుతున్న అసమానతలు, లోతైన సామాజిక ధ్రువణత, అధికమవుతోన్న రాజకీయ నిరంకుశత్వం వంటి ఆందోళనకరమైన ప్రజా సమస్యలను నొక్కిచెప్పుతూ హైలెట్ చేసేందుకు ఈ భారత్ జోడో యాత్రను చేపట్టడం జరిగిందని జైరామ్ రమేష్ తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. 'రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర 4,000కి.మీ.ల పాదయాత్ర. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ 200మందికి పైగా భాతర్ యాత్రికులు కాలినడకన ఈ యాత్రలో ప్రయాణించారు. ఇది 145 రోజులకు పైగా కొనసాగింది.12రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలను కవర్ చేసింది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చెప్పారు. 'మన దేశ రాజకీయాలలో ఈ భారత్ జోడో యాత్ర ఒక పరివర్తన కలిగించే మైలురాయి' అని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. ఈ మార్చ్ సందర్భంగా రాహుల్ గాంధీ 12 పబ్లిక్ మీటింగ్‌ల్లో, 100కి పైగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ల్లో, 13 ప్రెస్ కాన్ఫరెన్స్‌ల్లో, 275కి పైగా నడక సంభాషణలు, 100కి పైగా సిట్టింగ్ సంభాషణలు ప్లాన్ చేయబడినవని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ వివరించారు. 4,000కి.మీ.లకు పైగా ఉద్దేశించబడిన ఈ యాత్ర ద్వారా రాహుల్ గాంధీ తన మద్దతుదారుతో పాటు వ్యతిరేకుల దృష్టిని కూడా ఆకర్షిస్తున్నారు. ఈ యాత్రలో సమాజంలోని పెద్దలు సినిమా, టీవీ సెలబ్రిటీలు కమల్‌హాసన్, పూజాభట్, రియాసేన్, స్వరభాస్కర్, రష్మి దేశాయ్, ఆకాంక్ష పురి, అమోల్ పాలేకర్ తదితరులు ఉన్నారు. రచయితలు, మిలిటరీ ప్రముఖులతో పాటు పూర్వ ఆర్మీ చీఫ్ జనరల్ (రిటైర్డ్) దీపక్ కపూర్, మాజీ నౌకాదళాధిపతి(విశ్రాంత) దీపక్ కపూర్,మాజీ నావీ చీఫ్ అడ్మిరల్ (రిటైర్డ్) ఎల్.రాందాస్, పూర్వ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ రఘురామ్ రాజు, మాజీ ఆర్థికశాఖ కార్యదర్శి అర్‌విండ్ మయారామ్ కూడా ఈ భారత్ జోడో యాత్రలో పాల్గొన్నవారిలో ఉన్నారు. ప్రతిపక్ష నాయకులుగా ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ తరపున మోహబూబా ముఫ్తీ, శివసేన (యుబిటి) నాయకులు ఆదిత్య థాకరే, ప్రియాంక చతుర్వేది, సంజయ్ రౌత్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) నేత సుప్రీయా సూలే కూడా రాహుల్‌గాంధీతోపాటు ఈ భారత్ జోడో యాత్రలో నడిచినవారిలో ఉన్నారు.తి(విశ్రాంత) దీపక్ కపూర్,మాజీ నావీ చీఫ్ అడ్మిరల్ (రిటైర్డ్) ఎల్.రాందాస్, పూర్వ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ రఘురామ్ రాజు, మాజీ ఆర్థిక శాఖ కార్యదర్శి అర్‌విండ్ మయారామ్ కూడా ఈ భారత్ జోడో యాత్రలో పాల్గొన్నవారిలో ఉన్నారు. ప్రతిపక్ష నాయకులుగా ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ తరపున మోహబూబా ముఫ్తీ, శివసేన (యుబిటి) నాయకులు ఆదిత్య థాకరే, ప్రియాంక చతుర్వేది, సంజయ్ రౌత్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) నేత సుప్రీయా సూలే కూడా రాహుల్‌గాంధీతోపాటు ఈ భారత్ జోడోయాత్రలో నడిచినవారిలో ఉన్నారు.

### అమెరికా దిగుమతులపై
## ధైర్యంగా 75% సుంకం విధించాలి

ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సవాల్



**న్యూఢిల్లీ :** అమెరికా దిగుమతులపై ధైర్యంగా 75 శాతం సుంకం విధించాలని ప్రధాని మంత్రి నరేంద్ర మోదీకు ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సవాల్ విసిరారు. ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలకు ప్రతిస్పందనగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. డిసెంబర్ 31వ తేదీ వరకు అమెరికా నుంచి పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని మినహాయించాలన్న కేంద్రం నిర్ణయం భారత పత్తి రైతులను దెబ్బతీస్తుందన్నారు. 'ప్రధానిధైర్యం చూపించాలని కోరుతున్నాం. దేశం మొత్తం మీ వెనుక ఉంది. భారతదేశం నుంచి వచ్చే ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకం విధించింది. మీరుఅమెరికా నుంచి వచ్చే దిగుమతులపై 75 శాతం సుంకం విధించండి. దేశం దానిని భరించడానికి సిద్ధంగా ఉంది. దానిని విధించండి. అప్పుడు ట్రంప్ తలొగ్గుతుందో లేదో చూడండి' అని కేజ్రీవాల్ అన్నారు.

**ట్రంప్ ఎదుట మోకరిల్లిన మోదీ ప్రభుత్వం!**

అమెరికా నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై 11 శాతం సుంకం విధించాలని, కనీస మద్దతు ధరను నిర్ణయించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. 20 కిలోలకు రూ. 2,100 చొప్పున పత్తిని సేకరించాలని, అలాగే ఎరువులు, విత్తనాలపై సబ్సిడీని కూడా ఆయన డిమాండ్ చేశారు. భారత్‌పై అమెరికా విధించిన 50 శాతం సుంకం వజ్రాల కార్మికులను కూడా ప్రభావితం చేసిందని, ఎందుకంటే మోదీ ప్రభుత్వం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు మోకరిల్లిందని ఆరోపించారు. డిసెంబర్ 31 వరకు పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపును పొడిగించాలనే నిర్ణయం ఎగుమతి మార్కెట్లలో భారత్ స్థానాన్ని బలోపేతం చేస్తుందని కేజ్రీవాల్ తెలిపారు. ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకం విధించినప్పుడు, మోదీ దానికి ప్రతిగా పెంచలేదని తెలిపారు. కానీ దానిని (అమెరికా నుంచి పత్తి దిగుమతులపై) 11 శాతం తగ్గించారని, ప్రధాని ఎందుకు వంగి బలహీనంగా మారారని ప్రశ్నించారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ అని, ఇక్కడి ప్రజలు మోదీ వెనుక నిలబడతారన్నారు. 'దేశం మొత్తం మోదీజీ వెనుక నిలబడి ఉంది. ఆయన (ట్రంప్) 50 శాతం సుంకం విధించారు. మోదీజీ పత్తిపై 100శాతం సుంకం విధించి ఉండాలి. ట్రంప్ తలవంచాల్సి వచ్చేది. ట్రంప్ ఒక పిరికివాడు. తనను ధిక్కరిస్తే అన్ని దేశాల ముందు ఆయన తలవంచుతారు. నాలుగు అమెరికన్ కంపెనీలను మూసివేయండి, వారు ఇబ్బందుల్లో పడతారు' అని ఆయన పేర్కొన్నారు. అమెరికా నుండి దిగుమతి చేసుకునే పత్తిపై 11శాతం సుంకాన్ని తొలగించాలనే భారత్ విధాన నిర్ణయం కారణంగా, అక్టోబర్–నవంబర్‌లో రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చినప్పుడు వారి ఉత్పత్తులను విక్రయించబోమని కేజ్రీవాల్ అన్నారు. 'అమెరికా నుంచి పత్తి (భారతదేశంలోకి) వచ్చినప్పుడు, ఇక్కడి రైతులకు మార్కెట్లో రూ.900 కంటే తక్కువ లభిస్తుంది. రైతుల విషయంలో ఇదేజరుగుతోంది. అమెరికా రైతులు ధనవంతులుగా మారుతున్నారు. గుజరాత్ రైతులు పేదలుగా మారుతున్నారు' అని తెలిపారు. 'ఇప్పుడు మన దేశంలోని రైతులు తమ పత్తిని అమ్మడానికి మార్గం లేదు. మన దేశంలోని రైతు రుణం తీసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశాడు, (వ్యవసాయ) కార్మికులకు డబ్బు చెల్లించారు. ఇప్పుడు ఆయన రుణాన్ని ఎలా తిరిగి చెల్లిస్తాడు? బలవన్మరణకు పాల్పడడం తప్ప వేరే మార్గం ఉండదు' అని ఆప్ కన్వీనర్ పేర్కొన్నారు. అమెరికా ముందు భారత్ నిస్సహాయతను కూడా ఆయన ప్రశ్నించారు. ట్రంప్ సుంకాలు విధించిన ఇతర దేశాలు తీవ్రంగా స్పందించాయని కేజ్రీవాల్ తెలిపారు. కానీ భారత్ ఎటువంటి చర్య తీసుకోలేదని పేర్కొన్నారు.

## పశ్చిమబెంగాల్‌లో టీచర్‌పోస్టుల పరీక్షకు బిహార్, యుపి నిరుద్యోగులు

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్ రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌ఎస్‌సి స్కూలుస్థాయిలో పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయుల ఎంపిక పరీక్ష(ఎస్‌ఎల్‌ఎస్‌టి) తొమ్మిది సంవత్సరాల తర్వాత ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షలకు బిజెపి పాలిత బీహార్,ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుండి వేలాదిమంది హాజరయ్యారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాలని చెప్పుకుంటున్న బిజెపి పాలిత బీహార్, ఉత్తర ప్రదేశ్‌ల నుండి అభ్యర్థులు పశ్చిమ బెంగాల్‌కు వచ్చి టీచర్‌పోస్టుల ఉద్యోగాలకు పరీక్ష రాయడాన్ని తృణమూల్ కాం గ్రెస్ అధికార ప్రతినిధి కునాల్‌ఘోష్ తీవ్రంగా విమర్శించారు. బిజెపిపై విమర్శల దాడి చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒకపోస్టింగ్ పెట్టారు. బెంగాల్‌లో నిర్వహించే పరీక్షలు కేవలం బెంగాలీయులకు మాత్రమే కాదని, ఈ విషయంలో ఎవ్వరూ ఎవ్వరినీ అవమానించడంగానీ, వేధింపులకు గురిచేయడంగానీ జరగబోదని, వారిని ఎవ్వరూ అడ్డుకోరనీ కూడా పేర్కొన్నారు. 3.19 లక్షలమందికిగాను 91శాతం హాజరయ్యారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూళ్ళల్లో 26,000 మంది ఉద్యోగాలను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు గడచిన ఏప్రిల్ నెలలో తీర్పుచెప్పిన తర్వాత ఉపాధ్యాయ ఉద్యోగాల ఎంపికకు పశ్చిమబెంగాల్‌లో మొదటిసారి ఈపరీక్ష నిర్వహించారు. కోర్టు వ్యవహారాల వల్ల పరీక్ష జాప్యం జరిగింది. భారీ భద్రతమధ్య 636 కేంద్రాలలో ఆదివారం ఈ పరీక్ష నిర్వహించారు. మూడు అంచెల భద్రతావ్యవస్థ ఏర్పాటు చేశారు. బార్‌కోడ్ స్కానర్లు ఉపయోగించారు. మొబైల్ ఫోన్లు అనుమతించలేదు.డబ్ల్యుబిఎస్‌ఎస్‌సి ఛైర్మన్ సిద్ధార్థ మజుందార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ, 3.19లక్షలమంది అభ్యర్థులకుగాను 91 శాతంమంది పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు. వీరిలో ఎక్కువమంది బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ఉన్నా రు. బయట రాష్ట్రాల నుండి మొత్తం 31,000 మంది వచ్చి పరీక్ష రాశారని చెప్పారు. 9,10 తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి అసిస్టెంట్ టీచర్ పోస్టులు భర్తీ చేయడానికి ఈ పరీక్ష నిర్వహించారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అభ్యర్థి ఉమేశ్‌యాదవ్ మాట్లాడుతూ, సైన్స్‌లో తాను మా స్టర్స్ డిగ్రీ పొందాననీ, పశ్చిమబెంగాల్‌లో తన అ దృష్టం పరీక్షించుకోవడానికి వచ్చానని చెప్పారు. ప్రశ్నలు సులభంగా ఉన్నాయని కోల్‌కతా బసంతిదేవి కాలేజిలో పరీక్ష రాసిన శతాబ్దికంజీలాల్ చెప్పారు.

### 'ట్రంప్ టారిఫ్ టెర్రర్'
## బిజెపి సర్కార్ పటిష్ఠ చర్యలు తీసుకోవాలి

మాయావతి



**లక్నో :** భారతీయ వస్తువులపై అమెరికా విధించిన భారీ సుంకాల పెంపును 'ట్రంప్ సుంకాల టెర్రర్'గా బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి మాయావతి అభివర్ణించారు. పరిస్థితిని ఎదుర్కోవడానికి దృఢమైన చర్యలు ప్రారంభించాలని బిజెపి నేతృత్వంలోని కేంద్రాన్ని డి మాండ్ చేశారు. 'ట్రంప్ సుంకాల టెర్రర్ నుండి ఉత్పన్నమయ్యే పరిస్థితిని ఎదుర్కోవడానికి, అధికార బిజెపి ప్రజాప్రయోజనం కోసం బలమైన, అర్థవంతమైన సంస్కరణలను ప్రారంభించడం అత్యవసరం' అని ఆమె అన్నారు. లేనిపక్షంలో పేదరికం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, వలసలు వంటి దేశ ప్రజలను పీడిస్తున్న సమస్యలు మరింత దిగజారిపోతాయని, దేశ గౌరవం, ప్రపంచ స్థాయిని ప్రభావితం చేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాయావతి ఆదివారం లక్నోలో జరిగిన బిఎస్‌పి సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించారు. ట్రంప్ భారత వస్తువులపై సుంకాలను 50 శాతానికి రెట్టింపు చేయడంతో పాటు, రష్యా ముడి చమురు కొనుగోలుపై 25 శాతం అదనపు సుంకాలను విధించిన తర్వాత న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, అమెరికా చర్య అన్యాయం, అసమంజసమైనదని భారత్ అభివర్ణించింది. భారత దిగుమతులపై అమెరికా విధించిన సుంకాల ప్రభావంతో యుపిలోని ప్రముఖ ఎగుమతి కేంద్రాలు సతమతమవుతున్నందున, ఎగుమతిదారులు ఉద్యోగ నష్టాలు, నిలిచిపోయిన ఆర్డర్లు, మార్కెట్ ప్రాప్యత తగ్గిపోతుందని హెచ్చరించడంతో బిఎస్‌పి చీఫ్ ప్రకటన ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఆగస్టులో అనేక జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు చెలరేగినప్పటికీ, సుంకం సంవత్సరాల శ్రమతో కూడిన మార్కెట్ నిర్మాణాన్ని ప్రమాదంలో పడేసిందని నోయిడా, కాన్పూర్, వారణాసిలకు చెందిన పారిశ్రామిక నేతలు అన్నారు. భదోహిలో కార్పెట్ ఎగుమతిదారులు, రాంపూర్‌లోని మెంథా చమురు ఉత్పత్తిదారులు, మొరాదాబాద్‌లోని ఇత్తడి సామాను ఎగుమతిదారులు పెద్దఎత్తున ఆందోళన చేసిన తరువాత మరిన్ని నిరసన ప్రదర్శనలు జరిగాయి.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు నేడు ప్రతిపక్ష ఎంపిలకు మాక్ పోలింగ్

సాయంత్రం విందు ఇవ్వనున్న
కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి పదవికి ఈనెల 9న ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో ఓటు వేసే విధానంపై సోమవారం ప్రతిపక్ష ఎంపిలకు వివరణ ఇవ్వనున్నారు. అదేరోజు సాయంత్రం కాంగ్రెస్ అధ్యక్షు మల్లికార్జున్ ఖర్గే వారికి విందు ఇస్తారని ఇండియా కూటమి వర్గాలు ఆదివారం తెలిపాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై వివరణ ఇచ్చిన తర్వాత సోమవారం సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో 'మాక్ పోల్' నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పార్లమెంట్ అన్నెక్స్‌లో ప్రతిపక్ష ఎంపిలకు విందు ఇస్తారని ఆ వర్గాలు తెలిపాయి. ఉపరాష్ట్రపతి పదవికి అధికార ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్, ఉమ్మడి ప్రతిపక్ష అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డి మధ్య ప్రత్యక్ష పోటీ జరుగుతుంది. ఈసారి ఇద్దరు అభ్యర్థులు దక్షిణ భారతదేశానికి చెందినవారే. రాధాకృష్ణన్‌ది తమిళనాడు కాగా, సుదర్శన్‌రెడ్డి తెలంగాణ బిడ్డ. అధికార కూటమికి సంఖ్యాబలం ఉన్నప్పటికీ ఉపరాష్ట్రపతి ఎన్నికను ప్రతిపక్షాలు సైద్ధాంతిక యుద్ధంగా అభివర్ణించాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఉన్న రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి. మోదీ మాట్లాడుతూ మంగళవారం పార్లమెంట్ హౌస్‌లోని వసుధలోని రూమ్ నంబర్ ఎఫ్ 101లో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 9న ఉదయం 10 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందన్నారు. భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం ఎలక్టోరల్ కాలేజీలో పార్లమెంటు ఉభయసభల సభ్యులు ఉంటారు. రాజ్యసభకు నామినేట్ చేయబడిన సభ్యులు కూడా ఎలక్టోరల్ కాలేజీలో చేర్చడానికి అర్హులు, అందువల్ల ఎన్నికల్లో పాల్గొనడానికి అర్హులు. పార్లమెంట్ హౌస్‌లో పోలింగ్ ఏర్పాట్లను పి.సి. పర్యవేక్షిస్తున్నట్లు రాజ్యసభ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఓట్ల లెక్కింపు అదే రోజు సాయంత్రం ప్రారంభమవుతుందని, ఫలితం వెంటనే ప్రకటించబడుతుందని పేర్కొంది. రాధాకృష్ణన్ తమిళనాడుకు చెందిన బిజెపి అనుభవజ్ఞుడు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్ అయితే, సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి.

### బిహార్‌లో ఎస్ఐఆర్ నిర్వహించాలనే ఇసి నిర్ణయాన్ని సవాల్ చేసిన పిటిషన్లపై
## 'నేడు' సుప్రీంకోర్టు విచారణ



**న్యూఢిల్లీ :** త్వరలోనే ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను నిర్వహించాలని జూన్ 24న ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాజకీయ పార్టీలు సహా పలువురు దాఖలు చేసిన ఎన్నికల సంఘం పిటిషన్ల బ్యాచ్‌ను సుప్రీంకోర్టు నేడు(సోమవారం) విచారించనుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకవాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగీలతో కూడిన ధర్మాసనం రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి), ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తేహాద్‌ఉల్‌ముస్లిమీన్(ఏఐఎంఏఎం), ఇతర పిటీషన్ల ప్రతిస్పందనను పరిశీలిస్తోంది. ముసాయిదా ఓటర్ల బాజితాలోని7.24కోట్లమంది ఓటర్ల జాబితాలలో 99.5శాతం మంది ఎస్ఐఆర్ కసరత్తులో తమ అర్హత పత్రాలను కలిగిఉన్నారని ఎన్నికల సంఘం సమర్పించిన నోట్‌పై ఆర్‌జెడి, ఎఐఎంఐఎం,ఇతర పిటిషన్‌దారుల ప్రతిస్పందనను ఈ ద్విసభ్య ధర్మాసనం పరిశీలిస్తోంది. బిహార్‌లో ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెలిజెన్స్ రివిజన్ (ఎస్ఐఆర్) కసరత్తులో భాగంగా ఓటర్ల జాబితా ముసాయిదానుంచి పేర్లు తొలగించబడిన ఓటర్లు తమఅభ్యంతరాలను ఆన్‌లైన్ మోడ్ ద్వారా సమర్పించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని ఆగస్టు 22నుంచి రాజకీయ పార్టీలు సహా ఎన్‌జిఓ దాఖలు చేసిన పిటిషన్ల బ్యాచ్ ను అత్యున్నత న్యాయస్థానం విచారణను తిరిగి ప్రారంభిస్తుంది. సెప్టెంబరు 1న గడువు పొడిగింపు కోసం రాజకీయ పార్టీలు దాఖలు చేసిన కొన్ని దరఖాస్తులను విచారిస్తున్న సుప్రీంకోర్టు ఎస్ఐఆర్ కసరత్తు కింద బిహార్‌లో తయారు చేసిన ముసాయిదా ఎన్నికల జాబితా సంబంధిత వాదనలు, అభ్యంతరాలు, దిద్దుబాట్లను సెప్టెంబరు తర్వాత దాఖలు చేయవచ్చని, అయితే ఓటర్ల జాబితా తయారు అయిన తర్వాత వీటిని పరిశీలిస్తామని ఎన్నికల సంఘానికి తెలిపింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో నామినేషన్ ఫారమ్‌లకు ముసాయిదా జాబితాలోని క్లెయిమ్‌లు, అభ్యతరాలను చివరితేదీగా పరిగణించవచ్చని పేర్కొంది. బిహార్‌పై ఉన్న గందరగోళాన్ని 'ఎక్కువగా నమ్మక సమస్య' అని కూడా సుప్రీంకోర్టు తెలిపింది. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ పారాలీగల్ వాలంటీర్లను వ్యక్తిగత ఓటర్లకు, రాజకీయ పార్టీ వాదనలు, అభ్యంతరాలకు సహాయం చేయాలని ఆదేశించింది. ఇది ఆగస్టులో ప్రచురించబడింది. అయితే షెడ్యూల్ ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేయడానికి సెప్టెంబరు 1గడువును పొడిగించడాన్ని వ్యతిరేకించిన ఎన్నికల సంఘం, ఆగస్టు 22న సుప్రీంకోర్టు ఆగస్టు 30న ఇచ్చిన ఉత్తర్వు తర్వాత చేర్చడానికి 22,723 క్లెయిమ్‌లు మాత్రమే దాఖలు అయ్యాయని, మినహాయింపు కోసం అభ్యంతరాలు దాఖలు అయ్యాయని సమర్పించింది. రాజకీయ పార్టీలు తమను తాము చురుకుగా చేసుకోవాలి అని ధర్మాసనం చెబుతూ విచారణను సెప్టెంబరు 8కు వాయిదా వేసింది.

## జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్ : నక్సల్ హతం

**చాయ్‌బాస :** జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో ఆదివారం భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఎనకౌంటర్‌లో తన తలపై రూ.10 లక్షల రివార్డు ఉన్న మావోయిస్టు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గోయిల్‌కేరా పోలీస్ స్టేషన్ పరిధి రేలా పారల్ ప్రాంతంలోని పంచలతబురు కొండల అడవుల్లో ఈఎన్‌కౌంటర్ జరిగింది. కొల్హాన్ డిఐజి అనురంజన్ కిస్పోట్టా పిటిఐతో మాట్లాడుతూ మాట్లాడుతూ మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య తెల్లవారుజామున ఎదురు కాల్పులు జరిగాయని, ఆ జరిగిన సెర్చ్ ఆపరేషన్‌లో ఒక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఐజి (ఆపరేషన్స్) జార్ఖండ్ పోలీసు ప్రతినిధి మైఖేల్ రాజ్ ఎస్ పిటిఐతో మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న మృతదేహం సిపిఐ (మావోయిస్ట్) జోనల్ కమిటీ సభ్యుడు అమిత్ హన్స్‌డా అలియాస్ అప్తాన్‌గా గుర్తించామన్నారు. అతని తలపై రూ.10 లక్షల రివార్డు ఉన్నదన్నారు. రేలా పారల్ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు శనివారం సమాచారం అందిందని వెస్ట్ సింగ్‌భూమ్ పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్‌పి) రాకేష్ రంజన్ తెలిపారు. సమాచారం ఆధారంగా, చైబాసా పోలీసులు, 209 కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (కోబ్రా) సంయుక్త బృందం సెర్చ్ ఆపరేషన్ నిర్వహించగా, ఉదయం 5.45 గంటలకు ఎన్‌కౌంటర్ జరిగిందని ఆయన తెలిపారు. సెర్చ్ ఆపరేషన్‌లో హన్స్‌డా మృతదేహంతో పాటు సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్స, కొన్ని కార్ట్రిడ్జ్‌లు లభించాయని రంజన్ విలేకరులకు తెలిపారు.


# సాహితీ విహారి

# తెలంగాణ ఉద్యమజ్వాల కాళోజీ



ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరు వినగానే మనసుకు మొదట గుర్తుకొచ్చేది ఒక నిర్భయ పోరుడి స్వరం. సమాజంలోని దోపిడీని, అన్యాయాన్ని దిగజార్చే పదఘోష. ఆయన ప్రతి రచనా ఒక విప్లవ గర్జన. ఒక విధేయతలేని గళం. ఒక మానవతా మేలుకొలుపు. ప్రజల భాషలో రాయడం, ప్రజల నిజమైన బతుకులను ఆవిష్కరించడం కాళోజీ కవిత్వ ప్రత్యేకత. 'ప్రజాకవి' అనే బిరుదు ఆయనకు అతికినట్టు సరిపోతుంది. ఆయన మాటలు.. కవితలు నేరుగా పాఠకుల హృదయాల్లోకి చొచ్చుకుపోతాయి. ఆలోచింప చేస్తాయి. వాస్తవాలను కళ్లకు కడతాయి. అబద్ధపు ప్రచారాలను.. ఆర్భాటపు ప్రసంగాలను చాకిరేవు పెడతాయి. ఆయన కలం నిర్లిప్త సమాజాన్ని నిద్రలేపే ఘంటారావం. తెలంగాణ స్వభావం, పేద ప్రజల వేదన, గ్రామీణ కూలీల కష్టాలు, నిరుపేద విద్యార్థుల నిరాశ, రైతుల శ్రమ, తెలంగాణ అస్తిత్వ పోరాటంలో నెల రాలిన రక్తబిందువులు... వీటినే కాళోజీ ప్రస్తావిస్తారు. సమాజానికి అద్దం పడుతూ, వాస్తవ పరిస్థితులను వెల్లడిస్తారు. కాళోజీ అంటే బక్కపలుచని శరీరం.. నెరసిన గడ్డం... మేధస్సుతో మెరిసే ముఖం... కళ్లల్లో తెలంగాణ పట్ల అవాజ్యమైన.. తెలంగాణ ఆత్మగౌరవం కాళోజీ.. తెలంగాణ గుండచప్పుడు కాళోజీ.. తెలంగాణ భాష ప్రేమికుడు కాళోజీ.. అధునాతన తెలంగాణ సాహిత్య ప్రేరణ కాళోజీ. ఒక్క మాటలో చెప్పాలంటే, తెలంగాణకు ఆయన పర్యాయపదం. తెలంగాణ సాహిత్యానికి ఆయన మూల బలం. అందుకే, ఆ మహాకవి జయంతి తెలంగాణలో తెలుగు భాషా దినోత్సవమైంది. విద్యార్థి దశ నుంచే అన్యాయాన్ని ఎదరించడం ఆయన అలవాటు. అణచివేతను ధిక్కరించే ధైర్యం ఆయన సొత్తు. భూస్వామ్య వ్యవస్థ, జమీందారీ అణచివేతలు ఆయనను మరింతగా కదిలించాయి. తెలంగాణ భాష, సంస్కృతులు అడుగడుగునా అవమానాలు ఎదుర్కోవడం ఆయనను నిద్రపోనీయలేదు. అంతులేని సమస్యలు ఆయన ఆలోచనల్లో తుపాను రేపాయి. అందుకే, స్పందించాడు. తెలంగాణ వాణిని వినిపించాడు. తెలంగాణ బాణిని ఆలపించాడు. అణచివేతలను ఎదిరించాడు. సమాజ కుళ్లును తూర్పారబట్టాడు. రాజ్యహింసను నిరసించాడు. దోపిడీకి వ్యతిరేకంగా అక్షర తూటాలు సంధించాడు. తాడిత, పీడిత, బాధితుల తరఫున నిలబడి రాజ్యాంగ హింసను ఎదుర్కొన్నాడు. 1914 సెప్టెంబర్ 9న రంగారావు, రమాబాయమ్మ దంపతులకు కర్ణాటక రాష్ట్రం, బీజాపూర్ జిల్లాలోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించిన రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాస రాం రాజా కాళోజీ అందరికీ కాళోజీ నారాయణరావుగా సుపరచితుడు. తల్లి కన్నడిగుల ఆడపడుచు. తండ్రి మహారాష్ట్రీయుడు. కాళోజీ అచ్చమైన తెలంగాణ వాది. నాటి నిజాం నిరంకుశ పాలనను ఎదుర్కొడ్డి, రాజ్యహింసను ప్రశ్నించి, ప్రజాపోరాటాలకు మార్గదర్శకం చేశాడు. అక్షరాలే ఆయుధంగా సమరశంఖం పూరించాడు. ప్రజాకవిగా వెలుగొందాడు. 1992లో 'పద్మవిభూషణ'ను అందుకున్న కాళోజీ ప్రత్యేక తెలంగాణ కోసం కలలుగన్నాడు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశాడు. ఆయన రచనలు రగిల్చిన ఉద్యమ నెగడులే ప్రజాపోరాటాల అగ్నిజ్వాలలయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి పుష్కరం ముందు, 2002 నవంబర్ 13న తుదిశ్వాస విడిచిన కాళోజీ జీవితంలో ఏ పుటను తెరచినా తెలంగాణయే కనిపిస్తుంది. ఏ అక్షరాన్ని స్పృశించినా తెలంగాణ గీతమే వినిపిస్తుంది. కాళోజీ తెలంగాణపై అవాజ్య ప్రేమకు నిలువెత్తు సంతకం కాబట్టే, 'ఇదీ నా గొడవ' అంటూ ఆత్మకథను రాసుకున్నా, అందులోనూ ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష దర్శనమిస్తుంది. 'అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి... అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి' అని ఘంటాపథంగా చెప్పిన కాళోజీ 'అన్యాన్ని ఎదిరించన వాడే నాకు ఆరాధ్యుడు' అని కుండబద్దలు కొట్టాడు కూడా. ఆయన తపనంతా బలహీనుల కోసమే. ఆయన ఆరాటమంతా బాధితులకు అందాల్సిన న్యాయం కోసమే. అన్యాయాలకు బలైన వారి గొంతుకగా మారే ఆయన రచనలు, అణచివేతను ఎదిరించే సాహసాన్ని బడుగుజీవి అణువణువునా నింపుతాయి. ఆయన కవితలు శ్రద్ధగా రాసిన అలంకార పదవిన్యాసాలుకావు.. గుండెల్లో మండుతున్న కసికి నిలువెత్తు ప్రతీకలు. ప్రజలకు వ్యతిరేకంగా పనిచేసే అధికార వ్యవస్థలపై నిరసన అనేది ఆయన కవిత్వంలో ప్రముఖంగా కనిపించే భావం. ఎటువంటి రాజకీయ ముసుగులు లేకుండా ఆయన మనసాక్షికి మాత్రమే కట్టుబడతాడు... మాట్లాడతాడు... రచనలు చేస్తాడు. ఆయన పద్యం ఆడంబరాలపై వ్యంగ్యం కాస్త వినోదంగా కనిపించినా, లోపల వ్యధ, ఆగ్రహం ఉంటుంది. పేదవాడి ఆకలి ఆయన పద్యంలో నిజమైన మానవతా విలువగా ప్రతిధ్వనిస్తుంది. కవి అనగానే ఓ నాలుగు కఠిన పదాలు... మరో నాలుగు అవసరంలేని అలంకారాలు అనుకునే వారికి, నిజమైన కవిత్వం ఎలా ఉండాలో చూపించినవాడు కాళోజీ. ప్రజల మాటలే కవిత్వానికి ప్రాణం కావాలన్న నమ్మకాన్ని ఆచరణలో చూపిన కవి ఆయన. అందుకే ఆయన కవిత్వం చదివిన ప్రతీసారి పాఠకుడికి ఇది మనదే అన్న భావన కలుగుతుంది. ఆయన వాడినది తెలంగాణ మాండలిక భాష.. ఆయన ఎంచుకున్నది తెలంగాణ ఎదుర్కొంటున్న వివక్షపై పోరాట పంథా. ఆ లక్ష్యంతోనే ఆయన సాహితీ ప్రస్థానం మొదలైంది.. తెలుగు నాట ప్రకంపనలు రేపింది.. నేటికీ స్ఫూర్తినిచ్చే కేంద్రకంగా విరాజిల్లుతునే ఉంది. రాజ్యహింసను ఎదరించడానికి ప్రతిహింసకు దిగరాదనేది ఆయన సిద్ధాంతం. అయితే, ఉనికికే ప్రమాదం వాటిల్లినప్పుడు హింస తప్పుకాదని తేల్చిచెప్పారు. 'నియంతృత్వ ధోరణి మారనప్పుడు.. రాక్షస ప్రవృత్తికి కొనసాగుతున్నప్పుడు.. పరివర్తన ఎండమావిగా కనిపిస్తున్నప్పుడు... ఎదురు తిరగడం తప్పుకాదు. ప్రతిహింస నిషిద్ధమూ కాదు' అంటాడు కాళోజీ. ఆ లక్షణంతోనే రాజ్యహింసను ఎదరించాడు. స్వేచ్ఛకోసం పరితపించాడు. సమకాలీన సామాజిక సమస్యలపై ఆయన సాహితీ విల్లును ఎక్కుపెట్టి, అక్షర బాణాలు సంధించాడు. ఆయన రాసిన ప్రతి అక్షరంలోనూ తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం కనిపిస్తాయి. ఆయన ప్రతి మాటలోనూ తెలంగాణ పోరాటతత్వం, మడమతిప్పని ఆత్మవిశ్వాసం ఆవిష్కృతమవుతాయి. ఉన్నది ఉన్నట్టు చెప్పడంలో ఆయన ఏనాడూ వెనుకంజ వేయలేదు. నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా స్పందించడం ఆయన అలవాటు. అన్యాయాన్ని ఎదిరించడానికి కటువుగా ఉండడం ఆయన నైజం. కాళోజీ స్వేచ్ఛావాది. తన అస్తిత్వాన్ని అమితంగా ప్రేమిస్తాడు. అది భాష కావచ్చు.. వేషం కావచ్చు.. మాట లేదా తీరు కావచ్చు... ఏదైనా తనదైన తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చాడు. పరాయి భాష.. పరాయి యాస, పరాయి చూపులు.. పరాయి చెవులు.. పరాయి నడక.. పరాయి చేతలు తనకు వద్దేవద్దని ఖరాఖండింగా చెప్పాడు. తెలంగాణ ఆత్మగౌరవ పతాకాన్ని నలుదిశగా రెపరెపలాడించాడు. ఇజాల పేరుతో నిజాలను తొక్కిపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాడు. ఏదో ఒక వాదానికి కట్టుబడిపోవడాన్ని స్వేచ్ఛా రహిత జీవితంగా ఆయన అభివర్ణించాడు. 'నరుడనేను, నరుడ నేను, మనిషి బ్రతుకు బ్రతుకుతాను.... నా ఇష్టం వచ్చినట్లు నా మనసుకు నచ్చినట్టు మాట్లాడుతా.. రాస్తా.. ప్రకటిస్తా .. నా ఆలోచన నాది.. అభిప్రాయ భేదానికి అవకాశం లేకున్న, సభ్య ప్రపంచం సున్నా' అంటూ, తన మనసును.. తన నడతను.. తన నైజాన్ని వెల్లడించాడు. ఆయద దృష్టిలో కవిత్వం అనేది భావ ప్రకటన లేదా ఆత్మరంజక వ్యసనం కాదు. ఆయన తత్వం ప్రకారం, కవిత్వం సమాజానికి గళం. ఒక కవి కేవలం పూలను, చంద్రుణ్ని, ప్రేమను వర్ణించడం ద్వారా తన బాధ్యత పూర్తిచేయలేదు. కవిత్వం సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై కూర్చున్న చీకటిని తొలగించే మిణుగురుపురుగు. స్వేచ్ఛే కాళోజీ మతం. తనను తనగానే చూడాలన్నది ఆయన అభిమతం. అది తన స్వతఃసిద్ధమైన హక్కుగా పేర్కొంటారు. ఆ హక్కు లేని జన్మ ఎందుకని ప్రశ్నిస్తారు కాళోజీ. బతుకుమీద తీపి, ప్రాణం పట్ల మమకారం లేవు కాబట్టే పోరాట యోధుడయ్యారు. సమాజంలోని సమస్యలు.. జరిగిన సంఘటనలు.. తన స్పందనలు.. ఇవే కాళోజీ రచనలు. 'నాకున్నది కోరిక.. నా గొడవ నీకు రాసిన ఉత్తరంగా ఉండాలని.. చదువురులకు కవిత్వంగా ఉండాలని.. భావుకులకు మెదడుగా ఉండాలని.. మేధావులకు ఎడదగా ఉండాలని.. తార్కికులకు కరుణ పుట్టించేదిగా ఉండాలని.. అమాయకులకు ఆపద గుర్తించేదిగా వుండాలని..' అంటూ తన కోరికలను ప్రకటిస్తాడు. కవిత్వాన్ని ఆయన కేవలం హృయదస్పందనగా చూడలేదు. భావోద్వేగాల సరుకుగా పరిగణించలేదు. ప్రజలను చైతన్యవంతులను చేసే ముడిసరుకుగానే కవిత్వాన్ని భావించాడు. సమకాలీన రాజకీయాలు, ఆర్థిక, సామాజిక పరిస్థితులను కళ్లకు కట్టడమే కవిత్వ లక్ష్యమని నమ్మాడు. బతుకు బాటలో తుది మలుపువరకూ అదే ఆచరించాడు. . తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ, తెలంగాణ వాదాన్ని ఎలుగెత్తి చాటుతూ. ప్రజాకవిగా ఎదిగి నిత్యస్మరణీయుడయ్యాడు. తెలంగాణ యాసకు, భాషకు పట్టం కట్టి, తెలంగాణ ముద్దుబిడ్డ అయ్యాడు. కాళోజీ జయంతిని భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు మనమిచ్చే గౌరవం అనడం కంటే, ఆయన మనకు ఇచ్చిన వరం అనడంలోనే ఔచిత్యం ఉంటుంది.

**'సాగిపోవుటె బ్రతుకు**
**ఆగిపోవుటె చావు**
**సాగిపోదలచిన**
**ఆగరాదిచటెపుడు**
**ఆగిపోయిన ముందు**
**సాగనే లేవెపుడు**
**వేచియుండిన పోను**
**నోచుకోనే లేవు.**
**తొలగి తోవెవడిచ్చు**
**త్రోసుకొని పోవలయు.**
**బ్రతుకు పోరాటము**
**పడకు ఆరాటము.**
**బ్రతకదలచిన పోరు**
**సుతరాం తప్పదు.**
**చూపతలచిన జోరు**
**రేపనుట ఒప్పదు'** అంటాడు కాళోజీ తన 'బ్రతుకు' కవితలో. బతుకు పోరాటమైనా.. స్వరాష్ట్ర సాధన ఆరాటమైనా.. ఆగిపోతే చావుతో సమానమే.




\- సత్యశ్రీ

## చదవాల్సిన పుస్తకం

# అమరవీరులకు అరుణాంజలి

### కమ్యూనిస్టు త్యాగధనుల జీవిత చరిత్రలు




ఎన్ని రాజకీయ పార్టీలు ఉన్నా.. రాజ్యాలు ఏలినా.. నిరంతరం ప్రజల్లో ఉండేది మాత్రం కమ్యూనిస్టులే. అధికారం కోసం వెంపర్లాడకుండా, ప్రజా వాణిని వినిపించడానికి, ప్రజా ఉద్యమాలు నడిపించడానికి వామపక్ష పార్టీలు ఎప్పుడూ ముందుంటాయని కమ్యూనిస్టు దిగ్గజం, మాజీ పార్లమెంటు సభ్యుడు సురవరం సుధాకర రెడ్డి సంస్మరణ సభలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలు. ప్రజల కోసమే ఏర్పడి.. ప్రజల కోసమే పని చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) చరిత్ర అంటేనే త్యాగధనుల చరిత్ర. అమరవీరుల చరిత్ర. ప్రజా ఉద్యమాల చరిత్ర. సిపిఐ శ తవార్షికోత్సవం సందర్భంగా అనిల్ రాజింవాలె సంకలనం చేసిన పలువురు త్యాగధనుల జీవిత చరిత్రలను ప్రజాపక్షం ఎడిటర్ మక్కెన సుబ్బారావు అనువదించి, ఎడిట్ చేసిన 'అమరవీరులకు అరుణాంజలి' పుస్తకం అందిస్తున్నది. సిపిఐ ఆవిర్భావం పూర్వాపరాలను మక్కెన సుబ్బారావు తమ ఉపోద్ఘాతంలో సంక్షిప్తంగా వివరించారు. పార్టీ నిర్మాణానికి, ఎదుగుదలకు, దేశంలో కమ్యూనిస్టు భావజాల వ్యాప్తికి కృషి చేసిన ప్రముఖుల జీవిత చరిత్రలతో కూడిన ఈ పుస్తకంలో, ఐదు అధ్యాయాలు ఉన్నాయి. సత్యభక్త, పిసి జోషి, సచ్చిదానంద్ విష్ణు ఘాటె, చంద్ర రాజేశ్వరరావు, నల్లమల్ల గిరిప్రసాద్ వంటి సిపిఐ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శులను మొదటి అధ్యాయంలో పరిచయం చేశారు. రెండో అధ్యాయం 'మార్గదర్శకులు'లో మౌలానా హస్రత్ మొ హానీ, ఫిలిప్ స్ప్రాట్, ఎంఎస్ రాయ్, అమీర్ హైదర్‌ఖాన్ తదితరుల సంక్షిప్త జీవిత చరిత్రలు ఉన్నాయి. ఎకె గోపాలన్, సి. అచ్యుత మీనన్, హీరేన్ ము ఖర్జీ, కెటికె తంగమణి, షకీర్ అలీఖాన్, రాహుల్ సాంకృత్యాయన్, బలరాజ్ సాహ్ని వంటి 30 మంది 'పార్టీ నిర్మాతలు' మూడో అధ్యాయంలో కనిపిస్తా రు. ఇక, నాలుగో అధ్యాయంలో పేర్కొన్న 'తెలుగు నేలపై ఉద్యమ నిర్మాతలు' గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. పుచ్చలపల్లి సుందరయ్య, కంభంపాటి సత్యనారాయణ (సీనియర్), రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మోహియుద్దీన్, రాజబహదూర్ గౌర్, కెఎల్ మహేంద్ర, బొమ్మగాని ధర్మభిక్షం వంటి అతిరథమహారథులు వామపక్ష ఆలోచనా ధోరణులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన విధానాలు, ఆ క్రమంలో వారు ఎదుర్కొన్న సమస్యలు, చేసిన పోరాటాలు సంక్షిప్త రూపంలో పలకరిస్తాయి. చివరిదైన ఐదో అధ్యాయంలో 14 మంది కమ్యూనిస్టు 'మహిళామణులు' పరిచయమవుతారు. వీరి లో తొలి మహిళా కమ్యూనిస్టు సుహాసినీ చటోపాధ్యాయ, బొంబాయి (నేటి ముంబయి)లో తొలి మహిళా పార్టీ సభ్యురాలు పార్వతీబాయి భోర్, 'చిట్టగాంగ్ వీరనారి' కల్పనా దత్తా, క్విట్ ఇండి యా ఉద్యమ వీరనారి, 'భారతరత్న' అరుణ అసఫ్ అలీ, ట్రేడ్ యూనియనిస్ట్ పార్వతీ కృష్ణన్ తదితరుల స్ఫూర్తిదాయక జీవిత చరిత్రలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకం చేస్తాయి. మొత్తం మీద ఈ పుస్తకంలో పొందుపరచిన 74 మంది జీవిత చరిత్రలు, వే టికవే ప్రత్యేకం. అయితే, అందరూ ప్రజల పక్షాన నిలిచిన వారే. ప్రజా సమస్యలపై నినదించిన వారే. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం, వ్యాప్తిలో కీలక భూ మిక నిర్వహించిన వారే. ఇంత మంది ని గురించి పరిచయం చేస్తున్నది కాబ ట్టే, 'అమరవీరులకు అరుణాంజలి' తప్పక చదవాల్సిన పుస్తకం.




### పుస్తకం పేరు

**అమరవీరులకు అరుణాంజలి**
**కమ్యూనిస్టు త్యాగధనుల జీవిత చరిత్రలు**
**సంకలనం: అనిల్ రాజింవాలె**
**ఎడిటింగ్, అనువాదం: మక్కెన సుబ్బారావు**
**వెల: రూ. 220**

### ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## హేతువాదం.. గోపీచంద్ తత్వం

త్రిపురనేని గోపీచంద్ హేతువాదాన్ని తన తండ్రి త్రిపురనేని రామస్వామి నాయుడు నుంచి వారసత్వంగా పొందినట్టున్నాడు. అందుకే, ప్రశ్నించే నైజాన్ని నరనాన జీర్ణించుకున్నాడు. తన రచనలు ద్వారా సమాజం, మతం, రాజకీయ వ్యవస్థలను విశ్లేషించాడు. హేతువాదం ద్వారా సామాజిక రుగ్మతలను తరిమికొట్టవచ్చని నమ్మాడు. తన రచనల్లో ప్రతిబింబించాడు. గోపీచంద్ తత్వం సమాజానికి ఆయన ఇచ్చిన విజ్ఞానదీపం. ఆయన మానవతా సంకల్పం, విప్లవ భావాలు, హేతువాద వివేచన సాహిత్య వేదికగా నిలిచాయి. ఈ కోణంలో ఆలోచిస్తే, హేతువాదం సాహిత్యంలో ఒక సార్వత్రిక, నిత్య కీలక భావనగా పరిణమించగలదని స్పష్టమవుతుంది. గోపీచంద్ రచనలు హేతువాదం లక్షణాలను పొందిపుచ్చుకున్నాయి. సాహిత్యంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాయి. కారణాలని, ప్రమాణాలను, వాస్తవాలను ఆధారంగా ఉంచుకుని నియమాలు, సిద్ధాంతాలను విశ్లేషించి, మూఢ నమ్మకాలు, అంధవిశ్వాసాలు, సాంప్రదాయాలు వంటి పరిహాసనీయమైన, అనిర్దిష్టమైన ఆలోచనలను విమర్శించే వైజ్ఞానిక దృక్పథమే హేతువాదం. ఇది సమాజ పురోగతికి మూలస్తంభం. గతమంతా తప్పులతడకేనని, అప్పటి వారు అనుసరించిన విధానాలన్నీ ఆలోచనా రహితమైనవని అనుకోవడానికి వీల్లేదు. కానీ, అదే సమయంలో గుడ్డిగా నమ్మడం కూడా సరికాదు. ఏది సరైనది? ఏది మూఢత్వానికి దారి తీస్తుంది? అనేది ప్రశ్నించి, సమాధానం వెతుక్కోవడం వల్లే తెలుస్తుంది. హేతుబద్ధమైన ఆలోచనలకు ఇదే మూలసూత్రం. దీనిని నూటికి నూరుశాతం అనుసరించి చూపిన రచయిత, విశ్లేషకుడు, కవి గోపీచంద్, తన రచనల మాధ్యమంగా సమాజంపైకి ఎన్నో ప్రశ్నలు సంధించాడు. ఛాందసవాదాన్ని నిలదీశాడు. నమ్మిన సిద్ధాంతాలకు జీవితాంతం కట్టుబడిన నిబద్ధతగల రచయిత గోపీచంద్‌ను ఆయన జయంతి రోజు (సెప్టెంబర్ 8) స్మరించుకోవడం తెలుగు సాహితీలోకం తనను తాను గౌరవించుకోవడమే.


## మానసిక సంఘర్షణలతో 'అసమర్థుని జీవయాత్ర'




ప్రముఖ రచయిత, హేతువాది, సామాజిక ఉద్యమకారుడు త్రిపురనేని గోపీచంద్ (8 సెప్టెంబర్ 1910–2 నవంబర్ 1962) అద్భుత సృష్టి 'అసమర్థుని జీవయాత్ర'. బహుశా తెలుగులో ఇదే తొలి మనో వైజ్ఞానిక నవల కావచ్చు. కథ ఎవరి చుట్టూ తిరుగుతుందో, అతనే హీరో అనుకుంటే... ఈ నవల్లో సీతారామారావు కథానాయకుడు. మరొకరి జీవితాన్ని తప్పుతోవ పట్టించి, అర్థాంతరంగా ముగించేవాడిని విలన్ అంటారు కాబట్టి, ఈ నవల్లో ప్రతికథానాయకుడు కూడా సీతారామారావే. అతనికి అతనే మిత్రుడు. అతనికి అతనే శత్రువు. పెళ్లి, భార్య, పిల్లలు... వాళ్ల కోసం యాంత్రికంగా మారే జీవితం అంటే సీతారామారావుకు పడదు. కానీ, పెళ్లి చేసుకొని పిల్లల్ని కంటాడు. తండ్రి మరణించే ముందు కుటుంబ గౌరవాన్ని కాపాడాలని కోరుకున్నా లెక్కచేయడు. అతని ఆదర్శాలు ఉన్నతమైవి. విలాసాలు ఖరీదైనవి. ప్రశ్నిస్తాడుకానీ, సమాధానం వెతుక్కునే ఓపిక ఉండదు. కళ్ల ముందున్న వాస్తవాలను గ్రహించకుండా, కలల్లో బతుకుతాడు. వాటిని తలచుకొని భయపడతాడు. లోపల ఉన్న ప్రేమను వ్యక్తపరచలేక సమాజానికి, కుటుంబానికి దూరమవుతాడు. విలాసాలకు విచ్చలవిడిగా ఖర్చుచేసి, మామను అప్పు అడుగుతాడు. అతను తిరస్కరించడాన్ని జీర్ణించుకోలేక పోతాడు. ఆఫీసు కాగితాలపై మామ బొమ్మ వేసి, ఉద్యోగం పోగొట్టుకుంటాడు. తాను నిజ జీవితంలో చేయలేని పనులన్నీ కలల్లో పూర్తవుతాయి. అందుకే, కళ్లు తెరచి, నిజం చూడడానికి ఇష్టపడడు. అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడు. పాత సిద్ధాంతాలను తప్పుపడతాను. కొత్త మార్పులను నిర్లక్ష్యం చేస్తాడు. తనకు తానే ఒక ప్రశ్నగా మారిపోతాడు. చివరికి అర్థాంతరంగా మరణిస్తాడు. ఈ నవల చదివిన ప్రతి ఒక్కరికీ తనను తాను అద్దంలో చూసుకున్నట్టు అనిపిస్తుంది. సీతారామారావు వ్యక్తిత్వం దాదాపు ప్రతి సగటు మనిషిలోనూ ఉంటుంది. కానీ, హేతువును, వాస్తవ పరిస్థితులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లినప్పుడే జీవితం ఒక నిర్దిష్ట దిశగా ముందుకు సాగుతుంది. లేకపోతే ఏం జరుగుతుందో సీతారామారావు జీవితం మనకు వివరిస్తుంది. నవల రాసి 77 సంవత్సరాలైనప్పటికీ, నేటికీ అది నిత్యనూతనంగానే ఉందంటే, గోపీచంద్ దార్శనికతను అర్థం చేసుకోవచ్చు. సీతారామారావుకు రామయ్య ద్వారా చెప్పించిన మాటలు గోపీచంద్ ఆంతర్యాన్ని ఆవిష్కరిస్తాయి. 'జ్ఞానం కావాల్సిందే. జ్ఞనం లేకపోతే అభివృద్ధే ఉండదు. మానవుడు ప్రకృతిలో భాగమే అవటంవల్ల, జ్ఞానమే లేకపోతే, ప్రకృతి దాసుడుగానే ఉండేవాడు. ప్రకృతి నుంచి మానవుడ్ని వేరు చేసింది జ్ఞానమే' అని సీతారామయ్యకు చెప్తాడు రామయ్య. అయితే, జ్ఞానానికి రెండు వైపులా పదును ఉంటుందని, జ్ఞాన భాండాగారాన్ని ఎప్పటికప్పుడు నింపుకుంటూ ఉంటేనే అభివృద్ధికి తోడ్పడుతుందని స్పష్టం చే స్తాడు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా, జ్ఞా నం అనేది మానవ జాతినే సర్వనాశనం చేస్తుందని హెచ్చరిస్తాడు కూడా. ఈ మాటలు అనేక రకాలుగా నేటి సమాజానికి, పరిస్థితులకూ వర్తిస్తాయన్నది నిజం. పాత సిద్ధాంతాలన్నీ ఒక దాని తర్వాత ఒకటి అసంపూర్ణమని తెలుసుకొంటేనే కొత్త సిద్ధాంతాలు వస్తాయని కూడా రామయ్య పాత్రచేత చెప్పిస్తాడు రచయిత. కొత్త సిద్ధాంతాన్ని సైతం ప్రశ్నించే స్థాయికి మనిషి చేరుకోవడం ఆహ్వానించతగిన పరిణామమని చెప్పిస్తాడు. కానీ, పాతతోపాటు, కొత్త సిద్ధాంతాలు కూడా తప్పు అనే నిర్ధారణకు రావడం తగదని అంటాడు. జ్ఞానాన్ని తన్ను తాను నాశనం చేసుకోవడానికి ఉపయోగించే వ్యక్తిని మానవుడు కాదని, పరమ కిరాతకుడు, ఘోర రాక్షసుడని గోపీచంద్ ఆ పాత్ర ద్వారా స్పష్టం చేస్తాడు. ఎన్నో వైవిధ్యాలను, మరెన్నో మానసిక అంశాలను పొందపరచిన 'అసమర్థుడి జీవయాత్ర' తెలుగు సాహితీ రంగంలో ఒక గొప్ప క్లాసిక్‌గా నిలిచిపోయింది.

### పుస్తకం పేరు

**అసమర్థుని జీవయాత్ర**
**రచయిత: త్రిపురనేని గోపీచంద్**
**వెల: రూ. 120**



### ఈ వారం కవితలు

## నేటి రాజకీయ స్థితిగతులు

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి రాజకీయ పార్టీలు
సిద్ధాంతాలు లేకున్నా చెలామణిలో ఉంటున్నాయి
తామర తంపరగా పెరుగుతున్నారు నాయకులు
మతం, కులం, ప్రాంతం, భాషాపరంగా రాజకీయాలు
గల్లీ నుండి ఢిల్లీ వరకు విలువలు లేని రాజకీయాలు

ఇంటికో రాజకీయం, వీధికో రాజకీయం
తల్లిదో పార్టీ, తండ్రిదో పార్టీ, పిల్లలది మరో పార్టీ
ఒకే ఇంట్లో అన్నీ పార్టీల వాళ్ళు ఉన్నారు
ఇదే ప్రస్తుతం జరుగుతున్న రాజకీయం
దొంగలు, దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు

ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన వాళ్ళదే పైచెయ్యి
ఆ ఇంట పూర్తిగా అవినీతి పంటే
ప్రజాస్వామ్యంలో ఇదో బంపర్ ఆఫర్

ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలియని స్థితి
ఎప్పుడు ఎలా మారుతుంటారో అర్థం కాని పరిస్థితి
నేటి రాజకీయలకు పట్టిన దౌర్భాగ్య దుస్థితి
నాలుగు రాళ్ళు వెనకేసుకోవడమే నేటి రాజనీతి
గుడినీ గుడిలో లింగాన్ని మింగే వాళ్ళు ఉన్నారు
ప్రజాసేవ పేరుతో గడ్డిను వదిలిపెట్టడం లేదు
ఇసుకను సైతం వదిలి పెట్టడం లేదు
సహజ వనరులను దోచుకోవడం వాళ్లకు సహజం

దేశంలో పేదరికం పోనే పోదు
నిరుద్యోగ సమస్య పరిష్కారం కానే కాదు
నాయకుల ధన దాహం తీరాలంటే
సమస్యలు ఉండే తీరాలి
వరదలు, ఉప్పెనలు భూకంపాలు వచ్చే తీరాలి
నేతల కలలు సాకారం కావాటానికి అదే కదా మార్గం



నీతిలేని నేతలతో రాజకీయాలంటే రోత పుడుతుంది
నేరస్తులు చట్టసభలలో ఉంటే బాధ కలుగుతుంది
ఊసరవెల్లి నేటి నేతలను చూసి సిగ్గు పడుతుంది
తనకన్నా వేగంగా రంగులు మారుస్తున్నందుకు
విలువలు లేని రాజకీయాలతో ప్రజాస్వామ్యం గోవిందా
దేవుడా! రక్షించు దేశ రాజకీయాలను..
నేరస్తులు నుండి, రౌడీల నుండి,
ముఠా నాయకుల నుండి

**ఆచార్య గిడ్డి వెంకట రమణ,**
**9440984416**

## చీకటి చెలిమి

తిమిరంతో నాకు సమరం లేదు
అది నా ప్రియమైన దోస్త్
పొద్దుతో యుద్ధం చేసి
అలసిపోయి సేద తీరుతానా
చీకటి చిక్కని
కలల పాలపుంతల్ని నాపై వంచి
జోలపాడుతుంది

చీకటి నా అనేకానేక
ఆలోచనల వారథి
నా ఆకాంక్షల మెట్లెక్కించే సారథి
నిర్మలంగా నిశ్చలంగా
నన్ను నిద్రాదేవత ఒడిలోకి
చేర్చేది చీకటే అందుకే
రాతిరి అంటే నాకు మక్కువ
చీకటిని నేనెందుకు
ద్వేషించాలి..

చీకటితో చెలిమి చేసి చూస్తే
రాత్రి విలువ హృదిని
చుట్టు కుంటుంది
చీకటిని అల్లుకున్న రాత్రి
ఎన్నో నిశీధి గీతాలను
మనసు పలకపై పరుస్తోంది

చీకటి గుమ్మనంగా
నిశ్శబ్దంగా నా కవితాక్షరాలను
స్వాగతిస్తుంది
ఎన్నో కవితలకు
పురుడు పోసిన సమయం అదే
నా ఊహలకు ప్రాణం పోసే
అమృత ఘడియలు రాత్రులే
నా కన్నీళ్ళను బాధల్ని
నెమరువేసుకునే
నా ఆత్మీయ వాతావరణం చీకటే

చీకటి నా తోబుట్టువు
నన్ను రేపటి ఉదయానికి
శక్తివంతంగా ముస్తాబు చేసే
అపురూపమైన నేస్తం

నాలోకి నేను అవలోకన మయ్యేది
చీకటి వాకిటి తోవలోనే
అవునన్నా కాదన్నా...
వెలుగు నా అర్థాంగి
చీకటి నా ప్రియ దోస్త్....!

**డా.కటుకోర్ఘ్వుల రమేష్**
**సెల్:9949083327**

## బిఇడి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన బిఇడి కాలేజిలో ఉపాధ్యా విద్యను అభ్యశిస్తున్న విద్యార్థులకు సమయాను కూలంగా సరైన పౌష్టికాహారాన్ని అందించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ ఆదేశించారు. ఆదివారం ఆయన బిఇడి కాలేజీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు తయారు చేస్తున్న వంటకాలను, చికెన్, కూరగాయలతో వండిన ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందితుంది లేనిదీ, కిణాలల్లో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిఓ మాట్లాడుతూ వర్షా కాలం కొనసాగుతున్నందున ఆహారాలు వేడిగా ఉన్నప్పుడు మాత్రమే వడ్డించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆదివారం తప్పని సరిగా చికెన్ అందించాలని ఉండగా, కాంట్రాక్టర్ లేటుగా అందించడంతో కాంట్రాక్టర్‌ను మందలించారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలని, అందుకోసం సౌకర్యాలు కూడా కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏటిడిఓ అశోక్ కుమార్, టిఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు పెన్షనర్ల సంఘం జిల్లా సమావేశం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఖమ్మం జిల్లా సమితి సర్వసభ్య సమావేశం ఈనెల తొమ్మిదిన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవి కుమార్ లు తెలిపారు. పెన్షనర్ల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం కృషి భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పరిశ పుల్లయ్య, రవికుమార్ లు మాట్లాడుతూ ఖమ్మంజిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో జరుగుతుందని ఈ సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరు కావాలన్నారు. పెన్షనర్ల సమస్యల్లో పరిష్కరించే పోరాట కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు వారు తెలిపారు. పెన్షనర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య ధోరణిని సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.పెన్షనర్ల సమస్యలకు తక్షణం పరిష్కారం చూపాలని లేని పక్షంలో ఆందోళన బాట తప్పదని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు బి. కృష్ణకుమారి, పెద్దమళ్ల సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, పి. వీరభద్రరావు, ప్రసాదరావు, బెల్లం రాధాకృష్ణ, కె. శ్రీనివాసరావు, యుగంధర్, ఎం. మల్లికార్జునరావు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి తుమ్మల పర్యటన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేడు ఖమ్మంలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం గ్రామంలో మూడు కోట్ల వ్యయంతో నిర్మించనున్న బిసి వెల్ఫేర్ హాస్టల్ నిర్మాణ పనులకు, రూ. 30 లక్షలతో నిర్మించనున్న పశువుల ఆసుపత్రి భవన నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం జరిగే సభలో మంత్రి పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని తొమ్మిదవ డివిజన్ రోటరీనగర్‌లో సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటన సందర్భంగా వివిపాలెంలో ఏర్పాట్లను ఆదివారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాపా ఆదినారాయణ, కిలారు వెంకటరమణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఖమ్మంలో జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ప్రైవేట్ రంగం ఖమ్మం రిలయన్స్ నిస్సాన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఉద్యోగాలు కల్పించుటకు సెప్టెంబర్ తొమ్మిదిన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ తొమ్మిది మంగళవారం ఉదయం 10 గంటలకు గాంధీ చౌక్‌లోని కోటాక్ మహీంద్ర బ్యాంక్ పైన గల రిలయన్స్ నిస్సాన్ లైఫ్ ఇన్సూరెన్స్ ఖమ్మం నందు జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఖమ్మంజిల్లాలో పనిచేసేవిధంగా రిలయన్స్ నిస్సాన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హత కలిగి, 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి వేతనం రూ. 20వేల నుండి రూ. 50వేల వరకు ఉంటుందన్నారు. మొత్తం 25 ఉద్యోగాల భర్తీకి గాను జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల జిరాక్స్ సర్టిఫికెట్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

## త్రివేణిలో 'గ్రాండ్ పేరెంట్స్ డే'



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రైమరీ విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్‌ను పాఠశాలకు ఆహ్వానించి వారి విశిష్టతను, ఉమ్మడి కుటుంబం యొక్క గొప్పతనాన్ని పిల్లలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రాండ్ పేరెంట్స్‌ను సన్మానించారు. త్రివేణి సంస్థల అధిపతి గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్య లతో పిల్లలకు ఉండే అనుబంధం చెప్పలేనిదన్నారు. మనవళ్లు, మనవరాళ్లను గ్రాండ్ పేరెంట్స్ చూసుకునే విధానం ఎంతో ముచ్చటగొలుపుతుందన్నారు. చిన్నారులతో గ్రాండ్ పేరెంట్స్ సరదాగా ఆటలు ఆడుతూ కబుర్లు చెబుతూ వారితో ఆనందంగా గడుపుతారన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రాండ్ పేరెంట్స్ చిన్నారుల మధ్య ఎమోషనల్ బంధం ఉంటుందన్నారు. చిన్నారులకు కొత్త కొత్త విషయాలను, వారి అనుభవాలను తెలియజేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్‌వో కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రహణంతో జిల్లాలోని ఆలయాలు మూసివేత



**ప్రజాపక్షం/భద్రాచలం :** సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా జిల్లాలోని వివిధ దేవాలయాలను మూసివేశారు. ఈ చంద్రగ్రహణం అరుదైందిగా ఖగోళశాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్రహణాన్ని పురస్కరించుకుని భద్రాచలం రామాలయంతో పాటు పాల్వంచలోని పెద్దమ్మతల్లి ఆలయం, కొత్తగూడెంలోని గణేష్ టెంపుల్, అన్నపురెడ్డిపల్లిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు జిలాల్లోని అన్ని అలయాలను అర్చకులు పూజల అనంతరం మూసివేశారు. ఆదివారం రాత్రి 8.58 గం.లకు ప్రారంభమయ్యే ఈ గ్రహణం (బ్లడ్‌మూన్ 11గం. నుండి 12.22గం.వరకు సంపూర్ణ గ్రహంగా రూపాంతరం చెందుతుంది. అదే విధంగా రాత్రి 2.25 గం.లకు వీడిపోతుంది. అర్ధరాత్రి తర్వాత వీడుతుండటంతో సోమవారం ఉదయం అలయాలను తెరిచి సంప్రోక్షణ చేసి యధావిధిగా పూజాధికార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రహణం సమయంలో చంద్రుడు గాఢ ఎరుపురంగులోనికి మారి కనువిందు చేయనున్నాడు. సూర్యునికి, చంద్రునికి సరిగ్గా మధ్యలోనికి భూమి రావడంతో చంద్రునిపై పడే సూర్యకిరణాలు భూవాతావరణంలోనే పరిక్షేపణం చెందడం,భూమి అంచుల నుండి ఎరుపు రంగు కాంతి చంద్రునిపై ప్రసరించడంతో ఎరుపురంగులోకి మారుతాడు.

చంద్రగ్రహణం

## కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర

### బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని అందుకే లేనిపోని విమర్శలు చేస్తున్నారని బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం కూలిపోతే మల్లన్న సాగర్‌లో నీళ్లు ఎక్కడివని, హైదరాబాద్‌కు తాగునీరు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసిఆర్ ఉద్యమ నాయకునిగా తెలంగాణ సాధించిన వ్యక్తిగా ఒక యజ్ఞంలా కృష్ణా, గోదావరి నీళ్లను తెలంగాణ పంట పొలాలకు మళ్లించేందుకు కృషి చేశారన్నారు. అందులో భాగంగా పుట్టిందే కాళేశ్వరం ప్రాజెక్టు అన్నారు. ఆనాడు తలాపున గోదావరి నది పారుతున్నప్పటికీ తాగడానికి కూడా నీళ్లు లేని దుస్థితి ఉందన్నారు. ప్రాణహిత గోదావరిని ఒడిసిపట్టి కాళేశ్వరం ప్రాజెక్టును రూపొందించడం జరిగిందన్నారు. మేడిగడ్డ దగ్గర రెండు ఫిల్లర్లు కుంగితే మొత్తం కాళేశ్వరమే కుంగిందని కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నగర అధ్యక్షుల పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమలరావు, దోకుపర్తి సుబ్బారావు, మందడపు శంకర్‌రావు, పగడాల నరేందర్, కొండలరావు, మురళికృష్ణ, మహ్మద్ రఫీ, గోపి, రాజేష్, అశోక్‌సింగ్, షారూక్ అరాఫత్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్పొరేటీకరణకు మోదీ సర్కార్ కుట్ర

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి గోవిందరావు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** వ్యవసాయ కార్పొరేటీకరణకు మోదీ సర్కార్ కుట్ర చేస్తుందని దేశీయ సంస్థలు మాదిరి వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్ శక్తులకు అప్పగించి రైతులను కూలీలుగా మార్చే యత్నంలో ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ఆరోపించారు. దేశంలో కార్పొరేట్ శక్తులకు అంతర్జాతీయంగా అమెరికా ఆంక్షలకు మోదీడీ తలొగ్గారని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంజిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆదివారం జరిగింది. సమావేశంలో కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ ఇప్పటికే కార్పొరేట్ శక్తులకు తలొగ్గి వ్యవసాయ రంగ సబ్సిడీలను రద్దు చేసిన మోదీ సర్కార్ ఇప్పుడు పత్తి దిగుమతిపై సుంకాన్ని రద్దు చేయడం భారతదేశ వ్యాప్తంగా పత్తి రైతులను ఆర్థికంగా దెబ్బతీయడమేనని ఆయన తెలిపారు. విదేశాల నుంచి దిగుమతి అయ్యే పత్తిపై గతంలో 11 శాతం పన్ను విధించే కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఆ పన్నును పూర్తిగా రద్దు చేసిందని దీని వల్ల దేశ వ్యాప్తంగా రైతులు పండిస్తున్న పత్తి కంటే విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పత్తి రేటు తక్కువగా ఉండి స్థానికంగా ఉత్పత్తి అయ్యే పత్తికి ధర తక్కువగా ఉంటుందని దీని వల్ల పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకుంటున్న పత్తిపై రద్దు చేసిన పన్ను ప్రతిపాదనను తక్షణం ఉపసంహరించుకోవాలని యధావిధిగా 11శాతం పన్నును విధించాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు చట్టబద్ధమైన మద్దతు ధర కోసం సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తుందని ఆ క్రమంలోనే ఖమ్మంలో ఈనెల 10న ఉదయం 10 గంటలకు స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాగం హేమంతరావు, పర్స పద్మ, ఇతర రైతు సంఘాల బాధ్యులు హాజరవుతున్నారని గోవిందరావు తెలిపారు. పెద్ద సంఖ్యలో రైతులు హాజరై సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, కూచిపూడి రవి, ఏపూరి రవీంద్రబాబు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పావులూరి మల్లికార్జున్, వెంకటనర్సయ్య, పుచ్చకాయల సుధాకర్, మార్గం శ్రీనివాస్, దొబ్బల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 10న ఎస్‌కెఎం సదస్సు

### సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపు




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఈనెల 10వ తేదీన ఉదయం 10గంటలకు ఖమ్మం నగరంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 31వ డివిజన్‌లో రైతుసంఘం(ఎఐకెఎస్) ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం పత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని అమలు చేయాలన్నారు. అలాగే క్వింటాకు రూ.1వేయి 75 మద్దతు ధర చెల్లించాలన్నారు. అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పెసర, పత్తి పంటకి తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ఆ సమస్యను పరిష్కారం దిశగా ప్రభుత్వాలు దృష్టిసారించాలన్నారు. అనంతరం సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు మామిడి సుదర్శన్‌రెడ్డి, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల నాయకులు మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, దొంతగాని వెంకన్న, ఘనపారపు నాగయ్య, పొన్నెకంటి రామకృష్ణ, ఏర్పుల లింగయ్య, బొడ్డు ఉపేందర్, ఘనపారపు వీరన్న, మామిడాల కిరణ్, చల్లా రాములు, ఏర్పుల రాములు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ సర్కార్‌పై సమరం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** వ్యవసాయ పంటలకు యూరియా సంపూర్ణంగా రైతులకు అందించే వరకు కేంద్రంలో ఉన్న బిజెపి నరేంద్రమోదీసర్కార్‌పై రైతులు సమరశీలపోరాటలకు సమాయత్తం కావాలని ఖమ్మం జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ జిల్లా సిపిఐ కౌన్సిల్ సభ్యులు మునిగె కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం అమ్మపాలెం గ్రామంలో జరిగిన రైతుసంఘం సమావేశంలో వారు ప్రసంగించారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసి కార్పోరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించి రైతులను కూలీలుగా మార్చే ప్రయత్నంలో వ్యవసాయ సంస్కరణ చట్టాలను నరేంద్రమోడి ప్రభుత్వం తీసుకొచ్చిందని వారు ఆరోపించారు. ఈ చట్టాలు పూర్తిస్థాయిలో అమలు జరిగితే రైతాంగం తీవ్రమైన ఇబ్బందులకు గురవుతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఐక్యంగా తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని తెలిపారు ఈనెల 10న ఖమ్మంలో జరిగే రైతుసదస్సుకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతుసంఘం మండల అధ్యక్షుడు డేరంగుల లక్ష్మయ్య, సీనియర్ నాయకులు వెంపటి పరుశురాములు, నరసింహారావు, కోసూరి నాగేశ్వరరావు, వెంపటి శ్రీనివాసరావు, లక్ష్మి, నరసయ్య, అలియాల లాలు, భూక్యా రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పత్తికి మద్దతు ధర ఇవ్వాలి

### దొండపాటి రమేష్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రైతులు పండించిన పంటకు జాతీయ రైతుల కమీషన్ ఎంఎస్ స్వామినాథన్ కమీషన్ సిఫార్స్ చేసిన సమగ్ర సి ప్లస్ 2 ప్లస్ 50 ఖర్చుల సూత్రాన్ని ఉపయోగించి క్వింటాకు 10,075 రూపాయలు మద్దతుధర కల్పించాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తనికెళ్ల సిపిఐ కార్యాలయంలో గుమ్మిడెల్లి సైదారావు అధ్యక్షతన జరిగిన రైతుసంఘం సమావేశం లో ఆయన ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగుమతుల సుంకాన్ని తొలగించడం వలన భారత దేశం అంతటా 60 లక్షల పత్తి రైతు కుటుంబాల జీవనోపాధి మరింత దెబ్బతింటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తు వ్యవసాయరంగాన్ని దెబ్బతీసేందుకు రైతులపై కక్షసాధింపు చర్యలను కొనసాగిస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతను బిజెపి ప్రభుత్వమే కారణమని పేర్కొన్నారు. అకాల వర్షాలకు తుఫానులకు నష్టమైన పంటలకు నష్టపరిహారం అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఆయన ఆరోపించారు. వరిధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ ఇంతవరకు ఇవ్వకపోవడం దురదృష్టకరమని అన్నారు. పెసరపంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. పంటల భీమా పథకం లేకపోవడం వల్ల రైతులు తమ పంటలు కోల్పోయి ఆర్థికంగాఅప్పుల పాలవుతునానరని అన్నారు. తక్షణమే పంటల భీమా పథకాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చశారు. రైతులు ఐక్యం తమ సమస్యల పరిష్కారంకోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎస్‌కెఎం ఆధ్వర్యంలో ఈనెల 10న ఖమ్మంలో జరిగే సదస్సు ద్వారా బిజెపి నరేంద్రమోడి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈ సదస్సులో పోరాట కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో రైతుసంఘం జిల్లా నాయకులు రత్తమయ్య, బాసా నాగరాజు, యాసా వెంకటేశ్వర్లు, రాములు, మల్లిఖార్జున్ తదితరులుపాల్గొన్నారు.

# దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం

### ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి డిమాండ్



**ప్రజాపక్షం/చింతకాని:** సంయుక్త కిసాన్‌మోర్చ (ఎస్‌కెఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న జరిగే రైతు అవగాహన సదస్సు ను జయప్రదం చేయాలని ఎఐకెఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ కొండపర్తి గోవిందరావు పిలుపునిచ్చారు. ఆదివారం చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో కొండపర్తి మాట్లాడుతూ పత్తి దిగుమతి సుంకం 11శాతం కొనసాగించాలని, పత్తికి మద్దతు ధర రూ.10,075/ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని, మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు యూరియా సరఫరా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగే అవగాహన సదస్సులో రైతులు అధిక సంఖ్యలోమ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు, సిపిఐ మండల కార్యాదర్శి దూసరి గోపాలరావు,ఏఐకెఎస్ మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, రైతులు ఏపూరి నర్సయ్య, కొల్లి చిన్న వెంకటి, గోపాల్, కిట్టయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

### ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్థానిక సంస్థల ఓటరు జాబితాపై నేడు (సోమవారం) గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్థానిక సంస్థలైన ఎంపిటిసి, జెడ్పిటిసిల వారీగా ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితా తయారు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. దీనిపై జిల్లా స్థాయిలో వివిధ గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో సోమవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు.

## రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### సిపిఐ, ఎఐకెఎస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



**ప్రజాపక్షం/ తల్లాడ :** రైతుల సమస్యలను వెంటనే కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు డిమాండ్ చేశారు. ఆదివారం తల్లాడ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రధానమంత్రి మోడీకి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, ఏఐకెఎస్ జిల్లా నాయకులు నల్లమోతు నరసరావు లు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం రైతులు క్యూలైన్లలో పడిగాపులు కాస్తున్నారన్నారు. ఇటీవల వచ్చిన వర్షాలకు వరి, పత్తి,పెసర, మొక్కజొన్న వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుని నష్టపరిహారం అందించాలన్నారు. సకాలంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులను అందించాలని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సంతకాల సేకరణ ద్వారా తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, దండు ఆదినారాయణ, జిల్లా నాయకులు లక్ష్మినారాయణ, రామకృష్ణ, మల్లేష్, శ్రీను, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## లంబాడీలు ఎస్‌టిలు కాదనడం సరైంది కాదు

### లంబాడీ జెఎసి నిరసన




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లంబాడీలు ఎస్‌టిలు కారు అని చెప్పడం సరైంది కాదని టిఎస్‌టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ ఈరునాయక్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో లంబాడీల మీద జరుగుతున్న అసత్యప్రచారాలు, ప్రజాప్రతినిధులు సుప్రీం కోర్టులో లంబాడీలను ఎస్టి జాబితా నుంచి తీసివేయాలని కేసులు వేయడాన్ని నిరసిస్తూ లంబాడీ జెఎసి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఈరునాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండు వర్గాల మధ్య జరుగుతున్న విబేధాన్ని పరిష్కరించాలన్నారు.

లంబాడీలు రాజ్యాంగ బద్ధంగానే ఎస్టిలుగా చెలామణి అవుతున్నారని ఎస్టిలు కాదని కించపర్చడం సరైంది కాదన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బానోత్ కిషన్‌నాయక్, భూక్యా భిక్షపతిరాథోడ్, డా॥ రాజ్‌కుమార్ యాదవ్, రవిరాథోడ్, మంగ్యానాయక్, రామ్మూర్తినాయక్, తారాదేవి, సోమ్లా నాయక్, వెంకట్రావు, హరి, హీరాలాల్, శోభన్ నాయక్, లక్ష్మన్ నాయక్, భాస్కయ్య నాయక్, భీముడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్ ఎదుట ఆందోళన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వ్యవసాయ కార్మికులకు మహాలక్ష్మి , ఆత్మయ భరోసా పథకాన్ని తక్షణం అమలు చేయాలని పింఛన్లను నాలుగువేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్ తెలిపారు. ఈనెల ఎనిమిదిన ఉదయం 10 గంటలకు వందలాది మంది వ్యవసాయ కార్మికులతో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టామని వారు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మహాలక్ష్మి పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి రూ. 2,500 ప్రతి నెల ఇవ్వాలని, ఆత్మీయ భరోసా ద్వారా వ్యవసాయ కార్మికుల ఖాతాల్లో ఏడాదికి రూ. 12వేలు జమ చేయాలని, గతంలో ఇస్తున్న రెండు వేల పింఛన్‌ను నాలుగువేలకు పెంపుదల చేయాలని, దివ్యాంగుల పింఛన్‌ను కూడా పెంచాలని తదితర డిమాండ్‌లతో ఈ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కొత్త మున్సిపాలిటీలలో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయడంతో పాటు గత ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లుగా 57 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని వారు తెలిపారు. ఆందోళన కార్యక్రమానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్ లు తెలిపారు.

## ట్రాక్టర్ ప్రమాదంలో డ్రైవర్ మృతి



**ప్రజాపక్షం/గుండాల :** గుండాల మండల కేంద్రానికి సమీపంలో గల కిన్నెరసాని వాగునుండి ఇసుక తోలుతున్న ఒ ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు దిగి లోయలో పడి ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఇక్కడ ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఎస్‌కె పాష(64) ఇసుక తీసుకువచ్చేందుకు కిన్నెరసానివాగుకు ట్రాక్టర్ డ్రైవర్‌గా వెల్లాడు,వాగునుండి ఇసుక లోడ్‌చేసుకొని వచ్చే క్రమంలో సాయనపల్లిగుండాల మార్గ మద్యలో దేవర చింత చెట్టు వద్ద రోడ్డు పక్కనున్న లోయలోకి దూసుకెల్లింది. ట్రాక్టర్ బ్రేక్ లాక్ ఊడిపోవడంతో గుంతలో పడిపోవడంతో డ్రైవర్ పాష చెట్టుకొమ్మల మద్య పడిపోగ ఇసుక పైనపడి ఊపిరి ఆడక అక్కడి కక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లందుకు తరలించారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

## ఇలా అయితే ఎలా ?

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో పై ఓవర్ పక్కన నుండి నర్సంపేట వెళ్లే సూచిక బోర్డు పై పిచ్చి మొక్కలు పెరిగి కనిపించకుండా పోయింది. దీంతో కొత్త వ్యక్తులు వచ్చే వారి వాహనాలు అటు నర్సంపేట ఎటు వైపు, నెక్కొండ ఎటు వైపు, వరంగల్ ఏటు వైపు వెళ్లాలి అంటూ వారి వాహనాలు ఆపి పాదాచారులను అడగ వలసిన పరిస్థితి ఏర్పడి ఉన్నది. రోడ్డు భవనాల అధికారులు సూచిక బోర్డు, కిలోమీటర్ల రాయి మట్టా ఎప్పటిక పుడు మొక్కలను తొలగించి బోర్డులు కనిపించే లా గతంలో ఒక పద్ధతి ప్రకారం చేసేవారు. కానీ ప్రస్తుతం సిబ్బంది కొరత లేక నిర్లక్ష్యమా తెలియడం లేదు. బాధ్యతగల అధికారులే ఇలా నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అయితే ఎలా ? అంటున్న వాహనచోదకులు.




## తండ్రిపై దాడి చేసిన కొడుకుపై కేసు నమోదు:సిఐ నరేష్ కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** తండ్రిపై కత్తెరతో దాడి చేసిన కొడుకుపై కేసు నమోదు చేసినట్లు భూపాల పల్లి సిఐ నరేష్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే కారల్ మార్క్స్ కాలనీకి చెందిన మంగళపల్లి నర్సింహమూర్తి (56) సింగరేణి ఉద్యోగి ఇంట్లో కొడుకుతో గొడవ జరగడంతో క్షణిక ఆవేశంలో కొడుకు పక్కనే ఉన్నటువంటి కత్తెర పట్టుకొని తండ్రి పై దాడి చేయగా దవడ మీద గాయం కాగా స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. మంగళపల్లి నర్సింహమూర్తి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసింహమూర్తిపై దాడి చేసిన అతని కొడుకు కార్తీక్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐవచ్చ సాంబమూర్తి పాల్గొన్నారు.



## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి: ఎంపి కావ్య




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండలోని రాఘవేంద్ర కన్వెన్షన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రైవేట్ టీచర్స్ ఫెలిసిటేషన్ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీచర్ లతో కలిసి ఎంపీ బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది అని అన్నారు. విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందన్నారు. ప్రైవేట్ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి రాజీ పడకుండా పని చేస్తానన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ వ్యక్తిగత విజయానికి కాకుండా విద్యార్థుల, సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రైవేట్ టీచర్లు ఏకమై సంఘ తమ హక్కుల కోసం పోరాడాలన్నారు.ఈ కార్యక్రమంలో కడియం రామచంద్రయ్య, ఐఎన్టీయూసీ నాయకులు కూర వెంకట్, టీజీఎస్ పీటీయూ ఫౌండర్ ముజీబ్ ఖాన్, ప్రెసిడెంట్ ఫర్హానా తాసీమ్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి రేగొండ:** రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండల కేంద్రంలో టిట్యాల శివారులో ఉన్న రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆర్చి(స్వాగత తోరణం) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, భక్తుల సౌకర్యార్థం కొడవటంచ ఆలయంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత వైభవంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఎమ్మెల్యే వెంట కొడవటంచ ఆలయ చైర్మన్, ఈవో, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, ఉమ్మడి రేగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

## మూగజీవాలకు ముందస్తుగానే గ్రహణ సూచికలు

**ప్రజాపక్షం/నెక్కొండ:** పక్షులు, కోతులు, పిల్లులు, కుక్కలు ,ఇలా కొన్నింటికి వీటికి ప్రకృతిలో సంభవించే విపత్తులు ముందస్తుగానే తెలుస్తాయని మన పూర్వీకులు సైంటిస్టులు ఎన్నో సందర్భాల్లో తెలిపారు. అందులో భాగంగానే ఆదివారం రాత్రి జరగబోయే సంపూర్ణ చంద్రగ్రహణం దృశ్య వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పనికరలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతం నుండి పక్షులు, పిల్లులు, కోతులు, కుక్కలు, కనిపించకపోవడం ఇందుకు నిదర్శనం. ప్రతినిత్యం గ్రామంలో వానరాలు, స్వైర విహారం చేస్తూ సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో సైతం ఇళ్లపై చెట్లపై దర్శన మిచ్చేవికానీ ఆదివారం అవి కనిపించకపోవడం మనుషుల కన్నా వాటికే ఎక్కువ మేధస్సు ఉన్నట్టు పలు వర్గాల ప్రజలు వాటి మేధస్సును అభినందిస్తున్నారు.

## ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం

'స్థానిక' ఎన్నికల దృష్ట్యా ఎలాంటి గొడవలు జరగలేదు

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని 140 గణేష్ విగ్రహాలను ప్రశాంతంగా గురు, శుక్ర, శని ,వారాలలో పలు గ్రామాలలో వినాయక మండపాల నిర్వహకులు వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా ముగించారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఉన్నందున ఎలాంటి గొడవలు జరగకుండా ఎవరికి వారే జాగ్రత్తగా పార్టీ కార్యకర్తలను గ్రామస్థాయి నాయకులు కాపాడుకున్నారని ఎలాంటి గొడవల్లో ఉన్న పోలీస్ కేసులు ఉన్న అలాంటి వారు కనీసం వార్డు మెంబర్ గా కూడా పోటీ చేయడానికి అనర్హులని పోలీస్ కేసులు అవుతాయని భయంతో, ప్రశాంతంగా వినాయక నిమజ్జనాన్ని ముగించారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా ఏలాంటి గొడవలు లేకుండా పోలీసులకు ఎలాంటి పని కల్పించకుండా 140 వినాయక మండపాల్లో ని విగ్రహాలను ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయడంతో పోలీసులు, రెవెన్యూ,గ్రామపంచాయతీకార్యదర్శులు,అన్నివర్గాలుఊపిరిపీల్చుకున్నా యి.

## సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా కాళేశ్వరం ఆలయం మూసివేత




**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మూసివేసి ద్వారబంధనం చేసారు. తిరిగి సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం 7:30 గంటల నుండి స్వామి వారి దర్శనాలకు భక్తులను అనుమతిస్తారు. భక్తుల సందడితో నిత్యం కళకళలాడిన ఆలయం చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూసివేయడంతో ఆలయ పరిసరాలు వెలవెలబోయి నిర్మానుష్యంగా మారాయి.

# నవభారత నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం




ప్రైవేట్ టీచర్ల సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తాం

గురు పూజోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని




**ప్రజాపక్షం/హనుమకొండ :** నవభారత నిర్మాణానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హర్ష కన్వెన్షన్ హాల్, రాఘవేంద్ర మినీ ఫంక్షన్ హాల్ లో జరిగిన ప్రైవేట్ ఉపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన ఉపాధ్యాయులను సత్కరించి,అవార్డును అందజేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ సగటు ఉపాధ్యాయుడికి గౌరవం ఇవ్వడం అంటే మన రాబోయే తరానికి సన్మానం చేసినట్టేనని,ప్రైవేట్ టీచర్లకు చాలా సమస్యలు ఉన్నాయని తన దృష్టికి తీసుకొచ్చారని,రాబోవు రోజుల్లో తప్పకుండా మీ సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు.స్థానిక ఎమ్మెల్యేగా తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని,విద్యాబోధన అందిస్తూ పేదరికంలో ఉన్న ఉపాధ్యాయులకు తప్పకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధి చేకూరేలా చూస్తానని హామీ ఇచ్చారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఉన్న ప్రైవేట్ ఉపాధ్యాయులకి ప్రభుత్వ పరమైన సహాయ సహకారాలను అందించేందుకు తోడ్పడుతానని చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులి అనిల్ కుమార్,ఐఎన్టీయూసి నాయకులు కూర వెంకట్,అసిస్టెంట్ ప్రొఫెసర్ తిరునహరి శేషు ,కూరపాటి రమేష్,ముజీద్ కమిటీ సభ్యులు డోలి రాజు, ముకుందం,జిల్లా అధ్యక్షులు ప్రకాష్,చంద్ర మోహన్,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాపర్తి సుజాత,అస్మా బేగం ,అనిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ

తొర్రూరు డిఎస్పి కె.కృష్ణకుమార్



**ప్రజాపక్షం/ మరిపెడ:** పురుషోత్తమాయగూడెంలో మహిళ హత్య కేసులో మిస్టరీ వీడింది. వారంరోజుల్లో కేసును మరిపెడ సిఐ, ఎస్ఐ చేధించారు. హత్యకు సంబంధించిన వివరాలను ఆదివారం తొర్రూరు డిఎస్పి కె కృష్ణ కిషోర్ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఊల్లేపల్లి గ్రామానికి చెందిన బంటు వెంకటమ్మ (55 ) వ్యవసాయ కూలి మేస్త్రి గా జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆమెకు సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిల సీంగారం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రిగా పనిచేస్తున్న సాగల వీరన్నతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో వీరన్నకు వెంకటమ్మ అవసరమైనప్పుడు డబ్బు సహాయం చేస్తూ ఉండేది. ఈ క్రమంలో ఆగస్టు 31వ తేదీన వీరన్న తనకు డబ్బులు కావాలంటూ వెంకటమ్మకు ఫోన్ చేసి మరిపెడకు వచ్చాడు. మరిపెడ వచ్చిన తర్వాత ఆమెతో కలిసి ఇద్దరూ మద్యం (బీర్లు కొనుగోలు చేసి పురుషోత్తమాయగూడెం శివారు వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తుండగా వీరన్న డబ్బులు కావాలని అడగగా వెంకటమ్మ లేవని చెప్పడంతో క్షణికావేశంలో వీరన్న ఆమె ఒంటిపై ఉన్న నగలను బలవంతంగా లాక్కోవడంతో ఆమె ప్రతిఘటించింది. ఈ క్రమంలో తాగుతున్న బీరు సీసాను పగలకొట్టి ఆమె గొంతు పై దాడి చేయడంతో గాయం అయింది. ఆమె తప్పించుకునే మార్గం లేకపోవడంతో ఆమె దగ్గర ఉన్న చున్నీ తోనే ఆమె మెడపై బిగించి హతమార్చి పక్కనే ఉన్న నీటిగుంటలో పడేసి నగలతో పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో సిఐ రాజ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో హత్య కేసుగా నమోదు చేసి టెక్నాలజీ హ్యూమన్ ఇన్ఫర్మేషన్ సహకారంతో వారం రోజుల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు నాలుగు తులాల బంగారు ఆభరణాలు బైకు సెల్ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ వెల్లడించారు. కాగా హత్య చేసి వెళ్తున్న క్రమంలో నిందితుడు అధికంగా మద్యం సేవించి ఉండటంతో మార్గమధ్యంలో ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. హత్య కేసును చాకచక్యంగా వారం రోజుల్లో చేదించిన సిఐ రాజ్ కుమార్ గౌడ్,ఎస్ఐ బోలగాని సతీష్ గౌడ్, కానిస్టేబుళ్లు రమేష్, స్వామి, వేణు,మహేష్,రమ్య,శాంత,సందీప్ (డ్రైవర్ )లను డిఎస్పి అభినందించి వారికి ప్రత్యేక రివార్డు కోసం జిల్లా కార్యాలయానికి సిఫారసు చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా యూరియా అమ్మకాలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లా య ంత్రాంగం వ్యవసాయ పోలీస్ సంబంధిత అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పక్కా ప్రణాళికతో యూరి యా సరఫరా చేస్తున్నారు. జిల్లాలో శనిగపురం, ఎర్రబెల్లి గూడెం, మహబూబాబాద్ కేంద్రాలలో స్వయంగా జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, వ్యవసాయ శాఖ ఏడిఏ శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి మరియన్న, సంబంధిత సిబ్బంది,మరిపెడ, నరసింహులపేట కేంద్రాలలో రెవిన్యూ డివిజనల్ అధికారి గణేష్, ప్రత్యేక అధికారి డా. కిరణ్ కుమార్, జయచంద్ర, వ్యవసాయ రెవెన్యూ సంబంధిత సిబ్బంది,పెద్ద వంగర, దోర్నకల్ కేంద్రాలలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, గూడూరు మండల కేంద్రం లో ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు,గార్ల మండల ప్రాథమిక సహకార సొసైటీలో ప్రత్యేక అధికారి హరిప్రసాద్, తాహసిల్దార్ శారదబయ్యారం మండలంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తాహసిల్దార్ నాగరాజుఇనుగుర్తి మండల కేంద్రంలో ప్రత్యేక అధికారిని కృష్ణవేణి, సంబంధిత సిబ్బంది తో కలిసి యూరియా పంపిణీ (అమ్మకాలను) స్వయంగా పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ సహకార ఆగ్రోస్ ప్రైవేట్ కేంద్రాల ద్వారా రైతులకు యూరియా అమ్మకాలను క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా పారదర్శకంగా అమ్మకాలను కొనసాగించుటకు ప్రత్యేక అధికారులను నియమించి అన్ని విభాగాల సిబ్బందితో ముందుకు సాగుతున్నామని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల ఆదివారం తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని జిల్లా యంత్రాంగం ప్రతి ఒక్కరికి ఏరియా అందించడం కోసం ప్రత్యేక ప్రణాళిక,కార్యచరణ ద్వారా ముందుకు సాగుతున్నామన్నారు. అందులో భాగంగానే ఈరోజు ఉదయం ప్రత్యేక అధికారులు తహసిల్దారులు వ్యవసాయ శాఖ అధికారులు ఎంపిడిఒలు అన్ని విభాగాల సిబ్బంది వారికి కేటాయించిన కేంద్రాల వద్ద విధులలో ఉండి అమ్మకాలను సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రస్తుతం కేంద్రాలలో ఉన్న స్టాక్ వివరాలు ప్రతి ఒక రైతుకు సమాచారం అందిస్తూ ఎప్పటికప్పుడు వారికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు,

## కాళోజి కళాక్షేత్రంలో కళాకారులకు పురస్కారాలు

గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత డాక్టర్ శాంతి కృష్ణ



**ప్రజాపక్షం/వరంగల్ సిటి :** శాంతి కృష్ణ ఆధ్వర్యంలో వరంగల్ లో ఉన్న 108 మంది కళాకారులకు కాకతీయ కళావైభవం పేరిట ఘనంగా పురస్కారం అందించారు. అనంతరం గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత డాక్టర్ శాంతి కృష్ణ మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 54 దేశాల్లో ఒక వెయ్యి 112 మహోన్నతమైన అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల్ని నిర్వహించడం జరిగిందని, ప్రపంచంలోనే అత్యధిక ఎక్కువ ప్రోగ్రాం చేసినటువంటి ఆర్గనైజేషన్ గా శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందడమే కాకుండా ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ వరల్డ్ రికార్డును కూడా సాధించి అటు తెలంగాణ రాష్ట్రానికి ఇటు మన ఓరుగల్లు కీర్తిని ప్రపంచ స్థాయిలో నిలిపినటువంటి సంస్థగా శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి ముందున్నదని చెప్పారు. ఎంతో కళలకు కాణాచిగా ఉన్నటువంటి ఓరుగల్లును ఇష్టపడి కాళోజీ కళాక్షేత్రం బ్రహ్మాండమైనటువంటి కళాకారులను గుర్తించే దిశగా ముందుకెళ్లాలనే అంశంతో గత ప్రభుత్వం వారు శంకుస్థాపన చేసి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి పనిని పూర్తి చేసి ప్రారంభించారని, ఈ కళాక్షేత్రం కళాకారులకు అందుబాటులోకి రావాలని తాను మనస్ఫూర్తిగా ప్రభుత్వం వారికి విజ్ఞప్తి చేస్తున్నాని చెప్పారు. ఎందుకంటే లక్షల కొద్ది రూపాయలు చెల్లించేటువంటి సత్తా ఏ కళాకారుల దగ్గర కూడా ఉండదని, కళాకారులు కలలను బ్రతికించడం కోసమే బ్రతుకుతున్నారని, అలాంటి కళాకారులను గుర్తించి ప్రభుత్వం తరపునుంచి ప్రోత్సహించి ఈ కళాక్షేత్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని బండా ప్రకాష్ చెప్పడం హర్షించదగిన విషయమని అన్నారు. ఇక్కడ ఉన్నటువంటి కళాకారులకు ప్రోత్సాహాన్నిఅందిస్తే నాలాంటి వేలాదిమంది ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ రికార్డులు సాధిస్తారని, ప్రపంచవ్యాప్తంగా అనేక కళా రూపాల్ని ప్రదర్శిస్తారని, మన సంస్కృతిని సాంప్రదాయాన్ని తెలియజేసే ప్రయత్నం చేస్తారని అన్నారు. పురాతనమైనటువంటి సంస్కృతి మన సనాతన ధర్మం ఈ సనాతన ధర్మంతోటే ప్రపంచంలో ఉన్నటువంటి అనేక మతాలు గాని, అనేక జాతులుగాని, అనేక దేశాల సాంప్రదాయాలు గాని మన సనాతన ధర్మంతోటే మొదలు అయినాయి కాబట్టి సనాతన ధర్మాన్ని ప్రపంచవ్యాప్తీకరణం చేయాలంటే కేవలం కళాకారులతోటి మాత్రమే సాధ్యమైతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసన మండలి డిప్యూటీ వైస్ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు గట్టు మహేష్ బాబు, వేయి స్తంభాల గుడి ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ సాంబారి సమ్మారావు, కూచిపూడి పద్మ, శ్రావణి,సినీ కళాకారుడు రఘు నరేందర్, ప్రొఫెసర్ తిరుపతయ్య, ప్రముఖ పాత్రికేయుడు పోలిశెట్టి విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి పాత్ర ఎనలేనిది




**ప్రజాపక్షం/జనగామ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి పాత్ర ఎనలేనిదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, జనగామ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న అన్నారు. ఆదివారం రావినారాయణరెడ్డి 34వ వర్ధంతి సిపిఐ కార్యాలయంలో జరిగింది. నారాయణరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆది సాయన్న మాట్లాడుతూ ప్రపంచానికే దిక్సూచిగా నిలిచిన పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అన్నారు. ఆ పోరాటంలో అనేక మంది పాల్గొన్నారని, నైజాం మూకల చేత 10వేల మంది చంపబడగా నాలుగున్నర లక్షల ఎకరాల భూమి పంచబడిందన్నారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్ధం ఇలా అనేక మంది రైతాం సాయుధ పోరాటంలో ఎనలేని పాత్ర పోషించారన్నారు. వారి పోరాట పూర్తితో పోరాటాలు చేయాలన్నారు. ఈ నెల 13 నుండి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వయించనున్నట్లు తెలిపారు. వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బాణాల వెంకటేశ్వర్లు, అక్షయ్ కుమార్, హరిప్రసాద్, కాగితా సురేష్, మండల సరిత తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో కుండపోత వర్షం.. వరదనీటిలో చిక్కుకున్న రెండు బస్సులు



ప్రయాణికులను సురక్షితంగా బయటికి పంపిన పోలీసులు

**ప్రజాపక్షం/వరంగల్ సిటి :** గ్రేటర్ ఒరుగల్లు పరిధిలో ఆదివారం వర్షం దంచికొట్టింది. వరంగల్, ఖిల్లా వరంగల్ పరిధిలో ఉదయం 56.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రెండున్నర గంటలకు పైగా కురిసిన వర్షంతో నగర పరిధిలో పలు కాలనీలు జలమయ్యాయి. ఈ వర్షానికి కరీమాబాద్ పరిధిలోని 32, 33, 39 డివిజన్లలో పెద్ద కాలువ పొంగి రోడ్డుపైకి, ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవహించింది. వరద నీరు రావడంతో పలు కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హన్మకొండ పరిధిలో కూడా వర్షానికి రోడ్లు జలమయ్యాయి.భారీ వర్షానికి వరంగల్ నగరంలోని అండర్ బ్రిడ్జి వద్ద వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఒకేసారి వరద పెరగడంతో అండర్ బ్రిడ్జి వద్ద వాహనాలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. వరదను పట్టించుకోకుండా అండర్ బ్రిడ్జి కిందకు వెళ్లిన రెండు బస్సులు వరద నీటిలో చిక్కుకున్నాయి. అండర్ బ్రిడ్జి వద్ద వాహనాలు చిక్కుకున్న విషయం తెలిసిన వెంటనే పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షానికి నీట మునిగిన అండర్ బ్రిడ్జిలో వరదలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ సహాయక చర్యలను ఇంతేజార్ గంజ్ ఇన్స్పెక్టర్ షకూర్ తన సిబ్బందితో కలిసి తాళ్ల సాయంతో విజయవంతంగా నిర్వహించారు. వీరితో పాటు మున్సిపల్ సిబ్బంది, అధికారులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

**డీ వాటరింగ్ చేపట్టిన బల్దియా డిఆర్ఎఫ్ శానిటేషన్ బృందాలు**

ఆదివారం ఉదయం తక్కువ సమయం లో ఎక్కువ వర్షం కురవడం తో ఒకేసారి ఎక్కువ వరద నీరు చేరడంతో మాన్సూన్ రెస్పాన్స్ టీం సకాలంలో స్పందించి జలమయమైన వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలో వరద నీటిలో చిక్కున్న రెండు ఆర్టిసిబస్సులో చిక్కుకొని ఉన్న సుమారు 50 మంది ప్రయాణికులను బల్దియా కు చెందిన డిఆర్ఎఫ్ మాన్ సూన్ రెస్పాన్స్ బృందాలు, ఆర్ టి సి సిబ్బంది, శానిటేషన్ అధికారుల తో పాటు పోలీసు, రెవిన్యూ విభాగాలు వెంటనే స్పందించి తాళ్ళ సహాయం తో వారిని కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించడమే కాకుండా నీటి లో ఇరుక్కు పోయిన బస్సులను నీటి లో నుండి క్రేన్ సహాయం తో బయటకు తీయడం జరిగిందని అధికారులు తెలిపారు. అనంతరం ఆ ప్రాంతం లో నిలిచిన నీటిని డీ ఆర్ ఎఫ్, మాన్ సూన్ బృందాలు డీ వాటరింగ్ ద్వారా వరద నీటిని తొలగించిన నేపథ్యం లో శానిటేషన్ సిబ్బంది అక్కడ పేరుకు






పోయిన చెత్త బురదను తొలగించి ప్రజలు వాహనదారుల రాక పోకలకు అంతరాయం కలుగకుండా సజావుగా సాగేలా చేసినట్లు బల్దియా సిఎంహెచ్ఓ తెలిపారు. ఈ కార్యక్రమం లో బల్దియా డిఎఫ్ఓ శంకర్ లింగం, సిఎంహెచ్ ఓ డా॥ రాజారెడ్డి, ఏంహెచ్ఓ డా॥ రాజేష్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ



# వరుసగా రెండో ఏడాది యూఎస్ టైటిల్ గెలుచుకున్న సబలెంకా

బెలారస్ క్రీడాకారిణి, ప్రపంచ నంబర్ వన్ అరినా సబలెంకా వరుసగా రెండో ఏడాది యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. ఫైనల్లో ఆమె అమెరికాకు చెందిన అమండ అనిసిమోవాను వరుస సెట్లలో (63, 76(3)) ఓడించింది. 94 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో సబలెంక 13 విన్నర్లు కొట్టి, 15 అన్‌ఫోరడ్స్ ఎర్రర్లు మాత్రమే చేసింది. అనిసిమోవా 29 అన్‌ఫోర్డ్ ఎర్రర్లు, 7 డబుల్ ఫాల్ట్స్ చేసి తడబడింది. ఈ మ్యాచ్ సబలెంక తన శక్తివంతమైన సర్వ్ లు, ఖచ్చితమైన గ్రౌండ్ స్ట్రోక్‌లతో అనిసిమోవాను కట్టడి చేసింది. రెండో సెట్ టై బ్రేక్‌కి వెళ్లినా, ఆమె మానసిక స్థైర్యాన్ని చూపించి విజయం సాధించింది. సబలెంకకు ఇది నాలుగో గ్రాండ్ స్లామ్ టైటిల్. అన్ని టైటిళ్లను ఆమె హార్డ్ కోర్ట్‌పైనే సాధించింది. దీంతో ఆమెకు హార్డ్ కోర్డ్ రాణిగా గుర్తింపు వచ్చింది. సబలెంక 2023, 2024లో వరుసగా ఆస్ట్రేలియా ఓపెన్ టైటిళ్లు సాధించి.. 2024, 2025లో వరుసగా యూఎస్ ఓపెన్‌ను గెలిచింది. వరుసగా రెండు యూఎస్ ఓపెన్ టైటిళ్లు సాధించడంతో సబలెంక సెరీనా విలియమ్స్ సరసన చేరింది. సెరీనా కూడా గతంలో వరుసగా రెండు ఎడిషన్లలో యూఎస్ ఓపెన్ విజేతగా నిలిచింది. టైటిల్ గెలిచిన అనంతరం సబలెంక మాట్లాడుతూ.. ఇది నా జీవితంలో మరచిపోలేని క్షణం. నా దేశానికి, అభిమానులకు ఈ విజయం అంకితమని తెలిపింది. తాజా విజయంతో సబలెంక 100 గ్రాండ్ స్లామ్ మ్యాచ్లు గెలిచిన రెండో మహిళగానూ గుర్తింపు పొందింది. సబలెంక ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ ఫైనల్‌కు చేరి కోకో గాఫ్ చేతిలో పరాజయంపాలై రన్నరఫ్‌తో సరిపెట్టుకుంది.



# సెంట్రల్ జోన్‌కు ఆధిక్యం

## వెస్ట్, నార్త్ జోన్స్‌కు నిష్క్రమణ ముప్పు!

**బెంగళూరు:** దులీప్ ట్రోఫీలో సెమీస్ మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగుతున్నాయి. వెస్ట్‌జోన్‌తో జరుగుతున్న రెండో సెమీస్‌లో సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి 118 పరుగుల భారీ ఆధిక్యాన్ని సాధించి ఫైనల్ బెర్తును దాదాపుగా ఖాయం చేసుకుంది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో వెస్ట్ జోన్ 438 రన్స్‌కు ఆలౌట్ అయిన విషయం తెలిసిందే. 229/2తో మూడో రోజు ఆట ఆరంభించిన 'సెంట్రల్'కు శుభమ్ (96), కెప్టెన్ రజత్ పాటిదార్ (77), ఉపేంద్ర యాదవ్ (87), హర్ష్ దూబే (75) రాణించడంతో నాలుగో రోజు స్టంప్స్ సమయానికి ఆ జట్టు 556/8తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఇక సౌత్‌జోన్ కూడా ఫైనల్‌కు ఐదు వికెట్ల దూరంలో నిలిచింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో నార్త్ జోన్ నాలుగో రోజు ఆట చివరికి 278/5తో నిలిచింది. ఆ జట్టు ఓపెనర్ శుభమ్ ఖజురియా (128*) శతకంతో రాణించగా నిషాంత్ 82) కీలక ఇన్నింగ్స్ ఆడి ఆ జట్టును ఆదుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో నార్త్.. ఇంకా 258 పరుగులు వెనుకబడి (సౌత్‌జోన్ 536 ఆలౌట్) ఉంది. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప నార్త్, వెస్ట్ జోన్ జట్లు ఫైనల్ చేరడం కష్టమే.

# ఇంగ్లాండ్ బ్యాటర్లు విధ్వంసం



టెస్టుల్లో బజ్‌బాల్ ఆటతో రెచ్చిపోయే ఇంగ్లాండ్ బ్యాటర్లు వన్డేల్లోనూ దంచేశారు. దక్షిణాఫ్రికా బౌలర్లను ఊచకోత కోస్తూ జట్టు స్కోర్ నాలుగొందలు దాటించారు. బౌండరీల మోత మోగించిన జాకబ్ బెథెల్(110), జో రూట్ (100), శతకాలతో భారీ స్కోర్‌కు పునాది వేయగా మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ (62 నాటౌట్) సైతం దంచేశాడు. దాంతో.. నిర్ణీత ఓవర్లలో ఇంగ్లాండ్ 5 వికెట్ల నష్టానికి 414 రన్స్ చేసింది. ఈ ఫార్మాట్‌లో ఆ జట్టు 400 ప్లస్ చేయడం ఇది ఏడోసారి. నామమాత్రమైన మూడో వన్డేలో ఇంగ్లాండ్ ఆటగాళ్లు జూలు విదిల్చారు. ఆకాశమే హద్దుగా చెలరేగి జట్టుకు కొండంత స్కోర్ అందించారు. తొలుత ఓపెనర్ జేమీ స్మిత్(62) అర్ధ శతకంతో శుభారంభం ఇచ్చాడు. ఆ తర్వాత జో రూట్(100), జాకబ్ బెథెల్ (110) ద్వయం విధ్వంసక ఆటతో సఫారీ బౌలర్లకు చుక్కలు చూపించింది. పోటాపోటీగా బౌండరీలు బాదిన ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పారు. ప్రమాదకరంగా మారిన బెథెల్‌ను మహరాజ్ ఔట్ చేసి బ్రేకిచ్చాడు. కాసేపటికే కెప్టెన్ హ్యారీ బ్రూక్(3) రనౌట్‌గా వెనుదిరిగాడు. అప్పటికీ స్కోర్ మూడొందలు దాటింది. రూట్‌తో కలిసి విరుచుకుపడిన జోస్ బట్లర్(62 నాటౌట్)కు విల్ జాక్స్ (19 నాటౌట్) తోడవ్వగా ఇంగ్లాండ్ స్కోర్ బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. బర్గర్ వేసిన 50వ ఓవర్లో తొలి బంతిని జాక్స్ బౌండరీకి పంపడంతో స్కోర్ 400లకు చేరింది. అదే జోరులో అతడు మరో మూడు ఫోర్లు బాదగా ఆతిథ్య జట్టు ప్రత్యర్థికి 415 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

# ఫోకస్ ఆరోగ్యం



## మధుమేహానికి కొత్త చికిత్స!


సాధారణ భాషలో 'సుగర్'గా పిలిచే మధుమేహ సమస్య ఇటీవల చాలా ఎక్కువగా కనిపిస్తున్నది. మందులతో ప్రారంభమయ్యే చికిత్స చివరికి ఇంజక్షన్ల వరకూ కొనసాగుతుంది. వీటికితోడు అంతులేని ఆహారపు నియంత్రణలు... జీవనశైలి నిబంధనలు. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎదుర్కొంటున్న సమస్యలకు చైనాలో పరిశోధకులు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కొత్త చికిత్సను అందుబాటులోకి తీసుకొచ్చే పరిశోధనలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే క్లినికల్ ట్రయల్స్ సానుకూల ఫలితాలనిచ్చాయి. చైనా శాస్త్రవేత్తలు స్టెమ్ సెల్ థెరపీ ద్వారా మానవ రోగుల్లో టైప్ 1, టైప్ 2 మధుమేహాన్ని విజయవంతంగా నియంత్రించారు. ఇప్పటికే ఇద్దరు రోగులు ఇన్సులిన్ తీసుకోవడం మానేశారు. ఇది ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది కోసం నిజమైన ఔషధాన్ని సూచించే అద్భుతమైన ఫలితం. అయితే, అమెరికా వంటి దేశాలు ఈ పరిశోధనను ఎంత వరకూ అంగీకరిస్తాయన్నది అనుమానంగానే ఉంది. అమెరికా, ఐరోపా దేశాలతోపాటు, ఆసియా ఖండంలోనూ అనేక ప్రాంతాల్లో ఇన్సులిన్ వాడకం ఎక్కువగా ఉంది. అమెరికా ఇన్సులిన్ మార్కెట్ విలువ 20 బిలియన్ డాలర్లు. ఈ చికిత్సను వృద్ధి చేయడంలో పరిశ్రమ దిగ్గజాలు తీవ్రమైన ప్రతిఘటన చూపే అవకాశం ఉంది. ఏదిఏమైనా, చైనా శాస్త్రవేత్తల పరిశోధన, లక్ష్యం ప్రశంసనీయం. మధుమేహానికి స్టెమ్ థెరపీ ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి రావాలని ఆశిద్దాం.



## ఐస్‌తో జాగ్రత్త..

చాలా వరకు ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్స్‌లో అందించే ఐస్ గురించి వివిధ అధ్యయనాల నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికాలో ఇప్పుడు ఈ వార్త సంచలనం సృష్టిస్తున్నది. సాధారణంగా ఐస్ అనగానే అది శుభ్రంగానూ, ఎటువంటి రోగకారక బ్యాక్టీరియా లేకుండానూ ఉంటుందని భావిస్తాం. కానీ కొద్ది సంవత్సరాల శాస్త్రీయ అధ్యయనాలలో, పేరుమోసిన పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోని ఐస్‌లో బాక్టీరియా చాలా ఎక్కువగా ఉందని తేలింది. ఈ బాక్టీరియా మురుగుదొడ్ల నీటిలో కంటే ఈ ఐస్‌మీదే ఎక్కువగా ఉందన్న వార్త అమెరికాలో హాట్‌టాపిక్‌గా మారింది. అమెరికన్ న్యూస్ చానెల్స్ ప్రకారం, కొన్ని ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్స్ నుంచి సేకరించి, విశ్లేషించిన ఐస్‌లో భయానక స్థాయిలో ఆరోగ్యానికి ముప్పు కలిగించే బ్యాక్టీరియా ఉన్నాయని గుర్తించారు. కొన్ని ఐస్ నమూనాల్లో ఈ.కోలై, సాల్మొనెల్లా లాంటివి బాక్టీరియాను సైతం కనుగొన్నారు. రెస్టారెంట్లు ఐస్ మెషీన్లను తగిన విధంగా శుభ్రం చేయకపోవడం ఈ పరిస్థితికి మొదటి కారణంగా పేర్కొంటున్నారు. ఆ మెషీన్‌లలో ఉపయోగించే నీటి నాణ్యతను నిర్లక్ష్యం చేయడం కూడా మరో కారణం. కొన్నిసార్లు రెస్టారెంట్ సిబ్బంది శుభ్రమైన చేతులతో ఐస్‌ని తాకకపోవడంవల్ల కూడా బాక్టీరియా పెరుగుతుంది. ఇలాంటి ఐస్ వల్ల అనేకానేక ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు అంటున్నారు. శుభ్రతపై శ్రద్ధ లేని హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ స్టోర్స్ లాంటి ప్రదేశాల్లోని ఐస్ మురుగునీటి కన్నా ప్రమాదకరమైనదిగా మారుతుంది.

## కేన్సర్‌ను జయించిన వారిలో 'సర్వైవల్ సెల్స్'



కేన్సర్ వ్యాధిని జయించి, ఆ మహమ్మారి నుంచి బయటపడిన వారిలో ప్రత్యేకమైన 'సర్వైవల్ సెల్స్' అని పిలిచే 'టి' కణాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ఆవిష్కరణ కేన్సర్ చికిత్సలో కొత్త విధానాలకు శ్రీకారం చుడుతుందని అంటున్నారు. 'టి' కణాలు శరీర రోగనిరోధక వ్యవస్థలో ముఖ్యమైన భాగం. ఇవి హానికరమైన కణాలను గుర్తించి, అవి పెరగకుండా నశింపజేస్తాయి. కానీ, సాధారణంగా ఈ ప్రభావం ఎక్కువ కాలం కొనసాగదు. అయితే, సర్వైవల్ 'టి' కణాలు మాత్రం దీర్ఘకాలం చురుగ్గా ఉంటాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి కేన్సర్‌ను జయించడమేగాక, తిరిగి ఆ వ్యాధి సోకితే, మళ్లీ పోరాడేందుకు కేన్సర్ కణాలను గుర్తుంచుకుంటాయి. కాగా, ప్రస్తుతం కేన్సర్ చికిత్సకు అనుసరిస్తున్న కీమోథెరపీ, రేడియేషన్ తదితరాలు రోగి శరీరంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు చూపుతున్నాయి. సర్వైవల్ సెల్స్ శక్తిని అనుకరించడం ద్వారా, రోగిలో రోగనిరోధక శక్తిని బలపరచి, కేన్సర్‌కు వ్యతిరేకంగా సహజంగానే పోరాడే రీతిలో చికిత్సను అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది. ప్రత్యేకించి కేన్సర్ తుది స్టేజ్‌లో ఉన్నప్పుడు మెరుగైన చికిత్స అందించడం సాధ్యమవుతుంది. దీని వల్ల రోగులకు దీర్ఘకాలిక ఆశ కలుగుతుంది. ఈ కొత్త ఆవిష్కరణ కేన్సర్‌తో జపురుతున్న యుద్ధంలో పెద్ద మలుపు తీసుకురాగలదని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు.

## గ్రీన్ టీతో అల్జీమర్స్ దూరం!



జ్ఞాపకశక్తి నశించడం, ఆలోచించే నైపుణ్యం తగ్గడం వంటి రుగ్మతలను కలిగించే ప్రమాకరమైన అల్జీమర్స్‌ను గ్రీన్ టీ నియంత్రిస్తుంది. మెదడు వృద్ధాప్యాన్ని పూర్తిగా తొలగించకపోయినా, వాని ఉధృతిని మందగింప చేస్తుంది. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, ఇర్విన్‌లో పరిశోధనలు జరిపిన శాస్త్రవేత్తల అధ్యయన నివేదికను అనుసరించి గ్రీన్ టీ తాగడం వల్ల మనసును ప్రశాంతంగా ఉంటుంది. మెదడు త్వరగా వృద్ధాప్యానికి లోనుకాదు. గ్రీన్ టీలో సహజంగా లభించే ఎపిగల్లోకాటెచిన్ గెల్లేట్ (ఇజిసిజి), నికోటినామైడ్ (విటమిన్ బి3 ఫారమ్) వృద్ధాప్యానికి గురవుతున్న మెదడు కణాలలో శక్తిని పునరుద్ధరించి, అల్జీమర్స్ రోగంలో ప్రధాన కారణమైన అమాయలాయిడ్ బీటా వంటి హానికరం అయిన ప్రోటీన్ గుంపులను శుభ్రం చేస్తాయి. న్యూరాన్‌లు వృద్ధాప్యంగా మారుతూ ఉంటే మైటోకాండ్రియా శక్తిని కోల్పోతుంది. దీని వల్ల మెదడులో స్వాభావిక శుభ్రత వ్యవస్థ ఆటోఫ్యాజీ మందగిస్తుంది. ఆ ప్రాసెస్ సరిగా జరుగకపోతే, పాడైపోయిన ప్రోటీన్‌లు, చెత్త కణ భాగాలు అందులో చేరిపోతాయి, న్యూరోడెజెనరేషన్ ప్రమాదం పెరుగుతుంది. ఇజిసిజి, నికోటినామైడ్‌తో 24 గంటల పాటు న్యూరాన్‌లను సప్లిమెంట్ చేసినప్పుడు, మెదడులో శక్తి పునరద్ధరణ జరిగినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆటోఫ్యాజీని పునరుత్తేజం చేస్తుందని, కణాలు మెరుగుపడి, యువ మెదడు లాగా పనిచేస్తాయని తెలుసుకున్నారు. ఇజిసిజి సామాన్యంగా గ్రీన్ టీ, దాని సప్లిమెంట్లలో ఉంటుంది. కాగా, ఆరంభ పరిశోధనలు ఇంకో అల్జీమర్స్ లక్షణమైన టై టాంగిల్స్‌ని కూడా ఇది విభజించగలదని సూచిస్తున్నాయి. మెదడు ఆరోగ్యానికి శక్తివంతమైన సహజమైన మార్గం గ్రీన్ టీ సేవనమేనని స్పష్టం చేస్తున్నాయి.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

# తెలంగాణ పోరాట స్ఫూర్తి 'రావి'


ఖమ్మం..

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

## సిపిఐ జిల్లా కార్యాలయాల్లో నారాయణరెడ్డి వర్ధంతి సభలు

**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిలువెత్తు రూపం, తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపించిన అగ్ర నాయకులు రావి నారాయణరెడ్డి అని, వారి జీవితం స్ఫూర్తి దాయకమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి చిత్రపటానికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో సాయుధ పోరాటం ఒక మహోజ్వల ఘట్టమని తెలిపారు. ఆ పోరాటంలో రావి నారాయణరెడ్డి పాత్ర మరువలేనిదన్నారు. నల్లగొండకు నందికొండ ప్రాజెక్టు, నడికుడి రైల్వే జంక్షన్ తీసుకురావడంలో కీలకపాత్రను పోషించారన్నారు. తనకున్న వందల ఎకరా ల భూమిని రైతు కూలీలకు పంచిన ఆదర్శ నాయకుడని తెలిపారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్ఎ స్టాలిన్, మునిగాల బిక్షపతి, కొట్టేపాక రవి, మలోత్ శంకర్ నాయక్, వేల్పుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.


హనుమకొండ...

## తెలంగాణ పోరాట నిప్పు కణిక :బాగం

**ఖమ్మం :** తెలంగాణలో పోరాట అగ్గి రగిల్చిన వారిలో సుప్రసిద్ధ కమ్యూనిస్టు రావి నారాయణ రెడ్డి ఒకరని ఆయన పోరాట నిప్పు కణిక అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు అన్నారు. రావి నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆదివారం రావి నారాయణరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి సిపిఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణలో నాటి పరిస్థితులను చూసి తెలంగాణ విముక్తి తప్ప మరో మార్గం లేదని సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి ముందు వరుసలో నిలిచారన్నారు. రాజకీయాలకతీతంగా యావత్ తెలంగాణ ప్రజలు మహోన్నతుడిగా గౌరవించే రావి నారాయణరెడ్డి తన జీవిత కాలం కమ్యూనిస్టుగా జీవించారన్నారు. ఆ మహనీయుడి అడుగు జాడల్లో నడిచేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి, జిల్లా నాయకులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మద్దోజు శ్రావణ్, బోడా వీరన్న, జాకీర్, సురేందర్, శ్రీనాథ్‌రెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్‌సిటీ :** నిజాం పాలన విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి పిలుపునిచ్చిన మహోన్నతమైన కమ్యూనిస్టు యోధుడు రావి నారాయణరెడ్డి అని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ కొనియాడారు. ఆదివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా సమితి ఆద్వర్యంలో రావి వర్ధంతి జరిగింది. నారాయణరెడ్డి చిత్రపటానికి పంజాల శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లాకార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, బూడిద సదాశివ, శాఖ కార్యదర్శులు చెంచల మురళి, గామినేని సత్యం, నగునూరి రమేష్, నాయకులు నల్లగొండ శ్రీనివాస్, నునావత్ శ్రీనివాస్, పి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** తెలంగాణ రైతాంగ సాయుధపోరాట ఉద్యమానికి రూపశిల్పి కమ్యూనిస్టు నాయకులు రావి నారాయణరెడ్డి చిత్రపటానికి సిపిఐ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ, జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, రాష్ట్ర సమితి సభ్యులు కేశవులుగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.నర్సింహ్మ, పెబ్బేటి విజయుడు, ఆర్.ఇంద్ర, సిపిఐ జిల్లా ఎఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, కృష్ణాజి, బొల్లెద్దుల శ్రీనివాస్, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిజ్జ శ్రీనివాస్, తుమ్మల శివుడు, మర్యాద వెంకటయ్య, శంకర్‌గౌడ్, రవీందర్, దళితహక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మి పతి, పరుషరాం, కిరణ్, మల్లయ్య, గోపాల్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేష్, మధుగౌడ్, ఎస్‌టియు నాయకులు మద్దిలేటి పాల్గొన్నారు.

## గర్వించదగ్గ నాయకుడు : నెల్లికంటి

**నల్లగొండ :** భూమికోసం, భుక్తి కోసం, సాగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన రావి నారాయణ రెడ్డి ప్రజలు గర్వించదగ్గ నాయకుడు అని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట సేనాని రావినారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూం భవన్‌లో రావి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో నెహ్రూ కంటే అత్యధిక ఓట్లు సంపాదించి పార్లమెంటులోకి అడుగు వేసిన ఘనత రావి నారాయణరెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గం సభ్యులు పల్లా నర్సింహారెడ్డి , జిల్లా సహాయ కార్యదర్శిలు పల్లా దేవేందర్ రెడ్డి, లోడింగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు బోల్గురి నరసింహ, తిర్పారి వెంకటేశ్వర్లు, ఆర్.అంజచారి, నల్పరాజు రామలింగయ్య, తూము బుచ్చిరెడ్డి. పట్టణ కార్యదర్శి కెఎస్ రెడ్డి, లెనిన్, మదర్, యూసుఫ్ పాల్గొన్నారు.

**సూర్యాపేట టౌన్ :** ప్రజలు గర్వించదగ్గ నాయకుడు రావి నారాయణరెడ్డి అని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం రావి నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సిపిఐ ధర్మబిక్షం భవన్‌లో రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, యల్లంల యాదగిరి, బద్దం కృష్ణారెడ్డి, బూర వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, మండవ వెంకటేశ్వర్లు, ఎస్‌కె లతీఫ్, దేవరం మల్లీశ్వరి, ఎస్‌కె సాయిబల్లి, రెమిడాల రాజు, పిల్లుట్ల కనకయ్య, ఉప్పతల కోటమ్మ, జడ శ్రీనివాస్, చేపూరి కొండలు, యల్లావుల రమేష్, అనంతుల మల్లీశ్వరి, కాంపల్లి వెంకటయ్య, కత్తి శ్రీనివాస్ రెడ్డి, కడియాల అప్పయ్య, కందుల వెంకటేశ్వర్లు, యల్లబోయిన సింహాద్రి, ఏ.లక్ష్మి, భరత్, జానయ్య, భద్రారెడ్డి పాల్గొన్నారు.


నల్లగొండ...

**అబ్దులాపూర్‌మెట్ :** తెలంగాణ సాయుధపోరాట యోధుడు రావి నారాయణరెడ్డి జివిత చరింత్రను నేటి యువత తెలుసుకోవాలని సిపిఐ రాష్ట్ర నాయకులు అందోజు రవీంద్రచారి అన్నారు. పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని కూంట్లూర్‌లోని రావి నారాయణరెడ్డి కాలనీలో సిపిఐ అధ్యర్యంలో రావి నారాయణరెడ్డి వర్ధంతి నిర్యహించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ముత్యాల యాదిరెడ్డి, మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్, మండల సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహ్మా, అరుణ, నవనీత, దాసరి ప్రసాద్, గోపి, దేవమ్మ, అవుల యాదగిరి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**భువనగిరి రూరల్ :** భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో రావి నారాయణరెడ్డి వర్ధంతి సభ సిపిఐ భువనగిరి మండల కార్యదర్శి దాసరి లక్ష్మ య్య అధ్యక్షతన నిర్వహించారు. ఆర్ ఎన్ స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలె సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరు రాజయ్య, ఉప్పల ముత్యాలు, ఏశాల అశోక్ బోడ సుదర్శన్, ఎండి ఇమ్రాన్, చిగుళ్ల లింగం, చుక్క స్వామి, సలిగంజి వీరస్వామి, అన్నెపు వెంకట్, ఊట్కూరు నరసింహ, ఎల్లంకి మహేష్, కాశపాక దయాకర్, జక్క దయాకర్‌రెడ్డి, మారుపాక వెంకటేష్ పాల్గొన్నారు.


సూర్యాపేట...


భువనగిరి..


కరీంనగర్



నాగర్‌కర్నూల్..


అబ్దులాపూర్‌మెట్ ..



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## నిజాంసాగర్ ద్వారా 28,852 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి మొత్తం 28,852 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతుందని నీటిపారుదలశాఖ అధికారులు ఆదివారం సాయంత్రం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు 17.802 టీఎంసీలు కాగా ప్రస్థుతం 1404.92 అడుగులు, 17.687 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఎగువ ప్రాంతం నుండి 22,160 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లోగా వస్తుందన్నారు. కాగా ప్రధాన పంట కాలువ ద్వారా 1500ల క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు 4 వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది.





## 15న కామారెడ్డిలో బహిరంగసభ

### సభాస్థలిని మంత్రుల పరిశీలన

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించబోతున్న సందర్భంగా కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఈనెల 15వ తేదీనా కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ సభకు ముఖ్య అథితులుగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు హాజరవనున్నారు. ఈ సందర్బంగా ఆదివారం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, పొన్నం ప రభాకర్, కొండా సురేఖ, వాకేటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావులతో కలిసి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు సభాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం సభ ఏర్పాట్లపై కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు అధిక సంఖ్యలో జన సమీకరణ చేసి సభకు తరలించాలని, భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దు

**ప్రజాపక్షం/మందమర్రి :** ఆన్‌లైన్ లోన్ల పేరుతో మోసాలకు గురికావద్దని ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందమర్రిలో 3వ జోన్‌కు చెందిన ఓ యువకుడు ఇటీవల ఆన్‌లైన్ లోన్ పేరుతో మోసపోయినట్లు ఎస్ఐ వివరించారు. చదువు కోసం రూ. 50 వేల విద్యార్థి లోన్ కోసం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసిన యువకుడి ఆధార్, పాన్‌తో పాటు వ్యక్తిగత వివరాలు మోసగాళ్లు సేకరించారని తెలిపారు. లోన్ ఆమోదమైందని నమ్మించి, వివిధ ఛార్జీల పేరుతో విడతల వారిగా రూ. 37,500 వసూలు చేశారని చెప్పారు. మొత్తంగా డబ్బు రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన యువకుడు వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించినట్లు ఎస్ఐ వివరించారు. ఈ సందర్బంగా ఎస్ఐ మాట్లాడుతూ వ్యక్తిగత వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తు తెలియని వ్యక్తులకు ఇవ్వొద్దని హెచ్చరించారు. అనుమానాస్పద లింగులు, మెయిల్స్ క్లిక్ చేయరాదని సూచించారు. లోన్, ఉద్యోగం, బహుమతుల పేరుతో ముందస్తు చెల్లింపు అడిగితే అది మోసమని గుర్తు చేసుకోవానలి చెప్పారు. తలఅధికారిక వెబ్‌సైట్‌ల ద్వారానే ఆర్థిక లావాదేవీలు జరపాలని ప్రజలకు సూచించారు. మోసపోయిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

## ఇరు వర్గాల మధ్య ఘర్షణ

### ఏడుగురుపై కేసు

**ప్రజాపక్షం/సిర్పూర్ (టి) :** సిర్పూర్ (టి) మండలంలోని పెద్ద బండ గ్రామంలో శుక్రవారం రోజున వినాయక నిమజ్జన శోభయాత్ర జరుగుతున్న సమయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామంలోని వివాదం కారణంగా యువకులు ఒకరిపై ఒకరు దాడులు జరపగా, కొంత మంది గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. రెండు వర్గాల మధ్య పలుమార్లు జరిగిన మాటామాటలు చివరికి ఘర్షణకు దారితీశాయి. ఈ సంఘటనతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ సందర్బంగా సిర్పూర్ ఎస్ఐ కమలాకర్ మాట్లాడుతూ ఇరు వర్గాలకు చెందిన 7 మందిపై కేసులు నమోదు శామని తెలిపారు.

## వ్యాధుల నియంత్రణకు వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఎంఎల్‌హెచ్‌పి కీర్తన అన్నారు. ఆదివారం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని తిర్యాణి మండలం తోయగూడ, దేవాయిగూడ, గిన్నెదరి, చింతలమాదర, పంగిడిమాదర గ్రామాలలో ప్రజా సంక్షేమంలో భాగంగా అనుమానితులకు డెంగ్యూ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్బంగా ఎంఎల్‌హెచ్‌పి మాట్లాడుతూ ప్జా సంక్షేమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. అంటు వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త నిరోష, హెచ్ఎ(ఎం) భగవాన్ దాస్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జెసిబి సీజ్

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని బెజ్జొరా గ్రామశివారులో కప్పల వాగు నుండి అక్రమంగా ఇసుకను రవాణా చేయుటకు జెసిబితో ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేస్తూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారం తెలుసుకుని సిబ్బందితో కలిసి ఇసుకను నింపుతున్న జెసిబి, ట్రాక్టర్లతో పాటు వాటి యజమానులు మహేందర్, లక్ష్మ ణ రవికుమార్‌లను పట్టుకుని తరలించి ఇసుక రవాణాలో పాలుపంచుకున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. అక్రమంగా ఇసుక మొరం తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోబడుతాయన్నారు.

## ఆలయాల తలుపులు మూసివేత

**ప్రజాపక్షం/ఎడపల్లి:** చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాల ద్వారాలు మూసి వేయడంతో ఆదివారం ఉదయం 11:25గంటల నుంచి సోమవారం ఉదయం 7గంటల వరకు పూజలన్నీ బంద్ అవుతాయని ఆలయ ఈఓ వేణు తెలిపారు. అన్ని రకాల ఆర్జిత సేవలు రద్దు చేశారు.జాన్కంపేట్ శ్రీ లక్ష్మి నరసింహ ఆలయ ద్వారాలన్నీ బంధనం చేశారు.

# శ్రమ దోపిడీకి కాంట్రాక్టు కార్మికులు బలి

### ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీ




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** సింగరేణి వ్యాప్తంగా 33,000 లకు పైగా కాంట్రాక్ట్ కార్మికులు సంస్థలో పని చేస్తున్నారని, వారందరూ శ్రమదోపిడికి గురవుతున్నారని ఎఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీ అన్నారు. ఆదివారం ఆ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, బ్రాంచ్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్, పల్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఇందారం ఉపరితల గనిలో సమావేశంలో వారు పాల్గొన్నారు. ఎఐటియూసిలో భారీగా చేరాలనుకునే ఇందారం పరితల ఓబి కాంట్రాక్ట్ కార్మికులను కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో యాజమాన్యం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. కాంట్రాక్ట్‌కార్మికులు ఇప్పుడు అనుభవిస్తున్న అరకొర వసతులు ముఖ్యంగా బ్యాంకు ద్వారా జీతాలు చెల్లింపులు, కాంట్రాక్టు మారిన గతం లో పని చేసిన కార్మికులనే కొనసాగించాలని, ఉద్యోగ భద్రత, వైద్యం, సౌకర్యం వంటి వసతులు తాము గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు కల్పించినవే అన్నారు. తర్వాత వచ్చిన గుర్తింపు సంఘాలు కనీసం కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోలేదన్నారు. మళ్లీ గుర్తింపు సంఘంగా గెలిచిన వెంటనే సింగరేణి చరిత్రలో ఏనాడు లేని విధంగా పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల్లో వాటాగా రూ. 5000 ఇప్పించినట్లు తెలిపారు. గతంలో కాంట్రాక్టు కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఎక్స్‌గ్రేషియా ఉండేది కాదని, ఎఐటియూసిగా యాజమాన్యం, ప్రభుత్వాలతో మాట్లాడి రూ. 30 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించుటకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సైతం వైద్య సౌకర్యం అందేలా ఇఎస్ఐ సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. కోల్ ఇండియా కాంట్రాక్టు కార్మికులకు అమలవుతున్న హై పవర్ కమిటి వేతనాలు, చట్టబద్ధమైన లీవులు, జాతీయ పండుగల సెలవులను ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరినట్లు తెలిపారు. యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకువేతనాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మద్దిఎల్లా గౌడ్, ఆర్జీ 1బ్రాంచ్ కార్యదర్శి పోశం, శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఉపాధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి వీరేశం, ఫిట్ కార్యదర్శిలుశ్రీకాంత్, మారుపెల్లి సారయ్య, సోషల్ మీడియా ఇంచార్జ్ జాడి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ధనురలో నేరాల నియంత్రణకు కెమెరాలు



**ప్రజాపక్షం/టేక్మాల్:** టేక్మాల్ మండల ం ధనుర గ్రామంలో నేరాల నియంత్రణతో పాటు భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై రాజేష్ సూచనల మేరకు విక్టరీ వెంకటేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాజా యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన కూడలిలలో, చౌరస్తాలలో కెమెరాలను అమర్చారు. గ్రామంలో భద్రతా చర్యలకు తోడ్పడుతూ రాజా యూత్ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమని ఎస్సై రాజేష్, జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గౌతం రాజ్, గ్రామ పెద్దలు ప్రశంసలు కురిపించారు. స్థానిక ఎస్సై రాజేష్ ప్రత్యేకంగా రాజా యూత్ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజా యూత్ సభ్యులు దస్తగిరి, అంజన్న, అభిషేక్, శ్రీను, దుర్గాప్రసాద్, వెంకటేష్, మల్లేశం, సన్నీ, మహేష్, సుదర్శన్, కిషోర్, మధు, ప్రణీత్, కన్నా, ఆంజనేయులు పాల్గొన్నారు.

## బిల్లులు రాక 'మధ్యాహ్న' కార్మికులు అప్పులపాలు




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనమందించాలంటే ఒక్కో విద్యార్థికి రూ. 25 చెల్లించాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపునూరు చక్రపాణి అన్నారు. ఆదివారం మధ్యా హ్న భోజన పథకం కార్మికుల జిల్లా కమిటీ సమావేశం ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించగా అధ్యక్షురాలు స్రవంతి, సాయమ్మ అధ్యక్షత వహించగా చక్రపాణి మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెల బిల్లులు రాక అప్పుల పాలవుతున్నారని, అధికారులు, కార్మికులను ఇబ్బంది పెడుతూ ఒత్తిడి చేస్తూ అప్పుల పాలైన సరే నాణ్యమైన భోజనం పెట్టాలి రెండు కూరలు వండాలని, వారానికి మూడు కోడిగుడ్లు పెట్టాలని ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇది సరైంది కాదని ప్రభుత్వం చాలీచాలనీ స్లాబ్ రేటు ఇస్తూ నాణ్యమైన భోజనం ఎలా పెడుతారని ప్రశ్నించారు. ప్రతినెల బిల్లులు ఇవ్వకపోవటం మూలంగానే బిల్లులు ఎప్పుడు వస్తున్నాయోనన్న సంగతి తెలియని పరిస్థితి నెలకొందని ప్రతినెల ఇల్లులు ఇస్తేనే తప్ప నాణ్యమైన భోజనం అందించలేమన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా ప్రభుత్వం ఇప్పటినుంచి 10 లోగా ఇస్తామని చెప్పి దాన్ని అమలుపర్చాలని కోరారు. సాయమ్మ, గంగామణి, కవిత, గంగాధర్, నాగలక్ష్మి, లత, వివిధ మండలాల నుండి వచ్చిన అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కుకునూరు, నావాబ్ లిఫ్టులు ప్రారంభించాలి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** వేల్పూర్‌లోని నివాసంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కలిసిన కుకునూర్ గ్రామాభివృద్ధి కమిటీ, నవాబు లిఫ్ట్ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా లిఫ్ట్ ప్రారంభించి చెరువులు నింపడానికి ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. అక్కడి నుండే ఇరిగేషన్ శాఖ అధికారులు సీఈ మధుసూదన్, ఈఈ భానుప్రకాష్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. సీజన్ ప్రారంభించక ముందే మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు అన్ని సిద్ధంగా ఉన్నాయా లేనిది చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ తెప్పించి నవాబు లిఫ్ట్ ప్రారంభించాలన్నారు. కుకునూర్ లిఫ్ట్‌లో మోటార్లు ఇసుకలో కూరుకుపోయాయని లిఫ్ట్ సభ్యులు తెలుపగా వెంటనే సమస్య పరిష్కరించి లిఫ్ట్ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు 45 టిఎంసీలున్నప్పుడే చెరువులు నింపి ఉంటే ఇప్పుడు ఈ సమస్య వచ్చేది కాదని వందలాది టిఎంసీలు సముద్రం పాలు అయ్యాయని ఎమ్మెల్యే అన్నారు. ఎస్సారెస్పీలో పూర్తిస్థాయిలో నీళ్లు ఉన్నందున వెంటనే గుత్ప, చౌటపల్లి హన్మంత్‌రెడ్డి లిఫ్టులు ప్రారంభించి చెరువులు నింపాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇదిలా ఉండగా మెంటనెన్స్ లేక వెంగంటి లిఫ్ట్ సంబంధించిన కాఫర్ కాయిల్స్ ఇతర లిఫ్ట్ సామాగ్రి ఎత్తుకపోయారని వాటిని రీస్టోర్ చేసి పల్లికొండ లిఫ్ట్ కూడా ప్రారంభించాలని కోరారు.

## ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

### కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రభుత్వఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం జిల్లాలోని పాపన్నపేట మండలం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రజలకు అన్ని విధాలుగా సహకరించాలని సూచించారు. సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరఘాట్ నూతన కమిటీ ఏర్పాటు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** రెంజల్ మండలంలోని త్రివేణి సంగమం గోదావరి పుష్కర ఘాట్ నూతన కమిటీని గ్రామస్తులు ఎన్నుకున్నారు. ఈ మేరకు అధ్యక్షుడిగా గోమాషి సుధాకర్ ను, ఉపాధ్యక్షుడిగా మద్నూర్ గంగాధర్ ను, కోశాధికారిగా రాధారం నరేష్‌లను, సభ్యులుగా సతీష్, బనగతి శివానంద్ లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోదావరి పుష్కరఘాట్ నూతన కమిటీలో తమను ఎన్నుకోవడం పట్ల ధన్యవాదములు తెలిపారు. ఈ మేరకు చంద్రగ్రహణం అనంతరం నేడు ఉదయం 11గంటలకు నూతన కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ




**ప్రజాపక్షం/ఖానాపూర్ :** వినాయక నిమజ్జనాలను పురస్కరించుకుని ఖానాపూర్ పట్టణంలో తెలంగాణ చౌక్ వద్ద హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కాతిక కార్యక్రమాల్లో పాల్గొని నృత్యాలతో అలరించిన 200 మంది ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వాసవి క్లబ్ గవర్నర్ చేతుల మీదుగా నోట్ బుక్స్,పెన్నులు పంపిణీ చేశారు.జోన్ చైర్మన్ గోలి పద్మజ,క్లబ్ అధ్యక్షుడు చిటికేసి రవీందర్,ప్రధాన కార్యదర్శి చిటికేసి సతీష్,కోశాధికారి కూరగాయల సతీష్,జిల్లా మాజీ అధ్యక్షుడు గన్నారపు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 30మంది యువకులు రక్తదానం

**ప్రజాపక్షం/సిర్పూర్ (టి) :** సిర్పూర్ (టి) ప్రభుత్వ ఆసుపత్రిలో మిలాద్ ఉన్ నబీ సందర్బంగా సిర్పూర్ (టి) వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ కమలాకర్ హాజరై శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రశాంతంగా జరుపుకున్నామని రక్తదాన కార్యక్రమంలో మత బేధాలు లేకుండా హిందూ, ముస్లీం యువకులు కలిసి పాల్గొని రక్తదానం చేయడం ఎంతో సంతోషకరమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాగే అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలని అని అన్నారు. సొసైటి అధ్యక్షుడు అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడడానికై ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. రిజ్వాన్ ఉల్లా ఖాన్, షాహిద్ ఆమెర్ వైజ్, ఇల్యాజ్ యువకులు పాల్గొన్నారు.

## 'లయన్స్' ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం




**ప్రజాపక్షం/పిట్లం:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ డిస్ట్రిక్ 320 డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్లు పిట్లం లయన్స్‌క్లబ్ శాఖ సభ్యులు తెలిపారు. పిట్లం లయన్స్‌క్లబ్ ద్వారా ఎంపిక చేయబడిన వడిత్య రూప్‌సింగ్ స్కూల్ అసిస్టెంట్(గణితం)ను ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మి నారాయణ ఘనంగా సన్మానించారు. 2018 నుండి నేటి వరకు పిట్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రూప్ సింగ్ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునికి ఎంపికవడం హర్షనీయమని పిట్లం మండల విద్యాశాఖ అధికారి దేవిసింగ్ కొనియాడారు. అదేవిధంగా పిట్లం మండలంలోని ఉపాధ్యాయులు సైతం సన్మానం పొందిన రూప్‌సింగ్‌కు తమ అభినందనలు తెలిపారు.

## అనుమతులు లేని కాలనీ బోర్డులతో ఇక్కట్లు!




**ప్రజాపక్షం/చెన్నూరు :** కుల ప్రస్థానాలను సుస్థిరం చేసుకోవడం కోసం చెన్నూరు మున్సిపల్ పరిధిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన కాలనీల బోర్డుల కారణంగా ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. పట్టణంలోని ఆదర్శ నగర్‌లో జలాల్ పెట్రోల్ బంకు ఆవరణలో పట్టణానికి చెందిన ఓ కాంగ్రెస్ నేత ఎలాంటి అనుమతులు లేకుండా సుల్తాన్ నగర్ కాలనీ ఏర్పాటు చేయగా, అదే వార్డులో మరో వైపు రెడ్డి కాలనీ అనే బోర్డు ఏర్పాటు చేయడంతో నివాస ధ్రువీకరణ పత్రాల్లో వారి చిరునామాలు పొందుపరిచేందుకు స్థానికులు ఆయోమయం అవుతున్నారు. ఇదే తరహాలో పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో సైతం ఓ వీధికి చర్మాస్ కాలనీ అనే బోర్డు ఏర్పాటు చేసినప్పటికి మున్సిపల్ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన కాలనీ బోర్డులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## బాక్సింగ్‌లో జాతీయ స్థాయి పథకం సాధించిన విద్యార్థి

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్:** పెద్దపల్లి గాయత్రి డిగ్రీ & పీజీ కళాశాలకు చెందిన పీజీ సెకండియర్ చదువుతున్న అప్పన్నపేట గ్రామానికి చెందిన పిడుగు శ్రీకాంత్ పంజాబ్లో ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బటిన్న గురు కాశీ యూనివర్సిటీలో జరిగిన బాక్సింగ్ 8086కేజీల విభాగంలో శాతవాహన యూనివర్సిటీ తరపున ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయిలో పతకం సాధించాడు. ఈ ఘనత సాధించడానికి కళాశాల అన్ని రకాలుగా సహకరిస్తుందని తెలిపారు. క్రీడారంగంలో గాయత్రి కళాశాల విద్యార్థులు దక్కించుకుంటున్న ఈ గుర్తింపు విద్యా, క్రీడా రంగాలలో స్ఫూర్తి దాయకంగా నిలిచేలా చేస్తుందన్నారు. ఈ విజయాన్ని సాధించినందుకు డిగ్రీ కళాశాల అది నేత అల్లంకి శ్రీనివాస్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జే.రవీందర్ అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రతి ఉద్యోగి తల్లి పేరిట మొక్కను నాటి సంరక్షించాలి: కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ఒక్కో ఉద్యోగికి ఒక్కో మొక్క భవిష్యత్ భవిష్యత్ తరాలకు భద్రతకు మెఘా ఫ్లాంటేషన్ అని.. ఏక్ పెడ్ మాకే నామ్‌సే (తల్లిపేరును మొక్క) స్ఫూర్తితో ఈనెల 9న సిద్దిపేట జిల్లాలో వినూత్న కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో పాల్గొననున్న 13.900 ప్రభుత్వ ఉద్యోగులు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మున్సిపాల్టీలు, గ్రామపంచాయతీల సహకారంతో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 9న మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఒక్కో ఉద్యోగి ఒక్క మొక్కను నాటే కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదరకరమైన వాతావరణాన్ని అందించే ఉద్దేశ్యంతో మొక్కల పెంపకం చేపట్టినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లాలో ఉద్యోగులందరు విధిగా పాల్గొనాలన్నారు. అలాగే తల్లి పేరున నాటిన ప్రతిమొక్కను సంరక్షించే బాధ్యతను కూడ ఉద్యోగులు తీసుకోవాలని సూచించారు. ఆయాగ్రామపంచాయతీల్లో , మున్సిపాల్టీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు.ముందుగా గుర్తించిన ప్రదేశాల్లో గుంతలు తవ్వించి, చెట్లు నాటే కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని మండలాలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అయా కార్యాలయాల అధికారులు బాధ్యతను తీసుకోవాలన్నారు.

## ఓటర్ల జాబితా అక్రమాలపై ఆందోళన



**ప్రజాపక్షం/అక్కన్నపేట:** ఓటర్ల జాబితా రూపకల్పనలో సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో నూతన పంచాయతీగా ఏర్పాటైన సేవాలాల్ మహరాజ్ తండాలో జరుగుతున్న అక్రమాలు,అవకతవకలపై చర్యలు తీసుకోవాలని గిరిజన నాయకులు మాలోతు భీలూ నాయక్,ధరావత్ తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు.ఆదివారం సేవాలాల్ మహరాజ్ తండాలో గిరిజన నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బంజార న్యాయ పోరాట సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు.గౌరవెల్లి రిజర్వాయర్ ముంపు ప్రాంత నిర్వాసితులు ఈ బంగారులొద్ది ప్రాంతంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని ఇక్కడి గిరిజనులపై ఆదిపత్యం చలాయించాలనే ధోరణితో నూతన పంచాయతీగా ఏర్పాటైన సేవాలాల్ మహరాజ్ తండాలో స్థానికత లేని 200 మందిని ఓటర్ల జాబితాలో అక్రమంగా చేర్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.చరిత్రలో మూలాలు కల్గిన బంజార ఆరాధ్యదైవంగా భావించే 'సేవాలాల్ మహరాజ్ ' పేరుతో ఏర్పాటైన నూతన పంచాయతీలో 'సేవాలాల్ మహరాజ్' పేరుని సైతం తొలగించాలని అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.స్థానిక మంత్రి పొన్నం ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ ప్రాంతంలో అగ్రవర్ణాలు ఇలాంటి ఘాతుకాలకు పాల్పడటం సహేతుకమని గిరిజన నాయకులు భూక్య క్రిష్ణ,గుగులోతు రాజు,తిరుపతి మండిపడ్డారు. స్థానికేతరులైన అనర్హులను సేవాలాల్ మహరాజ్ తండా ఓటర్ల జాబితాలో చేర్చడం విడ్డూరంగా వుందని విమర్శించారు.ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే అక్రమ ఓటర్లను తొలగించాలని సేవాలాల్ మహరాజ్ తండా వాసులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో గోర్‌సేన రాష్ట్ర నాయకులు భానోతు భాస్కర్ నాయక్,గ్రామ శాఖ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భూక్య తిరుపతి,భూక్య రాజు,ముడావత్ హరిలాల్,భూక్య కిషన్,ముడావత్ రమేష్,భూక్య రమేష్,భూక్య సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గాం మిల్లుల భూముల్లో మట్టి తవ్వకాలు

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో మూతపడిన వీవింగు, స్పిన్నింగు మిల్లుల భూముల్లో కొందరు వ్యక్తులు అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. బర్మా, శ్రీలంక కాందిశీకుల ఉపాధి కోసం 6 దశాబ్దాల క్రితం అప్పటి కేంద్ర ప్రభుత్వం మిల్లులు ఏర్పాటు చేసి వారు నివాసముండేందుకు పునరావాస కాలనీ నిర్మించారు. అయితే మిల్లులు మూతపడటంతో పునరావాసకాలనీలోని భూములను యధేచ్ఛగా అక్రమిస్తున్నారు. దీనికితోడు ఇటీవల కొందరు వ్యక్తులు మిల్లులకు చెందిన సర్వే నంబరు 255/1లోని భూముల్లో 2 జెసిబి వాహనాలు ఏర్పాటు చేసి అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతూ నిత్యం 30 ట్రాక్టర్లలో రవాణా చేపడ్తున్నారు. గతంలో ఏన్నడూ కూడ కాందిశీకుల పునరావాసకాలనీ భూముల్లో ఏవరూ అక్రమంగా మట్టి తవ్వకాలు జరపలేదు. పైగా మిల్లులో పనిచేసిన కాందిశీక కార్మికులు, స్థానిక కార్మికులకు ఇంకా వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇందు కోసం జిల్లా అదనపు కలెక్టర్‌ను లిక్విడేటర్‌గా నియమిస్తూ మిల్లుల స్థిర, చరాస్తుల సంరక్షణను రాష్ట్ర ప్రభుత్వం చేపడ్తున్నది. ఆస్తులను ఏవరూ కూడ అక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు లిక్విడేటర్‌కు అధికారాలు ఉన్నాయి. అదేవిధంగా చేనేత, జౌళిశాఖ కరీంనగర్ జిల్లా సహాయ సంచాలకుడు కూడ మిల్లుల స్థిర, చరాస్తుల సంరక్షణ బాధ్యతలను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో మిల్లులకు సంబంధించిన పునరావాసకాలనీ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు, రవాణా జరుపుతున్నారని వీరిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్, చేనేత, జౌళిశాఖ కరీంనగర్ జిల్లా సహాయ సంచాలకుడు, అంతర్గాం తహసీల్దారులను అంతర్గాం బర్మా, శ్రీలంక కాందిశీకుల సంక్షేమ సంఘం, అఖిల భారత అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు ఇండిబెల్లి రవీందర్‌కుమార్ కోరుతున్నారు. వెంటనే అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

## కడుపునొప్పి భరించలేక ఫైర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కడుపునొప్పి భరించలేక ఫైర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ గ్రామంలో చోటు చేసుకుంది. కరీంనగర్ రూరల్ సిఐ ఎ.నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుజ్జేటి మనోహర్ ఫైర్ కానిస్టేబుల్‌గా చొప్పదండి స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నారు. వైద్యం అందించినా నొప్పి తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది సెప్టెంబర్ 1న పురుగుల మందు తాగాడు. బంధువులు గమనించి ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. భార్య గుజ్జేటి సుష్మిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నిరంజన్ రెడ్డి చెప్పారు.

# 60 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారాలు

**ప్రజాపక్షం/జగిత్యాల:** జగిత్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పట్టభద్రుల ఎంఎల్‌సి చిన్న మైల్ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ చేతులమీదుగా పురస్కారాలు ప్రధానం చేశారు. జగిత్యాల జిల్లాలోని 4074 మంది ఉపాధ్యాయులకు గాను 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక కాగా, జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆడిటోరియంలో ఆదివారం పురస్కారాలు ప్రధాన ంచేశారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా జిల్లాలోని 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్, పట్టభద్రుల ఎంఎల్‌సి చిన్నమైల్ అంజిరెడ్డి చేతులమీదుగా ఘనంగా సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్నిజిల్లా సమీకృత కార్యాలయంలో ఆడిటోరియంలో కలెక్టర్ సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పట్టభద్రుల ఎంఎల్‌సి చిన్నమైల్ అంజిరెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి డా.సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులందరికి శుభాకాంక్షలు తెలిపారు. రోజు రోజుకు మారుతున్న కాలానికనుగుణంగా ఉపాధ్యాయులు కూడా సంస్కృతిక నైపుణ్యతతో విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. తల్లిదండ్రులుజన్మనిస్తే ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేస్తారని వివరించారు రాష్ట్రంలో జిల్లా విద్యారంగంలో ఉన్నత స్థానంలో జిల్లాను నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని క్రమశిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులను ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. అనంతరం ఎంఎల్‌సి అంజిరెడ్డి మాట్లాడుతూ 1962లో ఉపాధ్యాయ దినోత్సవ ప్రారంభించాలని భారతదేశ ఉపరాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం స్వీహించుకుంటామని, రాష్ట్రంలోని అత్యుత్తమ ఉపాధ్యాయులను ఎన్నుకుని పురస్కరాలు అందించడం జరుగుతుందన్నారు. తండ్రి ఆస్తులు అందిస్తే గురువు జ్ఞానాన్ని అందిస్తారని తెలిపారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ డా.సర్వేపల్లి అంకిత భావం, విలువలు నైపుణ్యత ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులందరికి శుభాకాంక్షలు తెలిపారు . ఉపాధ్యాయులు తాము బోధిస్తున్న పాఠశాలలో విద్యార్థులు సంఖ్య పెంచేలా కృషి చేయాలని, విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బిఎస్ లత, జిల్లా విద్యాధికారి కే.రాము, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మండల విద్య అధికారులు, ప్రధానోపాధ్యాయులు, మరియు జిల్లా సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ అధికారులు వివిధ సంఘాల ఉపాధ్యాయ నాయకులు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## నిధులు మంజూరు చేయాలని మంత్రి అడ్లూరికి వినతి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని ఇస్రాజ్ పల్లి గ్రామంలో మాల సంఘం భవనం నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని ఆదివారం, సంఘ సభ్యులు ధర్మపురి లోని క్యాంపు కార్యాలయంలో ఎస్సీ ,ఎస్టి ,మైనార్టీ ,వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా సంఘ సభ్యులు అడగగానే వెంటనే స్పందించి సంఘ భవన నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేస్తానని చెప్పడంతో మంత్రి లక్ష్మణ్ కుమార్ కు గ్రామ సంఘం సభ్యులు పెద్దలు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో మాల సంఘం పెద్దలు సభ్యులు డాక్టర్ మన్నే లక్ష్మణ్ ,నల్ల మోహన్ ,బన్న ప్రభాకర్,మద్దెల రాజు ,నూకల గణేష్ ,నల్ల శేఖర్ ,తాజా మాజీ సర్పంచ్ చిర్ర గంగాధర్ ,మాజీ ఉపసర్పంచ్ కొండ వెంకటేష్ గౌడ్ ,నాయకులు బైరం రవీందర్ ,సాన రవీందర్ ,ఆరె మధు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా స్థాయి చేతిరాత పోటీలు



పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగరసిటీ:** జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో డిఈవో పర్యవేక్షణలో నగరంలోని పారమిత విద్యాసంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాల, కళాశాలల విద్యార్థులకు , ప్రభుత్వ అధికారులకు, ఉపాధ్యాయులకు స్థానిక పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో కరీంనగర్ జిల్లా స్థా యి చేతివ్రాత పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో దాదాపు 500 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరయ్యారు. చేతివ్రాతకు దాని పూర్వవైభవాన్ని తిరిగి తీసుకురావడానికి కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు(6 నుంచి 10వ తరగతులు), ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల కోసం చేతివ్రాత పోటీలను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు మూడు విభాగాలలో గెలుపొందిన విజేతలకు విభాగాల వారీగా నగదు బహుమతులు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయి అవార్డుల ప్రధానోత్సవం ఈ నెల 15న కలెక్టరేట్ ఆడిటోరియంలో జరగనుంది. ఈ పోటీల్లో స్వయంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, డిఇవో చైతన్య జైనీ, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాద రావు, కార్యక్రమ ఇంచార్జి ప్రిన్సిపాల్ గోపీకృష్ణ, ఎగ్జాం కోఆర్డినేటర్ అభినవ్ దిడ్డి, చేతివ్రాత నిపుణులు దిడ్డి సతీష్, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, కో ఆర్డినేటర్స్, ఉపాధ్యాయులు చేతివ్రాత పోటీల్లో పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/చొప్పదండి:** మండలంలోని భూపాలపట్నం మాజీ సర్పంచ్ తోడేటి డేవిడ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వారి క్షేమ సమచారం తెలుసుకున్నారు. ఇటీవల వెదురుగట్ట గ్రామంలో పాము కాటుతో మృతి చెందిన చిన్నారి దీప్తిక కుటుంబ సభ్యలను, పట్టణానికి చెందిన మైనార్టీ నాయకుడు మహమ్మద్ చాంద్‌పాషా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చాకుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గంకిడి మాధవరెడ్డి గుండెపోటుతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. వారి వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, మునిగాల చందు గౌడ్, ముద్దం తిరుపతి, కడారి శంకర్, గుర్రం రమేష్ తదితరులున్నారు.

## రైతుల ఆర్తనాదాలు.. పట్టించుకోని లీడర్లు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** వానాకాలం పంట సాగు చేసినప్పటి నుండి పంట చేతికొచ్చే వరకు యూరియా కొరత రైతులను వెంటాడుతుండడంతో ప్రభుత్వంపై అన్నదాతల శాపనార్థాలు ఒకపక్క, మరొ పక్క అందలేదనే బాధతో వెనుదిరిగిపోతున్న రైతుల ఆర్తనాదాలు ఎక్కువయ్యాయి. ఆదివారం మండలంలోని సిరిపూర్ సొసైటీకి యూరియా లోడ్ రావడంతో ఉదయం నుండి రైతులు పెద్ద ఎత్తున కార్యాలయం చేరుకుని యూరియా కోసం చెప్పులు బీరు సీసాలు, చెట్ల కొమ్మలు, వాటర్ బాటిల్స్, ఖాళీ సంచులు, క్యూలైన్‌లో పెట్టి యూరియా కోసం పడిగాపులు కాశారు. రైతులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం బాగుపడలేదని ప్రతి రోజు యూరియా కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని, రైతులు ఆందోళన చెందుతుంటే నాయకులు అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన రవీందర్ అనే రైతు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆనాటి రోజులు చూపిస్తున్నారని, రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తుంటే పెద్ద పెద్ద లీడర్లు పట్టించుకోకుండా స్టార్ హోటళ్లలో మీటింగులు పెట్టుకుని ఎంజాయ్ చేస్తున్నారని, రైతులను పట్టించుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని అన్నారు. రైతులు ఒక్కసారిగా యూరియా కోసం కార్యాలయానికి వచ్చి చెప్పులు బీర్ సీసాలు క్యూలైన్‌లో పెట్టడం మండల వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది.



## ఉద్యోగాలు ఇప్పించడంలో ఎఐటియుసి కృషి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రమాదంలో చనిపోయినా సింగరేణి కార్మికుల కుటుంబాల నుండి ఒక్కొక్కరికి ఉద్యోగం ఇప్పించడంలో ఏఐటియుసి నాయకుల కృషి ఫలితమేనని కుటుంబ సభ్యులు ఏఐటియుసి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం రోజున సెంటినరీ కాలనీ లోని మహీంద్రా భవన్ లో ప్యాటల్ ఆక్సిడెంట్ లో చనిపోయిన కుటుంబ సభ్యులను ఏటీసీ నాయకుల ఆధ్వర్యంలో అగ్రిమెంట్ గురించి కుటుంబ సభ్యులకు వివరించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవి రావు, సెంట్రల్ సెక్రటరీ జూపాక రామచందర్ , బ్రాంచ్ సెక్రటరీ ఎమ్ఆర్‌సి రెడ్డి , అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ డిటి రావు హాజరై అనంతరం వైవి రావు మాట్లాడుతూ గత 2 సంవత్సరాలుగా డైరెక్టర్ తో మాట్లాడుతున్న వారు మారుతూ ఉండడంతో సాధ్యపడలేదని ,నిన్న జరిగిన అగ్రిమెంట్లో ఏఐటీయూసీ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య , మరియు జనరల్ సెక్రెటరీ కోరిమి రాజ్ కుమార్ అన్ని ఏరియాలోని డిప్యూటీ జనరల్ సెక్రటరీలు పాల్గొని సింగరేణి లోనే మొట్ట మొదటిసారిగా ఎన్‌సిడబ్లుఎ ఎంప్లాయిస్ కి ఒక గొప్ప అవకాశం కల్పించడం చాలా గర్వంగా ఉందని, దానికి నిలువెత్తు సాక్ష్యంగా ఆర్‌డిఎమ్ రీజియన్ లోని ఎన్‌సిడబ్లుఎ కుటుంబ సభ్యులు. అయినటువంటి ఆర్‌జి2 లో 7ఎల్‌పి ఇసుక బంకర్లో కురుకొని చనిపోయిన సత్యనారాయణ కుటుంబంలో వారి సతీమణికి, 2 సంవత్సరాల క్రితం ఎఎల్‌పి లో డ్రిల్ మిషన్ హోస్ వర్స్ట్ అయి చనిపోయిన బూర్ల సారయ్య కుమారునికి గ్రేడ్ 3 ఉద్యోగాలు కల్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒసిపి1 మరియు ఒసిపి2 మరియు ఎఎల్‌పి. అన్ని గనుల పిట్ సెక్రటరీలు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్, సేఫ్టీ మరియు మైన్స్ కమిటీ మెంబర్స్, పిట్ కమిటీ మెంబర్స్, మరియు యూనియన్ డెలిగేట్స్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అందరికృషితో గణపతి నవరాత్రులు, నిమజ్జనం విజయవతం

'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** గణపతి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు బ్రహ్మాండంగా జరిగాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ పమేలా సత్పతి, పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండే విధంగా పరిపాలన ఉంటుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జరిగే మిలాద్ ఉన్ నబీ వేడుకలు సైతం విజయవంతం చేయాలని అధికారులను నరేందర్ రెడ్డి కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సమద్ నవాబ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దన్నసింగ్, దండి రవీందర్, బొబ్బిలి విక్టర్, అస్థాపురం రమేష్, కుర్ర పోచయ్య, మాసుంఖాన్, మహమ్మద్ భారీ, కిరణ్ రెడ్డి తదితరులున్నారు.

## అక్టోబర్ 3న 'దసరా' సెలవు ప్రకటించండి

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్


**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిలో అక్టోబర్ 3న దసరా పండుగ సెలవు ప్రకటించాలని కోరుతూ సింగరేణి సి అండ్ ఎండి కి ఆగస్ట్ 9న లేఖ రాయడం జరిగిందని గుర్తింపు సంఘం ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు.అక్టోబర్ 2న గాంధీ జయంతి, దసరా పండుగలు ఒకే రోజు రావడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతారని, ఎందుకంటే దసరా మరియు గాంధీ జయంతి విరుద్ధమైన పండుగలు అని ఆయన అన్నారు. అదేవిధంగా గాంధీ జయంతి రోజున అహింస దినం పాటించాలని, కానీ దసరా పండుగ అలా కాదని దీనికి విరుద్ధంగా ఉంటుందని ఆయన తెలిపారు. దీని పై సి అండ్ ఎండి మరియు డైరెక్టర్ ఫా గార్లతో చర్చించగా రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 3న దసరా పండుగ సెలవు ప్రకటిస్తే సింగరేణిలో కూడా అమలు చేస్తామని చెప్పారని, కానీ ఏఐటియుసి యూనియన్ ప్రభుత్వ ప్రకటనతో సంబంధం లేకుండా ఖచ్చితంగా అక్టోబర్ 3న దసరా పండుగ సెలవు ప్రకటించాలని డిమాండ్ చేయడం జరుగుతుందని, అదేవిధంగా కార్మికులు పండుగ సెలవు కోల్పోయి ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.
కనుక తెలంగాణ లో ఉన్న సింగరేణి లో దసరా పండుగ కార్మికుల కు అతిముఖ్యమైన పండుగ అని చాలా సంతోషంగా జరుపుకుంటారని, దీనిని దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం దసరా పండుగ సెలవు ను అక్టోబర్ 3 న ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా కొన్ని కార్మిక సంఘాలు దసరా పండుగ సెలవు విషయం లో వివిధ రకాల ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకునే విధంగా వ్యవహరిస్తున్నారని, కానీ గుర్తింపు సంఘం ఏఐటియుసి గత నెలలోనే యాజమాన్యం కు అక్టోబర్ 3 న దసరా పండుగ సెలవు ఇవ్వాలని లేఖ రాయడం జరిగిందని, కనుక కార్మికులు యూనియన్ కృషిని గమనించాలని ఆయన పేర్కొన్నారు.

## ఛత్రపతి శంభాజీ మహారాజ్ యూత్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి పట్టణంలోని లక్ష్మీ నగర్ ఛత్రపతి శంభాజీ మహారాజ్ యూత్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా కొనసాగించేందుకు సహకరించిన కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా పోరండ్ల పరమేశ్వర్, అధ్యక్షులుగా నేదునూరి ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా మహేష్ ప్రసాద్ రావు, ఉపాధ్యక్షులుగా మంద మహేష్, పోరండ్ల బాలాజీ, దోమకొండ శ్రీకాంత్, మంద అభినయ్, కొమిరిశెట్టి ప్రేమ్ కుమార్, చంద్రగిరి మురళి,కొమరవెల్లి కార్తీక్, కోశాధికారిగావివేకానంద్ ప్రచార కార్యదర్శులుగా ఆసంపల్లి రఘు మోహన్, సలహదారులుగా సంపత్, చొక్కయ్య కమిటీ మెంబర్స్‌గా రాజయ్య, రాంబాబు, సురేష్,ఓంకార్, రాజేష్, ఐరెడ్డి వెంకట రెడ్డి, రాజు, సత్యనారాయణ, వెంకన్న, రాజయ్య, శ్రీనివాస్, భూమయ్య, మల్లేష్, కేతిరెడ్డి ప్రవీణ్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులకు కాలనీవాసుల తో పాటు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రాథమిక పాఠశాలలో విద్యా వాలంటీర్లను నియమించాలి

**ప్రజాపక్షం/జగిత్యాల:** ఇటీవల స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులతో ప్రాథమిక పాఠశాలలో చాలా ఎస్జీటి పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని తాత్కాలికంగా వెంటనే స్థానిక అర్హత గల ఆరోగ్యవంతులను విద్యావాలంటీర్‌గా నియమించి భర్తీ చేసే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు మచ్చ శంకర్, బైర హరికిరణ్ మాట్లాడుతూ ఉన్నత విద్యారంగానికి ప్రాథమిక పాఠశాలలు మూలం కాబట్టి ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి పరిగణలోకి తీసుకోకుండా 50 మంది విద్యార్థులు దాటిన ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక హెడ్మాస్టర్ల ఐదుగురు సబ్జెక్టు టీచర్లను నియమించాలని లేని పక్షంలో అన్ని ప్రాథమిక పాఠశాలల్లో అన్ని సబ్జెక్టు టీచర్లు ఉండే విధంగా స్థానిక విద్యా వాలంటీర్లతో నైనా భర్తీ చేయాలని కోరారు. ఇటీవల జరిగిన పదోన్నతులలో జాయిన్ కాకుండా మిగిలిపోయిన లెఫ్ట్ ఓవర్ పోస్టులను తర్వాతి అర్హత గల వారికి వెంటనే పదోన్నతి ప్రక్రియ చేపట్టి భర్తీ చేయాలన్నారు. రానున్న 4, 5 సంవత్సరాలలో ఉపాధ్యాయులను వారి వారి స్వంత జిల్లాలకు పంపేలా శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. వారితో రాష్ట్ర కార్యదర్శి పాలేపు శివరామకృష్ణ ఉన్నారు.



# రీల్

## 11 రోజులు జరిగే కథతో ప్రొద్దుటూరు దసరా




బాల్కనీ ఒరిజినల్స్, బుశెట్టి జువెల్లర్స్ సమర్పణలో ప్రేమ్ కుమార్ వల పల నిర్మాతగా తీసిన డాక్యుమెంటరీ 'ప్రొద్దుటూరు దసరా'. మురళీ కృష్ణ తుమ్మ ఈ డాక్యుమెంటరీని తెరకెక్కించారు. ఈ డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ ప్రత్యేక ప్రదర్శనకు కరుణ కుమార్, విప్లవ్, మహేష్ విట్టా, ఉదయ్ గుర్రాల ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు కరుణ కుమార్ మాట్లాడుతూ ఓ ఘటన లేదా, వ్యక్తికి సంబంధించిన విషయాల్ని, నిజాల్ని చూపించే డాక్యుమెంటరీస్ ఉంటాయి. ఓ సరైన డాక్యుమెంటరీకి సినిమా కంటే పెద్ద రీచ్ ఉంటుంది. డాక్యుమెంటరీ అంటే ఎంగేజింగ్గా ఉండదని అంతా అనుకుంటారు. కానీ ఈ 'ప్రొద్దుటూరు దసరా' ఎంతో ఎంగేజింగ్గా, అద్భుతంగా అనిపించింది. డాక్యుమెంటరీ అంటే ఇలానే తీయాలి అనే నియమాల్ని బద్దలు కొట్టారు. యశ్వంత్ నాగ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఆర్ఆర్, పాట చాలా బాగుంది అని అన్నారు. మహేష్ విట్టా మాట్లాడుతూ మా ఊర్లో జరిగే దసరా గురించి అందరికీ చెబుతుంటాను. పది రోజుల పాటు పండుగ అదిరిపోతుంది. ఈ డాక్యుమెంటరీలో చూపించిన దాని కంటే ఇంకా బాగుంటుంది. పది టెంపుల్స్లో దసరా గొప్పగా జరుగుతుంది. 11 వ రోజు మాత్రం వాహనాలు కూడా వచ్చే స్థలం ఉండదు. శివ కాశీ నుంచి తెచ్చిన క్రాకర్స్ని గంట సేపు కాల్చుతారు. ప్రొద్దుటూర్లో దసరా అద్భుతంగా జరుగుతుంది' అని అన్నారు.

ఈ కార్యక్రమంలో దర్శకుడు ఉదయ్ గుర్రాల, నిర్మాత ప్రేమ్ కుమార్, నటుడు విప్లవ్ , జయ సింహా , దర్శకుడు మురళీ కృష్ణ, నటుడు దావూద్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబవుతున్న ఓజీ




పవన్ కళ్యాణ్ హీరోగా, ప్రియాంకా హీరోయిన్ గా సుజిత్ తెరకెక్కుతున్న ఈజీ సినీమా ఈ సినిమాకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి నెలాడరంలో వోడుదల చేయడానిఊసన్నాహాలు చేస్తున్నామంటూ చెప్పారు సీనిమాకు సంబందించిన అన్ని పనులు పూర్తి చేసి త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు గ్యాంగ్ స్టార్ కథతో ఈ సినిమాను తెరకెక్కించారు. డివివి దానయ్య ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన పాటలకు మంచి స్పందన లభిస్తోంది. ఈ సినిమా అభిమానులకు ఓ పండుగ లాంటి సినిమా అవుతుందపి నిర్మాత దానయ్య చెప్పారు.

## మిరాయ్ ఓ అడ్వెంచర్ కథ డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని



సూపర్ హీరో తేజ సజ్జా విజువల్ వండర్ 'మిరాయ్'. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 12న ఈ సినిమా విడుదల కానుంది ఈ సందర్భంగా డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఏడేళ్ల క్రితమే ఈ ఐడియా పుట్టింది. ఈ ఆలోచనకి ఇతిహాసాలని ఎలా ముడి పెట్టొచ్చనే ప్రాసెస్ కి చాలా టైం పట్టింది.చిన్నప్పటి నుంచి పురాణ ఇతిహాసాలను గురించి విన్న కథలు, పాషనేటింగ్ ఎలిమెంట్స్ తో మిరాయ్ ని డెవలప్ చేయడం జరిగింది. ఇది మన రూటేడ్ కథలా వుంటుంది. ఆడియన్స్ అందరూ తప్పకుండా కనెక్ట్ అవుతారని నమ్ముతున్నాను. అశోకుని వద్ద తొమ్మిది గ్రంథాలు ఉన్నాయనే ఒక మిత్ వుంది. ఆ తొమ్మిది పుస్తకాలు దుష్టుల బారిన పడితే, వాటిని మన ఇతిహాసాలు ఆధారంగా ఎలా కాపాడవచ్చనేది మిరాయ్ ఐడియా. ఏదైనా సమస్య వచ్చినప్పుడు దానికి పరిష్కారం ఇతిహాసాల్లో పురాణాల్లో వుందనే నమ్మకంతో చేసిన కథ. ఈ కథని యాక్షన్ అడ్వంచర్ గా ట్రీట్ చేశాం. ఇది కంప్లీట్ గా ఫిక్షనల్. ఈ కథ దాదాపు ప్రజెంట్ లోనే జరుగుతుంది. ఈ సినిమా మొదలుపెట్టినప్పుడు యాంబిషన్ పెద్దదని తెలుసు. ఈ సినిమా చేసిన ప్రాసస్ డిఫరెంట్. నటీనటులందరినీ రియల్ లోకేషన్స్ లోకి తీసుకెళ్ళాం. మంచు పర్వతాల్లో , ఎడారుల్లో, అడవుల్లో .. అన్నిట్లో రియల్ గా చేశాం. మొత్తం షూటింగ్ లో ఒక్క సీనియర్ యాక్టర్ కి కూడా కార్వాన్ లేదు. వారి సపోర్ట్ వలన ఈ సినిమాకి అంత అద్భుతంగా కుది రింది. శ్రీలంక, నేపాల్, రాజస్తాన్, బుర్జ్, థాయిలాండ్.. మొత్తం ఏసియా అంతా తిరిగేశాం. తేజ ఈ సినిమా కోసం థాయిలాండ్ లో ప్రత్యేకం శిక్షణ తీసుకున్నారు. చాలా హార్డ్ వర్క్ చేశారు. మంచు మనోజ్ ని తీసుకోవడానికి కారణం ఏమిటంటే పాజిటివ్ సైడ్ ఉంటూ నేచురల్ అగ్రెషన్ ఉన్న ఒక యాక్టర్ కావాలి. మనోజ్ కరెక్ట్ గా ఈ క్యారెక్టర్ కి ఫిట్ అవుతారు. మనోజ్ కి మార్శల్ ఆరట్స్ లో కూడా అనుభవం వుంది. అది మాకు హెల్ప్ అయ్యింది. శ్రీయా పర్ఫెక్ట్ గా ఫిట్ అవుతారనిపించి చేశాం. తల్లి కొడుకుల ఎమోషన్ ఈ సినిమాకి చాలా కీలకం. శ్రియా అద్భుతంగా చేశారు. బడ్జెట్ మేము అనుకున్న దానికంటే కొంచెం క్రాస్ అయ్యింది. నిర్మాత విశ్వ ప్రసాద్ మా విజన్ పూర్తిగా సపోర్ట్ ఇచ్చారు. ఆయన పాషన్ తోనే సినిమా ఇంత గ్రాండ్ గా వచ్చింది. ఫస్ట్ కాపీ చూసి ఆయన చాలా హ్యాపీగా ఫీలయ్యారు. జటాయు బ్రదర్ సంపాతి పాత్రని స్ఫూర్తిగా తీసుకొని ఒక సీక్వెన్స్ చేశాం, అది చాలా సర్ ప్రైజ్ గా వుంటుంది. దీనికోసం యానిమేట్రానిక్ టెక్నాలజీ ఉపయోగించాం. మేము అనుకున్న దానికంటే బెటర్ గా వచ్చిందని ఫీలింగ్ కలిగింది. ఇందులో ఒక ట్రైన్ సీక్వెన్స్ ఉంటుంది. అది పేపర్ మీద చూసుకున్నప్పుడు నిజంగా ఎలా అవుతుందా అనిపించింది. శ్రీలంకలో షూట్ చేసాము. చాలా అద్భుతంగా వచ్చింది, ఆడియన్స్ అందరూ స్టన్ అవుతారు. ప్రతి సీక్వెన్స్ కూడా మేము అనుకున్న దాని కంటే చాలా బెటర్ గా వచ్చింది. మ్యూజిక్ కథని ఎలివేట్ చేసింది. మంచి హై క్రియేట్ చేసేలా మ్యూజిక్ చేశారు. జయరాం అగస్త్య ముని పాత్రలో కనిపిస్తారు. జగపతి బాబు తాంత్రిక గురువు పాత్రలో కనిపిస్తారు. ఈ రెండు పాత్రలు కీలకంగా వుంటాయి. సీక్వెల్ చేసే పొటెన్షియల్ మిరాయ్ కథకి వుంది. ఈ సినిమాకి వచ్చే రిజల్ట్ ని బట్టి అలోచించాలి.

## పోస్ట్ ప్రొడక్షన్‌లో ది గర్ల్ ఫ్రెండ్



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు.'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా నుంచి రిలీజ్ అయిన పాటలకు మంచి స్పందన లభిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజిగా ఉన్న ఈ సినిమాను త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## స్లిమ్ 'లుక్'లో మంచు మనోజ్




రాకింగ్ స్టార్ మంచు మనోజ్ బరువు తగ్గి స్లిమ్ గా మారారు. సన్నబడి స్టైలిష్ లుక్ లో ఆకట్టుకుంటున్నారు. ఆయన తన కొత్త సినిమా 'మిరాయ్' ప్రమోషన్స్ లో ఈ స్లిమ్ లుక్ లో కనిపిస్తున్న స్టిల్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. 'మిరాయ్' సినిమాలో మంచు మనోజ్ బ్లాక్ స్వార్డ్ క్యారెక్టర్ లో నటిస్తున్నారు. ఈ క్యారెక్టర్ యానిమేటెడ్ ఇమేజ్, డీటెయిల్స్ ఉన్న టీషర్టులు ధరించిన మంచు మనోజ్ నెటిజన్స్ దృష్టిని ఆకర్షిస్తున్నారు. 'మిరాయ్' సినిమా తన కెరీర్ కు మరో మంచి టర్న్ అవుతుందని మనోజ్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. ఈ మూవీ ఈ నెల 12న పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

## సైమా అవార్డు బాధ్యత పెంచింది ఉత్తమ నటుడు అల్లు అర్జున్

'సైమా' 2025 అవారడ్స్ విజేతలు(తెలుగు): ఉత్తమ చిత్రం 'కల్కి', ఉత్తమ నటుడు అల్లు అర్జున్, ఉత్తమ నటుడు (క్రిటిక్స్) తేజ సజ్జా, ఉత్తమ దర్శకుడు సుకుమార్, ఉత్తమ దర్శకుడు (క్రిటిక్స్) ప్రశాంత్ వర్మ అవార్డులను అందుకున్నారు. దుబాయ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ నటుడు అల్లు అర్జున్ మాట్లాడుతూ ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందని అన్నారు. అవార్డు అందుకుంటే ఆ ఫీలింగ్ వేరేగా ఉంటుందని అన్నారు. ప్రతి సంవత్సరం తప్పకుండా అవార్డు ఇస్తున్న సైమాను అభినందిస్తున్నానని తెలిపారు.




ఉత్తమ చిత్రం : కల్కి
ఉత్తమ దర్శకుడు : సుకుమార్
ఉత్తమ దర్శకుడు (క్రిటిక్స్) : ప్రశాంత్ వర్మ
ఉత్తమ నటుడు :అల్లు అర్జున్
ఉత్తమ నటుడు (క్రిటిక్స్) : తేజ సజ్జా
ఉత్తమ నటి : రష్మిక మందన్నా
ఉత్తమ నటి (క్రిటిక్స్) :మీనాక్షి చౌదరి
ఉత్తమ సహాయ నటుడు: అమితాబ్ బచ్చన్
ఉత్తమ సహాయ నటి : అన్నే బెన్
ఉత్తమ సంగీత దర్శకుడు : దేవి శ్రీ ప్రసాద్ (డీఎస్పీ)
ఉత్తమ గీతరచయిత : రామ్ జోగయ్య శాస్త్రి
ఉత్తమ గాయకుడు : శంకర్ బాబు కందుకూరి
ఉత్తమ గాయని : శిల్పా రావు
ఉత్తమ ప్రతినాయకుడు : కమల్ హాసన్
ఉత్తమ పరిచయ నటి : పంకూరి, భాగ్యశ్రీ
ఉత్తమ పరిచయ నటుడు : సందీప్ సరోజ్
ఉత్తమ పరిచయ దర్శకుడు : నంద కిషోర్ యేమని
ఉత్తమ కొత్త నిర్మాత : నిహారిక కొణిదెల
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ : రత్నవేలు
ఉత్తమ హాస్యనటుడు : సత్యలకు అవార్డులు అందుకున్నారు.

# గోదావరి ఫేజ్-2,3 ప్రాజెక్టుకు శ్రీకారం

### సిఎం చేతుల మీదుగా గండిపేట వద్ద శంకుస్థాపన

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ నగరానికి 20 టిఎంసిల అదనపు నీటిని తరలించడానికి, మూసీ పునరుజ్జీవనంకోసం జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి రూ. 7,360 కోట్ల వ్యయంతో గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్2, 3 ప్రాజెక్టుకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాలకు అన్ని సోర్సుల నుంచి 580 ఎంజిడిల నుంచి 600 ఎంజిడిల నీరు సరఫరా చేస్తున్నారు. 2030వ సంవత్సరం వరకు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని 300 ఎంజిడిల అదనపు జలాలను సరఫరా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గోదావరి నది నుంచి మొత్తం 30 టిఎంసిల నీరు వాడుకునే వెసులుబాటు ఉండటంతో అదనపు జలాల కోసం గోదావరి ప్రాజెక్టు ఫేజ్2,3 లను రూపకల్పన చేసింది. 2027 సంవత్సరం వరకు హైదరాబాద్ నగర తాగునీటి డిమాండ్ 835 ఎంజిడిలకు పెరుగుతుంది. 2047 నాటికి ఈ సంఖ్య 1114 ఎంజిడిలుగా ఉండనుంది. అందులో భాగంగానే ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించనుంది. గోదావరి డ్రికింగ్ వాటర్ సప్లై పథకం ఫేజ్1 కింద నగర ప్రజల నీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టిఎంసిల నీరు తరలిస్తోంది. తాజాగా పథకంలో రెండు దశల ద్వారా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి మరో 20 టిఎంసిల నీరు వాడుకునే అవకాశం ఉంది. ఈ 20 టిఎంసిల్లో 17.5 టిఎంసిలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు పోగా, మూసీ ప్రక్షాళనలో భాగంగా, జంట జలాశయాలను పునరుజ్జీవనం చేసేందుకు మిగిలిన 2.5 టిఎంసిలను ఉపయోగించనున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రెండు లాభాలున్నాయి. ఒకటి హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చడం, రెండోది మూసీ ప్రక్షాళన, జంట జలాశయాల పునరుజ్జీవం చెయ్యడం. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్‌ను వాప్ కోస్ అనే కంపెనీ సిద్ధం చేసింది. ఇందులో పంప్ హౌజ్‌లు, సబ్ స్టేషన్లు, మల్లన్న సాగర్ నుంచి ఘన్ పూర్ వరకు 3000 ఎంఎం డయా భారీ పైపు లైన్ నిర్మించనున్నారు. ఘన్ పూర్, శామీర్ పేట్ వద్ద 1170 ఎంఎల్‌డిల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాన్ని (డబ్ల్యూటీపీ) నిర్మించనున్నారు. ఘన్ పూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణంతో పాటు ఇతర పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్ 2, 3 ద్వారా 300 ఎంజీడీల నీరు సరఫరా చేస్తారు.




## 'రేపు' రవీంద్రభారతిలో రమాదేవికి సాహితీ పురస్కారం-2025 ప్రదానం

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు పేరుతో తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతి ఏటాప్రతిష్టాత్మకంగా ప్రదానం చేసే 'సాహితీ పురస్కారం2025' ప్రస్తుత ఏడాదికి ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, కాలమిస్ట్ నెల్లుట్ల రమాదేవిని ఎంపిక చేశారు. సాహితీ పురస్కార ఎంపిక నిమ్మితం రాష్ట్ర ప్రభుత్వం లోకకవి, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ నెల్లుట్ల రమాదేవిని ఎంపిక చేయగా,ఇందుకు సిఎం రేవంత్ రెడ్డి ఆమోదించి, అభినందనలు తెలిపారు. కాళోజీ జయంతి ఉత్సవాలలో భాగంగా, తెలంగాణ భాషా దినోత్సవం సంబరాలలో భాగంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈనెల 9న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కాళోజీ జయంతి వేడుకలలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు, పొన్నం ప్రభాకర్ తదితర ప్రముఖుల హాజరుకానున్నారు.

## బిజెపి అడ్డుకుంటోంది

(మొదటి పేజీ తరువాయి)

సొమ్ము వాటాల పంపకాల్లో తేడా రావడంతో ఎమ్మెల్సీ కవిత బయట పెట్టిందని, ఇదే విషయం ఐదేళ్ల క్రితం చెప్పి ఉంటే కవితను ప్రజలు నమ్మేవారని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కామారెడ్డి గడ్డమీద బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించామని తెలిపారు. హామీ ప్రకారం మూడు బిల్లులు చేసి కేంద్రానికి పంపామని అన్నారు. కామారెడ్డిలో ముఖ్య నాయకులతో కాంగ్రెస్ సన్నాహక సమావేశం, బిసి డిక్లరేషన్ విజయోత్సవ సభ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. అంతకు ముందు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, వాకాటి శ్రీహరిలతో కలిసి ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో 15న జరిగే భారీ బహిరంగ సభ (ఇందిరాగాంధీ స్టేడియం)లో స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్, లక్ష్మీ కాంతరావులతో కలిసి మంత్రుల బృందంతో మహేశ్‌కుమార్ మాట్లాడారు. బిసికు రిజర్వేషన్ అమలు చేసి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి నిరూపించుకుంటుందన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరగనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భారత్ సంచలనం!

(మొదటి పేజీ తరువాయి)

ఓడించింది. మూడుసెట్ల తర్వాత ఇరుజట్లు 176–176 పాయింట్లతో సమంగా ఉన్నాయి. అయితే నిర్ణయాత్మక చివరి సెట్‌లో భారత జట్టు తమ ప్రతిభను ప్రదర్శించి 59 పాయింట్లు సాధించి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంది.

**మిక్స్‌డ్ టీమ్‌కు రజత పతకం**

భారత పురుషుల జట్టు స్వర్ణం సాధించగా.. మరోవైపు జ్యోతి సురేఖ వెన్నం, రిషబ్ యాదవ్‌ల కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో నెదర్లాండ్స్ చేతిలో 155–157 తేడాతో స్వల్ప తేడాతో ఓడి రజత పతకాన్ని గెలుచుకుంది. కేవలం రెండు పాయింట్ల తేడాతో స్వర్ణ పతకాన్ని మిస్ చేసుకుంది. ఈ జంట కూడా టోర్నమెంట్ అంతటా అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది.

**రిషభ్ యాదవ్, జ్యోతి సురేఖల అద్భుత ఫామ్**

ఈ సంవత్సరం రిషభ్ యాదవ్, జ్యోతి కలిసి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. మేలో షాంఘైలో జరిగిన ప్రపంచ కప్ స్టేజ్ 2లో వీరు ప్రపంచ రికార్డు సృష్టించారు. అలాగే సెంట్రల్ ఫ్లోరిడాలో జరిగిన ప్రపంచ కప్ స్టేజ్ 1లో స్వర్ణం, మాడ్రిడ్‌లో జరిగిన ప్రపంచ కప్ స్టేజ్ 4లో కాంస్యం సాధించారు. ఈ విజయాలు భారత ఆర్చరీ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నాయి.

## మోదీ దేశానికి శత్రువయ్యారు!

(మొదటి పేజీ తరువాయి)

విధించారని, 50 శాతం సుంకాల తర్వాత అతను మన దేశ ప్రజలను నాశనం చేశారన్నారు. 'మీరు మీ సిద్ధాంతాన్ని అనుసరించండి కానీ దేశ ప్రజలను రక్షించండి, ఎందుకంటే మొదట దేశం, మీ స్నేహం ద్వితీయం' ఖర్గే హితవు పలికారు. భారత దేశం దశాబ్దాలుగా తటస్థత, అలీన విదేశాంగ విధానాన్ని అనుసరిస్తోందని, అది ఆ మార్గంలోనే కొనసాగాలని ప్రధానమంత్రి గ్రహించాలని ఖర్గే కోరారు. సవరించిన జిఎస్‌టి రేట్లపై, పేదలకు ప్రయోజనం చేకూర్చే ఏ చర్యనైనా కాంగ్రెస్ స్వాగతిస్తుందని, కానీ బిజెపి ప్రభుత్వం సంవత్సరాలుగా ప్రజలను వేధిస్తోందని ఖర్గే అన్నారు. తమ ఈ అంశాన్ని ఎనిమిది సంవత్సరాల క్రితం లేవనెత్తాని, రెండు శ్లాబులు ఉంటే, అది పేదలకు ప్రయోజనం చేకూరుస్తుందని తాము చెప్పొన్నారు. అయినా పెడచెవిన నాలుగు నుండి ఐదు శ్లాబులను ప్రవేశపెట్టి ప్రజలను దోచుకున్నారని మండిపడ్డారు. ఎన్నికలు సమీపించిన తర్వాత కొన్ని ఇబ్బందులను ఎదుర్కొని జిఎస్‌టి శ్లాబులను సవరించారని ఆయన పేర్కొన్నారు. చైనా చొరబాటు సమయంలో 'ఎవరూ భారత భూభాగంలోకి ప్రవేశించలేదు' అని మోదీ గతంలో చేసిన వాదనను కూడా ఖర్గే ప్రస్తావించారు. 'ఇప్పుడు మోదీ స్వయంగా చైనాలోకి ప్రవేశించారు' అని ఆయన ఎత్తి చూపారు. జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నప్పటికీ, మోదీ మద్దతును దుర్వినియోగం చేయడానికి అనుమతించమని కాంగ్రెస్ అధ్యక్షుడు నొక్కి చెప్పారు. 'దేశం విషయానికి వస్తే మనం ఒకటే. అందులో ఎటువంటి సందేహం లేదు. కానీ మీకు మద్దతు ఇస్తున్నందున, మీరు ఏకపక్షంగా ఏదైనా చేయాలని దీని అర్థం కాదు. మేము దీనిని అనుమతించబోము' అని ఆయన అన్నారు. ట్రంప్‌తో బహిరంగంగా పొత్తు పెట్టుకోవడం ద్వారా భారతదేశ అంతర్జాతీయ ఖ్యాతిని మోదీ దెబ్బతీశారని ఖర్గే ఆరోపించారు. 'ట్రంప్ నా స్నేహితుడు' 'ఫిర్ ఏక్ బార్ ట్రంప్' (ట్రంప్, మరోసారి) అని చెప్పడం ద్వారా ఆయన భారతదేశ స్థానాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. భారతదేశం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అనుసరిస్తున్న అలీన విధానాన్ని కొనసాగించి ఉంటే అటువంటి పరిస్థితి తలెత్తేది కాదని అన్నారు. బిహార్‌లో రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ ఎత్తిచూపాలని యోచిస్తున్న అంశాలను ఖర్గే వెల్లడించారు. 'మాకు చాలా సమస్యలు ఉన్నాయి; నిరుద్యోగం, శాంతి భద్రతలు, మహిళలపై లైంగిక దాడులు... దళితులు, వెనుకబడిన తరగతులకు స్కాలర్‌షిప్‌లు అందడం లేదు, రైతులకు ఎరువులు అందడం లేదు. 'ఓట్ల దొంగతనం' అంశం కూడా మా ప్రధాన ఎజెండా' అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాలెట్ పేపర్లను ఉపయోగించి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించడం గురించి, ఖర్గే మాట్లాడుతూ ఇది మంచి పరిణామమని అన్నారు.

**ఇసి ఓటు చోరులను కాపాడుతోంది**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల కమిషన్ (ఇసి)పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా ఇసి ఓటు చోరులను కాపాడుతూ వస్తూ.. కీలక సమాచారాన్ని దాచి పెట్టిందని విమర్శించారు. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా నుంచి ఓట్లను తొలగించడానికి చేసిన యత్నానికి సంబంధించిన కీలకమైన డేటాను ఇప్పటికీ ఎన్నికల కమిషన్ బయటపెట్టలేదని అన్నారు. మే 2023 కర్ణాటక ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించాలని చేసిన ప్రయత్నాలను తమ పార్టీ బయటపెట్టిందని ఖర్గే పేర్కొన్నారు. అప్పట్లో దీనివల్ల వేలమంది ఓటర్లు తమ ఓటు హక్కులు కోల్పోయారన్నారు. ఓటర్లను మోసం చేయడానికి జరిగిన భారీ ప్రయత్నానికి స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నప్పటికీ కీలక విషయాలను దాచిపెట్టి.. ఓట్ల చోరీ వెనక ఉన్న వారిని ఇసి సమర్థంగా రక్షించిందన్నారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడటమే లక్ష్యంగా ఇసి పదేళ్లుగా పని చేస్తోందన్నారు. అందుకు చట్టాలను మార్చడానికి కూడా వెనకాడట్లేదన్నారు. నాడు కర్ణాటకలో చేసిన విధంగా ప్రస్తుతం బిహార్ లోనూ ఓటు చోరీకి పాల్పడడానికి కేంద్రం, ఈసీ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. కేంద్రం చేస్తున్న కుట్రలో భాగంగానే ప్రస్తుతం బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఓట్ల చోరీ ద్వారా గెలవడానికి యత్నిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాలలో ఎన్డీయే ప్రభుత్వం ఓట్ల చోరీ చేసిందని.. బిహార్‌లో మాత్రం బిజెపి, ఇసిని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని అన్నారు. త్వరలో ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కూలిపోతుందన్నారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా బిహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారుతుందన్నారు.

## మంత్రివర్గ భవనం ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)



చేసినట్లు ఉక్రేన్ వైమానికదళ అధికార ప్రతినిధి యూరీ ఇహ్నాత్ చెప్పారు. యుద్ధం మొదలైన తర్వాత ఇదే అతిపెద్ద దాడి అని చెప్పారు. వివిధ రకాల 13 క్షిపణులను రష్యా ప్రయోగించిందని చెప్పారు. ఐనప్పటికీ 747 డ్రోన్లు, మరో నాలుగు క్షిపణులను విధ్వంసం సృష్టించకుండా తటస్థీకరించినట్లు చెప్పారు.

జెలెన్‌స్కీసహా ప్రధానమంత్రి యులియా స్విరిడెంకో ఈ దాడులను ఖండించారు. ఇప్పటివరకూ రష్యా ఎప్పుడూ ఉక్రేన్ ప్రభుత్వ ప్రధాన కార్యాలయ భవంతులపై దాడులు చేయలేదనీ, మొట్టమొదటిసారి శత్రుదాడుల్లో తమ ప్రధాన ప్రభుత్వ భవనం ధ్వంసమైందని చెప్పారు. ఈ భవంతులను తాము తర్వాత పునరుద్ధరిస్తామని, కానీ ప్రాణహాని కలిగిందని చెప్పారు. ఈ దాడులపై ప్రపంచదేశాలు తక్షణం ప్రతిస్పందించాలని కోరారు. రష్యాపై కఠిన ఆంక్షలు విధించాలని ఆమె కోరారు. గడచిన రెండు వారాల్లో ఉక్రేన్‌పై ఇది రెండో అతిపెద్ద దాడి అని ఆమె చెప్పారు. ఒకసారి ఉక్రేన్‌లో యుద్ధం ముగింపు దశ కు వస్తే, ఆ దేశానికి పూర్తి భద్రతాహామీని ఇస్తామని, 26 దేశాల సేనలను ఉక్రేన్‌లో మోహరిస్తామని పారిస్‌లో జరిగిన యూరోపియన్ యూనియన్ సమావేశం నిర్ణయించింది. దీంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా ఉక్రేన్‌కు సెక్యూరిటీ గ్యారంటీలు ఇచ్చే విషయం పరిశీలిస్తామన్నారు. నాటో కూటమి ఉక్రేన్‌ను అడ్డుపెట్టుకుని ఉద్దేశపూర్వకంగా రష్యాను లక్ష్యంగా చేసుకుని తన సామ్రాజ్యవాదాన్ని విస్తరించే ప్రయత్నం చేస్తోందని ఇప్పటికే పలుసార్లు ప్రకటించిన పుతిన్ యూరోపియన్ యూనియన్ ప్రకటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమదేశాలకు హెచ్చరిక చేశారు. జెలెన్‌స్కీ కూడా స్పందిస్తూ, రష్యాపై ఆంక్షలు పెంచాలని ట్రంప్‌ను కోరారు. పుతిన్‌ను కలుసుకుని శాంతి ఒప్పందం చేసుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు.

**యూరప్ నాయకుల ఖండన**

కీవ్ ప్రధాన ప్రభుత్వ భవంతులపై రష్యా దాడులను పలు యూరప్‌దేశాల నాయకులు ఖండించారు. బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్‌మర్ ఈ దాడులపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పుతిన్‌కు శాంతిపట్ల ఎంతమాత్రం శ్రద్ధలేదని విమర్శించారు. ఉక్రేన్‌కు తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ విషయంలో వెనుకంజ వేసేదిలేదన్నారు. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, ఇయు కమిషన్ ఛైర్‌పర్సన్ ఉర్సులా వోండర్‌లేయన్, యూరోపియన్ యూనియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాసహా నార్వే, ఫిన్‌లాండ్, స్పెయిన్ దేశాల నాయకులు రష్యా దాడులను ఖండించారు. 20220 ఫిబ్రవరిలో ఉక్రేన్‌లో యుద్ధం ప్రారంభమైంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com